RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత్ శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:204 హైదరాబాద్, శనివారం, 15 ఫిబ్రవరి 2025 పేజీలు: 12 వెల: 1.00

## ప్రధాని మోదీకి ఎలాన్ మస్క్ గిఫ్ట్

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ పలువురు ప్రముఖులతో సమావేశమవుతోన్నారు. అందులోభాగంగా వాషింగ్టన్‌లోని బ్లెయిర్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో టెస్లా, స్పేస్ ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఎలాన్ మస్క్ ప్రత్యేక గిఫ్ట్ ఇచ్చారు. హెక్సాగ్నల్ సిరామిక్ హీట్ షీల్డ్ టైల్స్‌ను ప్రధాని మోదీకి ఎలాన్ మస్క్ అందజేశారు. దీనిపై 2024 అక్టోబర్ 13, స్టార్‌షిప్ ఫ్లైట్ టెస్ట్ 5 అని అక్షరాలు ముద్రితమై ఉన్నాయి.



ఈ సమావేశానికి ఎలాన్ మస్క్ తన భాగస్వామి షివోన్ జిలిస్ తోపాటు తన ముగ్గురు పిల్లల కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఎలాన్ మస్క్ పిల్లలకు సైతం ప్రధాని మోదీ బహుమతిగా నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన ది క్రిసెంట్ మూన్, ఆర్కే నారాయణ్ రచించిన పుస్తకాలతోపాటు విష్ణు శర్మ రచించిన పంచతంత్రం పుస్తకాలు అందజేశారు. అందుకు సంబంధించిన ఫొటోలను ప్రధాని నరేంద్ర మోదీ షేర్ చేశారు. అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ట్రంప్ ప్రభుత్వంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ వ్యవహారాలను మస్క్ వర్యవేక్షిస్తున్న సంగతి తెలిసిందే.

అలాగే ఈ భేటీ అనంతరం ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. ఎలాన్ మస్క్‌తో సమావేశం మంచిగా జరిగిందన్నారు. ఈ సమావేశంలో అంతరిక్షం, సాంకేతిక, ఆవిష్కరణ తదితర అంశాలపై చర్చించామని తెలిపారు. సంస్కరణల దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలు, కనీస ప్రభుత్వం – గరిష్ఠ పాలనతోపాటు వివిధ అంశాలపై మస్క్‌తో తాను మాట్లాడినట్లు ప్రధాని మోదీ తన పోస్ట్‌లో వివరించారు.

## అమెరికా, లండన్ బాటలో భారత్

### అక్రమ వలసల నియంత్రణ దిశగా అడుగులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14, వీసా, పాస్‌పోర్ట్ లేకుండా భారతదేశంలోకి ప్రవేశించే వారికి త్వరలో కఠినమైన శిక్షలు తప్పవు. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించే విదేశీయులకు ఐదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.5 లక్షల వరకు జరిమానా విధించేందుకు కేంద్ర సర్కార్ సిద్ధమవుతోంది. ఇందుకోసం కఠినమైన చట్టాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ బిల్లును పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ది ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ 2025 చట్టాన్ని తీసుకు వచ్చేందుకు కేంద్ర సర్కార్ కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. జాతీయ భద్రత, సార్వభౌమత్వానికి ముప్పు ఉందని పేర్కొంటూ ఒక విదేశీ పౌరుడు భారతదేశంలోకి ప్రవేశించడాన్ని నిరోధించడం ఇదే మొదటిసారి. ఇది మాత్రమే కాదు, ఒక విదేశీయుడికి మరొక దేశంతో ప్రత్యేక సంబంధం ఉంటే, అతను భారతదేశంలోకి ప్రవేశించకుండా నిషేధించవచ్చు. కొత్త చట్టం ప్రకారం, ఇమ్మిగ్రేషన్ అధికారిదే తుది నిర్ణయం. ఆయన తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందే. దీనికి ముందు కూడా, విదేశీ పౌరులు ప్రవేశించకుండా నిరోధించారు. కానీ ఇది ఏ చట్టం, ఏ నియమంలో స్పష్టంగా ప్రస్తావించలేదు. ఇప్పుడు ఈ నిబంధన చట్టంగా అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఇది వలస ప్రక్రియను మరింత కఠినతరం చేస్తుందని భావిస్తున్నారు. ఒక విదేశీయుడు నకిలీ పత్రాలను ఉపయోగించి భారతదేశంలోకి ప్రవేశిస్తే, అతన్ని దేశం నుండి బహిష్కరించడమే కాకుండా, రెండు సంవత్సరాల నుంచి ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. అంతేకాదు అదనంగా, రూ. లక్ష నుండి రూ. 10 లక్షల వరకు జరిమానా కూడా విధించవచ్చు. ప్రస్తుతం, వలసలు అడ్డుకునేందుకు విదేశీయులకు సంబంధించి నాలుగు ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయి. వీటిని కొత్త సమగ్ర చట్టంలో చేర్చాలని యోచిస్తున్నారు. ఈ కొత్త నియమాలు 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025' కింద వస్తాయి. దీని కింద, పాత చట్టాలను విలీనం చేయడం జరుగుతుంది. విదేశీయుల చట్టం, 1946, పాస్‌పోర్ట్ చట్టం, 1920, విదేశీయుల రిజిస్ట్రేషన్ చట్టం, 1939 మరియు ఇమ్మిగ్రేషన్ (కెరీర్ లయబిలిటీ) చట్టం, 2000. కొత్త చట్టం అమలు తర్వాత, ఈ నాలుగు పాత చట్టాలను సమగ్ర చట్టాన్ని రూపొందించడానికి సవరిస్తారు. తద్వారా విదేశీ పౌరుల పర్యవేక్షణ మరియు దేశ భద్రతను బలోపేతం చేయవచ్చు. ప్రస్తుతం భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారికి గరిష్టంగా ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తున్నారు. ఒక వ్యక్తి నకిలీ పాస్‌పోర్ట్‌తో భారతదేశానికి వస్తే, అతనికి గరిష్టంగా ఎనిమిది సంవత్సరాల జైలు శిక్ష, రూ. 50,000 వరకు జరిమానా విధించడం జరుగుతుంది. కొత్త చట్టం ప్రకారం, ఉన్నత విద్య కోసం భారతదేశంలోని ఏదైనా విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందే ఏ విదేశీ విద్యార్థి అయినా వారి సమాచారాన్ని విదేశీయుల నమోదు అధికారులకు అందించాల్సి ఉంటుంది. అలాగే, విదేశీ పౌరులకు వసతి అందుబాటులో ఉన్న ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, వైద్య సంస్థలకు కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. అయితే ఒక విదేశీయుడు నిర్దేశించిన వీసా వ్యవధికి మించి భారతదేశంలో ఉండిపోతే, వీసా నియమాలను ఉల్లంఘిస్తే లేదా ఏదైనా నిషేధిత ప్రాంతాన్ని సందర్శిస్తే, వారికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రూ. 3 లక్షల వరకు జరిమానా కొన్ని సందర్భాల్లో రెండూ అనుభవించాల్సి ఉంటుంది. ఒక విదేశీ పౌరుడికి చెల్లుబాటు అయ్యే వీసా లేదా పాస్‌పోర్ట్ లేకపోతే, అతన్ని భారతదేశానికి తీసుకువచ్చే వ్యక్తి కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాంటి వ్యక్తిపై ఇమ్మిగ్రేషన్ అధికారులు రూ.5 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ప్రతిపాదిత బిల్లు ప్రకారం, ఏ విదేశీ పౌరుడైనా భారతదేశంలోకి ప్రవేశించడాన్ని నిషేధించడానికి, భారతదేశం విడిచి వెళ్లమని ఆదేశించడానికి, ఒక నిర్దిష్ట ప్రాంతంలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి, అతని బయోమెట్రిక్ డేటాను నమోదు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉంటుంది. ఈ కొత్త చట్టంతో, భారతదేశ సరిహద్దుల భద్రతను మరింత బలోపేతం చేయవచ్చు. అక్రమంగా ప్రవేశించేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం వల్ల దేశంలో భద్రతా వ్యవస్థ మరింత ప్రభావవంతంగా మారుతుంది. వీసా నిబంధనలను ఉల్లంఘించే వారిని అరికట్టవచ్చు.

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అగ్ర రాజకీయ నేతలంతా యూత్ కాంగ్రెస్ నుంచే వచ్చారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ( అన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సైతం యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారేనని రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడిగా జక్కిడి శివచరణ్ ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హైదరాబాద్ గాంధీ భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శివచరణ్ బాధ్యతలు స్వీకరించారు.




హనుమంతరావు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చంద్రబాబు, కేసీఆర్ యూత్ కాంగ్రెస్‌లో పని చేశారని ముఖ్యమంత్రి రేవంత్ గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా అక్కడ్నుంచే వచ్చారని పేర్కొన్నారు. రాజకీయాలకు యూత్ కాంగ్రెస్ అనేది మొదటిమెట్టని ఆయన చెప్పుకొచ్చారు. పదవులు వచ్చినా, రాకపోయినా కాంగ్రెస్ శ్రేణులు మాత్రం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉండాలని సూచించారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.."తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. పేదల ఆత్మగౌరవం కోసం ఇళ్లు కట్టిస్తున్నాం. డబుల్ బెడ్‌రూమ్ పేరుతో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మోసం చేశారు. ఆయన మోసం చేశారు కాబట్టే ప్రజలు మనకు అధికారం ఇచ్చారు. స్థానిక సంస్థల్లో యూత్ కాంగ్రెస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు ఇస్తాం. ఫ్లెక్సీలు కట్టి దండలు పెట్టేవారికి పదవులు రావు. ఢిల్లీ నుంచి కాదు.. గల్లీ నుంచి వచ్చిన వారికే పదవులు ఇస్తాం. దేశంలోనే ఎవరూ చేయనంత రుణమాఫీ తెలంగాణ రైతాంగానికి చేశాం.

భూమి లేని వారికి రూ.12 వేలు ఇస్తున్నాం. 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసి చూపించాం. ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను యూత్ కాంగ్రెస్ నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎన్నికల్లో డబ్బుతో ఎవరూ గెలవలేరు. మేము ప్రజాభిమానంతో గెలిచాం. డబ్బులే గెలిపిస్తాయంటే కేసీఆర్‌కు 100 సీట్లు వచ్చి ఉండేవి. కొడితే గట్టిగా కొడతామని కేసీఆర్ అంటున్నారు. కేసీఆర్‌ను కొట్టాలంటే కేటీఆర్, కవిత, హరీశ్‌నే కొట్టాలి. కేసీఆర్‌ను కేటీఆర్ ఓడించారు, కేజ్రీవాల్‌ను కవిత ఓడించింది. కల్వకుంట్ల కుటుంబం అవినీతి చూసే ప్రజలు బుద్ధి చెప్పారు. దేశంలో కులగణన చేసిన ఏకైక ప్రభుత్వం మాది.

కులగణన, ఎస్సీ వర్గీకరణపై పక్కాగా చేసిన మా లెక్కలు తప్పంటారా. కేసీఆర్ ఒక్క రోజే సర్వే చేసి కాకిలెక్కలు చూపించారు. చెట్ల మీద విస్తరాకులు కుట్టినట్టుగా గతంలో సర్వే చేశారు. తెలంగాణలో జీవించే హక్కు కేసీఆర్‌కు లేదు. గ్యాంబ్లర్స్ అంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. కులాల లెక్కలు ఎవ్వటికీ తేలకూడదనే ఆ పార్టీ నేతలు పన్నాగం పన్నుతున్నారు. కేసీఆర్ లాంటి వాళ్ల తెలివి, బలిసి సర్వేలో పాల్గొనలేదు. జనాభా లేకపోయినా రావులంతా పదవులు పంచుకున్నారు. బీసీలు ఆ లెక్కలు అడుగుతారనే అడ్డుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన నా కోసం కాదు.. క్రమశిక్షణ కలిగిన సీఎంగా కులగణన చేయించా. దొంగ లెక్కలు చెప్పాలనుకుంటే మా కులాన్ని ఎక్కువ చూపించేవాళ్లం. బీసీ కులగణనకు రెండో విడత కూడా అవకాశం ఇచ్చాం.

ప్రధాని నరేంద్ర మోదీ బీసీ కాదు.. లీగల్లీ కన్వర్టెడ్ బీసీ. 2002 వరకు మోదీది ఉన్నత వర్గమే. ఆయన గుజరాత్ సీఎం అయ్యాక తన కులాన్ని బీసీల్లో కలిపారు. అన్నీ తెలుసుకునే మోదీ కులం గురించి మాట్లాడుతున్నా. కులగణన సర్వేలో పాల్గొని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును సామాజిక బహిష్కరణ చేయాలని తీర్మానం చేశాం. లెక్కల్లో పాల్గొనాలని కేసీఆర్, కేటీఆర్ ఇళ్ల ముందు డప్పు కొట్టండి" అని అన్నారు.

## ట్రంప్ సుంకాలకు... మోడీ దెబ్బ...

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14,

ప్రపంచ సుంకాల యుద్ధంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన టారిఫ్ దాడి నేపథ్యంలో, భారతదేశం తగిన ప్రతిదాడితో సరైన సమాధానం చెప్పింది. ప్రపంచ సుంకాల యుద్ధం సవాళ్లను ఎదుర్కోవడానికి, భారతదేశం, నాలుగు యూరోపియన్ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్యాన్ని అమలు చేయబోతోంది. దీనివల్ల, భారతదేశం ఆ దేశాలతో ఎటువంటి ఆటంకం లేకుండా వాణిజ్యం నిర్వహించుకునేందుకు వీలు కలుగుతుంది. అంటే, అమెరికా విధించిన సుంకాల ప్రభావం భారత్‌పై పరిమితంగానే ఉండనుంది. భారతదేశం – నాలుగు యూరోపియన్ దేశాలు కలిసి మాట్లాడుకుని, సుంకాల అడ్డంకులను పరిష్కరించడానికి సమర్థవంతమైన ప్రభావవంతమైన పరిష్కారాలను కనుగొంటాయి. దీనికోసం, భారతదేశం, కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇతఃలు డెస్క్‌ను ఏర్పాటు చేసింది. ఇతఃలు అంటే "యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్". ఇది సభ్య దేశాల మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్యాన్ని సులభంగా మారుస్తుంది. గత ఏడాది (2024) మార్చి 10న, ఏర్పాటు కోసం ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీన్ని "వాణిజ్యం ఓ ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం అని పిలుస్తున్నారు. ఈ అగ్రిమెంట్ ఈ సంవత్సరం ముగింపు నాటికి అమల్లోకి వస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ సోమవారం వెల్లడించారు. భారత్ మంటపంలో ఇతఃలు కోసం ప్రత్యేక డెస్క్‌ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. నార్వే, స్విట్జర్లాండ్, ఐస్‌లాండ్, లీచ్‌టెన్‌స్టెయిన్ సభ్య దేశాలు. ఇవి నాలుగు యూరోపియన్ యూనియన్ వెలుపల ఉన్న దేశాలు. ప్రత్యేక డెస్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్విట్జర్లాండ్ విదేశాంగ మంత్రి హెలెన్ బడ్లిగర్ ఆర్టిడా, నార్వే వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రి టోమస్ నార్వోల్, ఐస్లాండ్ శాశ్వత విదేశాంగ మంత్రి మార్టిన్ ఐజోల్ఫ్సన్, లీచ్టెన్‌స్టెయిన్ విదేశాంగ మంత్రి డొమినిక్ హాస్లర్ పాల్గొన్నారు. డొనాల్డ్ ట్రంప్ సుంకాల దాడి తర్వాత, గ్లోబల్ బిజినెస్ లీడర్ల ఆందోళనల మధ్య, భారతదేశంలో ఇతఃలు డెస్క్ ఏర్పాటు కీలకంగా మారింది. వచ్చే 15 సంవత్సరాలలో, ఈ నాలుగు దేశాల నుంచి భారతదేశం 100 బిలియన్ అమెరికన్ డాలర్ల (రూ. 8.75 లక్షల కోట్లు) విలువైన పెట్టుబడి ప్రతిపాదనలను అందుకోనుంది. స్విస్ గడియారాలు, చాక్లెట్లు, కట్ ఓ పాలిష్ చేసిన వజ్రాలు వంటి అనేక ఉత్పత్తులు చాలా తక్కువ ధరలకు లభిస్తాయి. మన దేశంలో కార్యకలాపాలు ప్రారంభించాలని చూస్తున్న ఇతఃలు కంపెనీలకు ఇతఃలు డెస్క్ మద్దతు అందిస్తుంది. కొత్తగా సుమారు 10 లక్షల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని అంచనా వేశారు. మరో 50 లక్షల నుంచి 60 లక్షల వరకు ప్రత్యక్ష ఓ పరోక్ష ఉద్యోగాలకు అవకాశం ఉందని పీయూష్ గోయల్ చెప్పారు. భారతదేశం ఇప్పటి వరకు కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల్లో ఇతఃలు ప్రత్యేకంగా నిలుస్తుంది. 27 దేశాల సమూహం అయిన యూరోపియన్ యూనియన్‌తో భారతదేశం విడిగా సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతోంది



## కాంగ్రెస్ ఓటమి ఖాయం.. వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే

సంగారెడ్డి, ఫిబ్రవరి 14: తెలంగాణ మొత్తం కల్వకుంట్ల కుటుంబం చుట్టూ తిరిగేలా పదేళ్లు పరిపాలన చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు రావాలని కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా పూర్తిగా వైఫల్యం అయిందని విమర్శించారు. పదేళ్లలో బీఆర్ఎస్ పై వ్యతిరేకత వస్తే కాంగ్రెస్ పార్టీపై పది నెలల్లోనే వ్యతిరేకత పెరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. "రాష్ట్రంలో మార్పు రాలేదు... మారింది సీఎం, పార్టీ జెండా మాత్రమే.. పరిపాలన మాత్రం అలానే ఉంది" అని అన్నారు. బీజేపీ మాత్రమే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తుందని తెలిపారు. బీజేపీ అభ్యర్థులు గెలిస్తే ప్రశ్నించే గొంతుకగా శాసనమండలిలో ఉంటారన్నారు. బీఆర్ఎస్ పార్టీ శాసనమండలిని నిర్వీర్యం చేసిందని వ్యాఖ్యలు చేశారు. అసలు శాసనమండలి ఉందా లేదా అన్న అనుమానం కలిగేటట్టు బీఆర్ఎస్ వ్యవహరించిందన్నారు.

హైదరాబాద్‌లో నిరుద్యోగుల వద్దకు వచ్చి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కేంద్రం పీఆర్సీ ప్రకటించినా రాష్ట్రంలో మాత్రం ఇప్పటి వరకు ప్రకటించలేదన్నారు. రాబోయే రోజుల్లో కొత్త ఇంటర్నేషనల్ స్కూల్ మాట దేవుడెరుగు ఉన్న స్కూళ్లకు రంగులు వేయలేని పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్, బీఆర్ఎస్ దెబ్బతీశాయని దుయ్యబట్టారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్, కరీంనగర్ యూరియా ఫ్యాక్టరీ, ఎన్‌టీపీసీలో విద్యుత్ ఉత్పత్తి అంతా బీజేపీ హయాంలోనే జరిగిందని తెలిపారు. రైతులకు సబ్సిడీతో ఎరువులు అందిస్తున్నది మోదీ ప్రభుత్వమని స్పష్టం చేశారు

రైతులకు గిట్టుబాటు ధర కల్పించింది మోదీ అని అన్నారు. 2014లో మోదీ ప్రధాని కాక ముందు 3 వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేస్తే ఇప్పుడు 26 వేల కోట్లతో తెలంగాణ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. "కేంద్రం ఏం చేసింది అంటూ మాట్లాడుతున్నారు. కేసీఆర్, రేవంత్ కలిసి వస్తే రండి. పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఏం చేసిందో చూపిస్తాం. గ్రామ పంచాయితీలకు రాష్ట్రం నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. హరీష్ రావు, కేటీఆర్ కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమా" అంటూ సవాల్ విసిరారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీకి ప్రధాని మోదీ వస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పడుకున్నారని మండిపడ్డారు. రాబోవు అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుండు సున్నా మాత్రమే వస్తుందన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ ఓటమి ఖాయమన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

# ఎగుమతులతో భారత్ చరిత్ర

భారతదేశ ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఎగుమతుల్లో చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ రికార్డు స్థాయిలో 800 బిలియన్ డాలర్లను సాధిస్తుందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు మంచి సంకేతమన్నారు.ఎగుమతుల పరంగా భారతదేశం చరిత్ర సృష్టించే దిశగా పయనిస్తోంది. ఈ విషయంలో వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ సమాచారం ఇచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత ఎగుమతులు తొలిసారిగా రికార్డు స్థాయిలో 800 బిలియన్ డాలర్లకు చేరువలో ఉంది. జూన్ 2025 తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలో ఉల్లిపాయ, టమోటా, బంగాళాదుంపల ఉత్పత్తి పెరుగుతుందని భావిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ఈ సమాచారాన్ని అందించింది.భారత ఎగుమతులు పెరుగుతున్నాయని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ రాజ్యసభకు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలలో ఎగుమతుల్లో మంచి పెరుగుదల నమోదు చేసింది. ఈ సంవత్సరం కూడా పెరుగుదల కొనసాగుతుంది. "భారతదేశ చరిత్రలో తొలిసారిగా, మన ఎగుమతులు 800 బిలియన్ డాలర్లను దాటుతాయి" అని గోయల్ ప్రశ్నోత్తరాల సమయంలో అన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ శుక్లా అడిగిన ప్రశ్నకు సమాధానంగా, భారతదేశ ఎగుమతులు పెరగుతున్నాయని స్పష్టం చేశారు.విదేశీ మారక నిల్వలు పడిపోవడంపై ఉన్న ఆందోళనలను గోయల్ తోసిపుచ్చారు. చాలా నెలలుగా ఇది స్థిరంగా 600 బిలియన్ డాలర్లపైన ఉందని ఆయన అన్నారు. అయితే, దేశీయ కొరత, అధిక డిమాండ్ కారణంగా కొన్ని దిగుమతులు అవసరమని మంత్రి అన్నారు. దిగుమతుల పెరుగుదల ఆర్థిక వ్యవస్థకు మంచి సంకేతం. దేశీయ వినియోగం పెరగడమే దీనికి కారణం. దిగుమతి చేసుకున్న వస్తువులలో పెట్రోలియం ఉత్పత్తులు, కోకింగ్ బొగ్గు, పప్పుధాన్యాలు, తినదగిన నూనెలు ఉన్నాయన్నారు.'ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేసి ప్రారంభించడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఈ కాలంలో, దిగుమతులు స్పష్టంగా పెరుగుతాయి. ఒక ప్రాంతంలో దిగుమతులు పెరిగినప్పుడు, పరిశ్రమలు ఆ ప్రాంతం వైపు ఆకర్షితులవుతాయి. దీనివల్ల ఉపాధి పెరుగుతుంది. పెట్టుబడి కూడా పెరుగుతుంది. 2025-26 బడ్జెట్ మధ్యతరగతికి పన్ను ఉపశమనం కల్పించడం ద్వారా వినియోగ వ్యయాన్ని కూడా పెంచిందని కేంద్ర మంత్రి తెలిపారు. రాజ్యసభలో ఎగుమతుల అద్భుతమైన పనితీరును పియూష్ గోయల్ వివరించారు. దిగుమతులు పెరగడానికి గల కారణాలను కూడా ఆయన వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కూడా ఎగుమతుల వేగం చెక్కుచెదరకుండా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.అదే సమయంలో, 2024-25లో ఉల్లిపాయలు, టమోటా, బంగాళాదుంపలు సహా అనేక ఉద్యానవన పంటల ఉత్పత్తి పెరుగుతుందని వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉల్లిపాయ ఉత్పత్తిలో గరిష్ట పెరుగుదల 19% ఉంటుంది. దీనితో పాటు, పండ్లు, తోటల పంటలు మరియు సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది. అయితే, మొత్తం సాగు విస్తీర్ణం గత సంవత్సరం కంటే కొంచెం తక్కువగా ఉంది.ఉల్లిపాయల విషయానికొస్తే, ఈ సంవత్సరం దాని ఉత్పత్తి 288.77 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనా. ఇది గత సంవత్సరం 242.67 లక్షల టన్నుల కంటే చాలా ఎక్కువ. టమోటా ఉత్పత్తి కూడా 215.49 లక్షల టన్నులుగా అంచనా వేశారు. బంగాళాదుంప ఉత్పత్తి 595.72 లక్షల టన్నులకు చేరుకుంటుంది. పండ్లలో, మామిడి, ద్రాక్ష, అరటి మంచి ఉత్పత్తి కారణంగా మొత్తం పండ్ల ఉత్పత్తి 1132.26 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనా. తోటల పంటల ఉత్పత్తి 179.37 లక్షల టన్నులుగా, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 119.96 లక్షల టన్నులుగా అంచనా వేశారు. వెల్లుల్లి, పసుపు ఉత్పత్తిలో కూడా పెరుగుదల నమోదైంది. మొత్తంమీద, ఉద్యానవన ఉత్పత్తి 2024-25లో 362.09 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంచనా, ఇది గత సంవత్సరం కంటే 2.07% ఎక్కువ. అయితే, సాగు విస్తీర్ణం గత సంవత్సరం 29.09 మిలియన్ హెక్టార్ల నుండి ఈ సంవత్సరం 28.84 మిలియన్ హెక్టార్లకు తగ్గింది.మనదేశం నుంచి పెట్రోలియం, రత్నాలు, వ్యవసాయ రసాయనాలు, చక్కెర భారీగా ఎగుమతి అవుతున్నాయి. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, గత ఐదు సంవత్సరాలుగా ఈ విభాగాలు ప్రపంచ మార్కెట్లలో తమ వాటాను పెంచుకున్నాయి. 2018?2023 మధ్య ఎలక్ట్రికల్ వస్తువులు, న్యూమాటిక్ టైర్లు, ట్యాప్లు, వాల్వ్లు, సెమీకండక్టర్ పరికరాల ఎగుమతులు పుంజుకున్నాయి. 2023లో పెట్రోలియం ఎగుమతులు 84.96 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2018లో 6.45 శాతంగా ఉన్న భారతదేశ మార్కెట్ వాటా గత ఏడాది 12.59 శాతానికి పెరిగింది. 2018లో 16.27 శాతంగా ఉన్న రత్నాల గ్లోబల్ షిప్‌మెంట్‌లలో దేశం వాటా గత ఏడాది 36.53 శాతానికి పెరిగింది. ఇది 1.52 బిలియన్ డాలర్ల ఎగుమతులతో దేశాన్ని అగ్రస్థానానికి చేర్చింది.

# వంశీని పక్కాగా బుక్ చేస్తున్నారే

విజయవాడ, ఫిబ్రవరి 15, (

వల్లభనేని వంశీ అరెస్టుపై టీడీపీ, వైసీపీ మధ్య డైలాగ్ వార్ జరుగుతోంది. వంశీ అరెస్టును వైసీపీ నేతలు ఖండిస్తుంటే.. లోకేష్ రెడ్ బుక్ ఓపెన్ అయ్యిందని టీడీపీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. లిస్టులో మరికొందరు ఉన్నట్టు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. కిడ్నాప్, దాడికి సంబంధించిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి.. వంశీకి నోటీసులు ఇచ్చారు. వంశీని అరెస్టు చేస్తున్నట్టు ఆయన భార్యకు పోలీసులు తెలియజేశారు. అయితే ఈ వ్యవహారంపై వైసీపీ, టీడీపీ మధ్య డైలాగ్ వార్ జరుగుతోంది. వంశీ అరెస్టును వైసీపీ ఖండించగా.. టీడీపీ నాయకులు సమర్థిస్తున్నారు.'వంశీ అరెస్టను ఖండిస్తున్నాం. ఉపసంహరించుకున్న కేసులో అరెస్ట్ ఏంటి. కక్షపూరిత రాజకీయాలు ఉండకూడదు. ఇలాంటి రాజకీయాలు మంచిది కాదు' అని మాజీమంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. 'రాష్ట్రంలో రెడ్ బుక్ పాలనకి వల్లభనేని వంశీ అక్రమ అరెస్ట్ ప్రత్యక్ష ఉదాహరణ. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడు కేసు వెనక్కి తీసుకున్నాడు. అయినా అక్రమంగా వంశీని అరెస్ట్ చేయడమేంటి? వంశీ అరెస్టను తీవ్రంగా ఖండిస్తున్నాం' అని పలువురు వైసీపీ నేతలు స్పష్టం చేశారు'వల్లభనేని వంశీ లాంటి వారిని వేటాడే ఆట మొదలైంది. వంశీ, దేవినేని అవినాష్, కొడాలి నాని చీడపురుగులు. కన్నతల్లి లాంటి పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. ఎన్టీఆర్ కుమార్తె నారా భువనేశ్వరిని ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన వంశీకి తగిన శాస్తి జరిగింది. వంశీ అరెస్టుతో కూటమికి ఓటేసిన ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. లోకేష్ రెడ్ బుక్ ఓపెన్ అయితే రిజల్ట్ ఎలా ఉంటుందో ఈరోజు నుంచి తెలుస్తుంది. వంశీ, అతని అనుచరులు నా ఇంటి పైన దాడికి వచ్చిన సందర్భంలో ఆనాడు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాను. నేను ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలి' అని టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం డిమాండ్ చేశారు.వంశీపై కేసులు నమోదు చేసే క్రమంలో పోలీసులు ఆధారాలు క్రాస్ చెక్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వంశీపై ఫిర్యాదు చేసిన కిరణ్, సత్య వర్ధన్ కుల ధ్రువీకరణ పత్రాల కావాలంటూ విజయవాడ రూరల్ ఎమ్మార్వోకు విజయవాడ ఏసిపి దామోదర్ లేఖ రాశారు. వల్లభనేని వంశీతో పాటు మరికొందరిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినందుకు ఫిర్యాదుదారుల కుల దృవీకరణ పత్రం అవసరం ఏర్పడింది.కేసు విచారణ ముందుకు వెళ్లాలంటే ఫిర్యాదు దారుల కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అంటున్నారు విజయవాడ సెంట్రల్ ఏసీపీ దామోదర్. ఏసీపీ లేఖతో రెవిన్యూ అధికారులను రామవరప్పాడులోని సత్యవర్ధన్ ఇంటికి వెళ్లారు. అక్కడ తాళాలు వేసి ఉన్నాయి. ఆయన ఫ్యామిలీ సభ్యులంతా అజ్ఞాతంలోకి వెళ్లారు. రామవరపాడులో ఇంట్లో ఎవరు అందుబాటులో లేనందున రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు.వంశీతోపాటు మరికొందరిపై ఎస్టీ, ఎస్సీ కేసు నమోదు చేశారు పోలీసులు. అయితే ఫిర్యాదుదారుల కమ్యూనిటీ నిర్ధారించాల్సి వుంది. ఇదిలావుండగా వారం రోజులుగా సత్య వర్ధన్‌ను విశాఖపట్నంలో బంధించారు వంశీ అనుచరులు. సత్యవర్ధన్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు ఫ్యామిలీ సభ్యులు. వర్ధన్ మొబైల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా వైజాగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. వంశీ అనుచరుల నుంచి సత్యవర్ధన్ ను కాపాడారు పోలీసులు.ఇదిలావుండగా పోలీసుల తీరుపై వంశీ లాయర్లు మండిపడ్డారు. గంటకు పైగా కృష్ణలంక పీఎస్ లో వల్లభనేని వంశీ ఉంచి విచారించారు పోలీసులు. ఆయన నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. మరి న్యాయమూర్తి ముందు ఇవాళ వంశీని హాజరుపరుస్తారా లేదా అనేది చూడాలి.

కేసు ఏంటీ..

రెండేళ్ల కిందట గన్నవరంలోని టీడీపీ ఆఫీసుపై దాడి జరిగింది. రాళ్లు, కర్రలతో కొందరు దాడికి తెగబడ్డారు. ఓ కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనపై పార్టీ ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే సత్యవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే.. అతన్ని బెదిరించి, కిడ్నాప్ చేసి.. దాడి చేసినట్టు వంశీపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే.. వంశీని విజయవాడ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు.

పక్కాగా సెక్షన్లు



వల్లభనేని వంశీపై కిడ్నాప్, దాడి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. 140 (1), 308, 351 (3), రెడ్ విత్ 3 (5) సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీ 71వ నిందితుడిగా ఉన్నారు. అయితే పోలీసులు గత నాలుగు గంటలుగా సత్యవర్ధన్ కిడ్నాప్ పైనే ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. కోర్టులో అఫడవిట్ ను విత్ డ్రా చేసుకోవడం వెనక ఆయనను బెదిరించారన్న ఆరోపణల నేపథ్యంలోనే ప్రశ్నిస్తున్నారు. పది లక్షల రూపాయల నగదును కూడా సత్యవర్ధన్ కు ఇచ్చారని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో వల్లభనేని వంశీతో పాటు మరో ఐదుగురిపైన కూడా కేసులు నమోదు చేశారు. వల్లభనేని వంశీపై పెట్టిన కేసులు నాన్ బెయిల్ బుల్ వి ఉండటంతో ఆయనకు బెయిల్ వచ్చే అవకాశాలు ఇప్పట్లో లేవని న్యాయనిపుణులు చెబుతున్నారు. విశాఖలో ఉన్న సత్యవర్ధన్ ను కూడా విజయవాడకు తీసుకు వచ్చి పటమట పోలీస్ స్టేషన్ లో విచారణ జరుపుతున్నారు. సత్యవర్ధన్ స్టేట్ మెంట్ ను కూడా రికార్డు చేస్తున్నారు. పకడ్బందీగా పోలీసులు ఈ కేసులో వల్లభనేని వంశీని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అయితే పోలీసులు ఎందుకు అరెస్ట్ చేశారో ఇప్పటి వరకూ తమకు చెప్పలేదని వంశీ సతీమణి తెలిపారు. పోలీసులు ఇప్పటి వరకూ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని భార్య పంకజ శ్రీ అన్నారు. అయితే విచారణ ముగిసిన తర్వాత వల్లభనేని వంశీని వైద్య పరీక్షలు నిర్వహించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో హాజరుపర్చనున్నారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా పోలీసులు 144 సెక్షన్ విధించారు

# రోజాకు బిగిస్తున్న ఉచ్చు

తిరుపతి, ఫిబ్రవరి 15,

ఆర్కే రోజా టీడీపీ హిట్ లిస్ట్ లో అగ్రభాగాన ఉన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ టీడీపీ నేతల చెవుల్లో మారుమోగిపోతున్నాయి. దీంతో రోజా విషయంలో కూటమి సర్కార్ సీరియస్ గానే ఉందని తెలిసింది. ఈ నేపథ్యంలో త్వరలోనే ఆర్కే రోజాను కూడా త్వరలో అరెస్ట్ చేసే అవకాశాలు లేకపోలేదన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. నగరి ఎమ్మెల్యేగా ఉన్న ఆర్కే రోజా తర్వాత మంత్రిగా నాటి వైసీపీ హయాంలో బాధ్యతలను స్వీకరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన 2019 నుంచి 2024 వరకూ ఆర్కే రోజా టీడీపీముఖ్య నేతలపై వ్యక్తిగత విమర్శలు చేశారు. ప్రధానంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ లపై ఆమె చేసిన వ్యాఖ్యలతో నాడే టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటు ఆర్కే రోజా టూరిజం, క్రీడల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన లొసుగులను ఆసరాగా చేసుకుని ఆమెపై కేసులు నమోదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆడుదాం ఆంధ్ర పేరిట గత ప్రభుత్వ హయంలో పెద్దయెత్తున కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భారీగా నిధులు దుర్వినియోగం అయ్యాయని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఆడుదాం ఆంధ్రపేరిట వంద కోట్ల రూపాయల స్కామ్ జరిగినట్లు ఆర్కే రోజాపై టీడీపీ నేతలు సీఐడీకి ఫిర్యాదులు చేశారు. దీనిపై సీఐడీ విచారణ కూడా ప్రారంభించనట్లు తెలిసింది. ఎన్ని నిధులు వెచ్చించారు? ఎంత క్రీడాకారుల కోసం ఉపయోగించారన్న దానిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టారు. మంత్రిపదవి వచ్చిన తర్వాత... ఆర్కే రోజా కూడా తొలుత టీడీపీలో ఉండి తర్వాత వైసీపీలోకి వచ్చిన వారే. వైసీపీలోకి వచ్చిన తర్వాత ఆర్కే రోజా నగరి నియోజకవర్గం నుంచి 2014, 2019లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2024లో జరిగిన ఎన్నికలలో మాత్రం ఓటమి పాలయ్యారు. వైసీపీ ఫైర్




బ్రాండ్ గా ముద్రపడిన రోజా తన పదునైన కామెంట్స్ తో టీడీపీ నేతలతో పాటు పవన్ కల్యాణ్ ను కూడా టార్గెట్ చేశారు. అయితే మంత్రివర్గంలో చోటు కోసమే రోజా నాడు చెలరేగి మాట్లాడారన్న వార్తలు కూడా వచ్చాయి. రోజా ఆశించినట్లుగానే కేబినెట్ లో జగన్ చోటు కల్పించారు. 2019లో గెలిచిన వెంటనే రోజాకు మంత్రి పదవి రాకపోవడంతో ఆమె ప్రమాణస్వీకార కార్యక్రమానికి కూడా హాజరు కాలేదు. అయితే మంత్రి వర్గ పునర్వ్యస్తీకరణలో భాగంగా జగన్ ఆమెకు అవకాశమిచ్చారు. క్రీడా, పర్యాటక, యువజన సర్వీసుల శాఖను అప్పగించడంతో ఆమె మరింత రెచ్చిపోయారు. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే పాత్యా సంఘం, కబడ్డీ అసోసియేషన్ లు సీఐడీకి ఫిర్యాదు చేశాయి. వంద కోట్ల రూపాయల స్కాం జరిగిందని వారు ఆరోపించారు కూడా. తాజాగా వల్లభనేని వంశీ అరెస్ట్ కావడంతో ఇక రోజా మెడ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటుందన్న వార్తలు వస్తున్నాయి. ఆర్కే రోజా పై కేవలం ఇదే కాకుండా తిరుమలలో దర్శనం టిక్కెట్ల విషయంపై కూడా ఫిర్యాదులు చేసే అవకాశాలున్నాయి. దీంతో రోజాకు రానున్న రోజులు కష్టాలు తప్పవని వైసీపీ నేతలే చెబుతున్నారు.

# అక్కంపల్లి ప్రాజెక్టులో కుళ్లిన కోళ్లు

నల్గొండ ఫిబ్రవరి 14,

అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లో.. కొందరు దుండగులు.. చనిపోయిన కోళ్లను పడేయడం కలకలం రేపింది. ఈ రిజర్వాయర్ హైదరాబాద్ మహానగరం తో పాటు నల్లగొండ జిల్లాకు తాగునీటిని అందిస్తుంది. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి భారీ మోటార్ల ద్వారా నీటిని అక్కంపల్లి రిజర్వాయర్ కు పంపింగ్ చేస్తారు. అక్కడ నుంచి కోదండపూర్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ లోకి నీటిని తరలిస్తారు. అక్కడ నీటిని పలు రకాలుగా శుద్ధి చేసిన తర్వాత మూడు భారీ పైప్ లైన్ల ద్వారా కృష్ణ తాగునీటిని హైదరాబాద్ మహానగరానికి సరఫరా అవుతుంటుంది. అయితే "బర్డ్ ఫ్లూ వ్యాధి" వ్యాప్తి నేపథ్యంలో.. ఆ పరిసర ప్రాంతాల్లో బ్రాయిలర్ ఫామ్ నుంచి చనిపోయిన కోళ్ళను తీసుకొచ్చి అక్కంపల్లి రిజర్వాయర్లో పడేశారు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు. దీనిపై స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్ గా మారింది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విచారణకు ఆదేశించడంతో దేవరకొండ ఆర్డిఓ సహా నీటిపారుదల శాఖల అధికారులు రిజర్వాయర్ ను పరిశీలించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ సైతం, చనిపోయిన బ్రాయిలర్ కోళ్ళను తాగునీటి రిజర్వాయర్లో వేసిన ఘటనను సీరియస్గా తీసుకొని విచారణ చేపడుతున్నామని తెలిపారు. వెంటనే కొంతమంది జాలరులను పురమాయించి.. చనిపోయిన కోళ్లను రిజర్వాయర్ నుంచి బయటికి తీయించారు.

# నెక్ట్స్ కోడాలేనా



విజయవాడ, ఫిబ్రవరి 14, (న్యూస్ పల్స్)

వైసీపీ నేతలు వరసగా అరెస్ట్ అవుతున్నారు. తాజాగా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ తో మరో టాపిక్ ఏపీలో నడుస్తుంది. తర్వాత ఎవరు? తెలుగుదేశం పార్టీకి బలమైన ప్రాంతంగా ఉన్న కృష్ణా జిల్లాలో వల్లభనేని వంశీ పార్టీని ధిక్కరించి చంద్రబాబు కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయడమే కాకుండా, లోకేష్ పై సయితం అనేక వ్యక్తిగత విమర్శలకు దిగారు. ఇక వల్లభనేని వంశీపై రెండు కేసులు నమోదు చేసిన పోలీసులు ఆయనను ఈ రోజు తెల్లవారుజామున పోలీసులు హైదరాబాద్ లో అరెస్ట్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయింది. మరోవైపు వల్లభనేని వంశీ అరెస్ట్ తర్వాత నెక్ట్స్ అరెస్ట్ ఆ వైసీపీ నేత వైపు అన్ని వేళ్లూ చూపుతున్నాయి.టీడీపీ టార్గెట్ లో కొడాలి నాని ప్రధానంగా ఉన్నారు. కొడాలి నానిని కూటమి మొన్నటి ఎన్నికల్లో తొలిసారి ఓడించింది. టీడీపీలో ఎదిగిన కొడాలి నాని తర్వాత వైసీపీలోకి మారిపోయారు. వల్లభనేని వంశీ తరహాలోనే చంద్రబాబు, లోకేష్ ఆయన కుటుంబ సభ్యులపై వ్యక్తిగత విమర్శలకు దిగారు. దీంతో పాటు అమరావతి రైతులు యాత్రగా బయలుదేరి గుడివాడ కు వచ్చినప్పుడు అక్కడ జరిగిన అల్లర్లతో కూడా ఆయన టీడీపీ అధినాయకత్వానికి కంటగింపుగా తయారయ్యారు. బాలకృష్ణ నుంచి ఎవరినీ వదిలిపెట్టకుండా విమర్శలు చేసే కొడాలి నాని ఎన్నికల్లో ఓటమి నాటి నుంచి ఎక్కువ సమయం హైదరాబాద్ కే పరిమితమయ్యారు.

జైలు శిక్ష ఎన్నేళ్లు పడుతుందంటే? కార్యకర్తలు, నేతల ఒత్తిడితో... గుడివాడకు అప్పుడప్పుడూ వచ్చిపోతున్నారు. ఆయనపై కూడా అనేక కేసులు నమోదయ్యాయి. ఆయన అనుచరులను అరెస్ట్ చేశారు. కొడాలి నాని ప్రధాన అనుచరులను ఇటీవల అరెస్ట్ చేయడంతో నాని అరెస్ట్ కూడా త్వరలోనే ఉంటుందని అందరూ భావించారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో టీడీపీ కార్యకర్తలు కూటమి ప్రభుత్వం తొలుత వల్లభనేని వంశీ, కొడాలి నానిలపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వారిని అలా వదిలిపెడితే ఎలా ఊరుకుంటామని అధినాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కొడాలి నాని వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించిన తీరుతో టీడీపీ నేతలు కూడా ఆగ్రహంగా ఉన్నారు.

కొడాలి నానిని కంట్రోల్ చేయాలని అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేతలు చెబుతూనే ఉన్నారు. . ఇప్పుడు వల్లభనేని వంశీని పోలీసులు అరెస్ట్ చేయడంతో నెక్ట్స్ టార్గెట్ కొడాలి నాని అంటూ సోషల్ మీడియాలో హోరెత్తిపోతుంది.

కొడాలి నాని కూడా ప్రస్తుతం హైదరాబాద్ లోనే ఉన్నారు. కొడాలి నానిని తొలిసారి ఓడించి ఊపుమీదున్న టీడీపీ నేతలు ఆయనను అరెస్ట్ చేసి తమ సత్తా ఏంటో చూపాలని భావిస్తున్నారు. వైసీపీ హయాంలో అనేక మంది కొడాలి నాని చేతిలో ఇబ్బదులు పడ్డారు. వారి చేత ఇప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఫిర్యాదులు అందిన వెంటనే కొడాలి నానిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుంటారన్న వార్తలు వస్తున్నాయి. అయితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని టీడీపీ అగ్రనాయకత్వం చెబుతున్నా కొడాలి నానీ గెట్ రెడీ అంటున్నారు తెలుగు తమ్ముళ్లు.

# రిలాక్స్ మూడ్ లో చంద్రన్న

విజయవాడ, ఫిబ్రవరి 14,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాక ముందు ఒకలా ఉంటారు. వచ్చిన తర్వాత మరొకలా వ్యవహరించేవారు. అయితే ఈసారి మాత్రం గత పథ్నాలుగు ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో కనిపించని మార్పు చంద్రబాబులో ఇప్పుడు కనిపిస్తుంది. గత పథ్నాలుగేళ్లు చంద్రబాబు నిర్విరామంగా రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేసే ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారు. తనకుతానే రాష్ట్రానికి సీఈవోగా ప్రకటించుకున్నారు. ఆయన నాడు ఉంటే సీఎం ఆఫీసులో లేకుంటే జిల్లాల పర్యటనల్లో మరీ లేకపోతే పార్టీ కార్యాలయంలో... ఇలా గడిచేది ఆయన దినచర్య. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా 2014 నుంచి 2019 వరకూ దాదాపు అదే పంథాను కొనసాగించారు. కానీ ఈసారి మాత్రం ఆయనలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. రిలాక్స్ మూడ్ లో కనిపిస్తున్నారు. అంటే గతంలో మాదిరిగా అధికారులపై హడావిడి చేయడం కనిపించడం లేదు. ఆకస్మిక తనిఖీలు లేవు.తనను 1995 నాటి ముఖ్యమంత్రిగా చూస్తారని చంద్రబాబు ఆ మధ్య చెప్పినప్పటికీ ఆ విధమైన పోకడలకు ఆయన పోవడం లేదు. ఎంత కష్టపడినా ఇంతేలా అనుకున్నారో? మరి మరో కారణమో తెలియదు కానీ నాటి చంద్రబాబులో ఉన్న ఫైర్ కనిపించడం లేదన్నది ఆయనను దగ్గర నుంచి గమనిస్తున్న నేతలు చెబుతున్నారు. నాడు సెక్రటేరియట్ లో ఎనిమిదన్నర గంటల వరకూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహించేవారు. తర్వాత ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చేవారు. అక్కడ నేతలతో దాదాపు రాత్రి పది గంటల వరకూ చర్చించేవారు. జైలు శిక్ష ఎన్నేళ్లు పడుతుందంటే? నేతలకూ దూరంగానే... కానీ ఇప్పుడు నేతలతో చర్చించడం పూర్తిగా మానేశారంటున్నారు. ఏదైనా ఎన్నికలుంటే తప్ప ఆ జిల్లా నేతలతోనూ పార్టీకి సంబంధించిన ముఖ్య నేతలతో సమావేశమవ్వడం లేదు. ఇక ప్రతి శనివారం పార్టీ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లాలనుకున్నా పని వత్తిడితో అన్ని సార్లూ అది సాధ్యం కావడం లేదు. కానీ వీలున్నప్పుడల్లా శనివారం మాత్రం పార్టీ ఆఫీసుకు



వెళ్లి కార్యకర్తల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. మరోవైపు ఆదివారం అయితే ఆయన చాలా రిలాక్స్ గా కనిపిస్తున్నారు. వీలయితే శని, ఆదివారాలు హైదరాబాద్ వెళ్లిపోతారు. మంత్రులకు కూడా ఆదివారాలు ఫ్యామిలీలతో గడపాలని చంద్రబాబు చెప్పడం చూసి ఆయనలో వచ్చిన మార్పుకు సీనియర్ నేతలు విస్తుపోతున్నారు. ఒకనాడు తాను నిద్రపోను.. మిమ్మల్ని నిద్రపోనివ్వననే నినాదం చంద్రబాబు అందిపుచ్చుకున్నారు.అలుపెరగకుండా పనిచేశారు. కానీ 2024 ఎన్నికల తర్వాత మాత్రం ఉదయం పదకొండు లేదా పన్నెండు గంటలకు సచివాలయానికి వస్తారు. తిరిగి ఆరు గంటలకు ఉండవల్లి లోని తన నివాసానికి చేరుకుంటున్నారు. లోకేష్ చేతికి రాజకీయంగా అందిరావడంతో పార్టీ విషయాలను పెద్దగా పట్టించుకోవడం లేదన్న టాక్ పార్టీలో బలంగా వినిపిస్తుంది. జిల్లాలో నేతల మధ్య విభేదాలనుకూడా లోకేష్ పరిష్కరిస్తుండటంతో చంద్రబాబుకు పెద్దగా రాజకీయంగా పనిలేకుండా పోయిందంటున్నారు. కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే ఆయన పరిమితమవుతూ తన ఆరోగ్యాన్ని మరింతగా కాపాడుకుంటున్నారని చెబుతున్నారు. మొత్తం మీద 1995 నాటి చంద్రబాబుకు 2025 నాటి చంద్రబాబుకు మధ్య ముప్పయి ఏళ్ల తేడా స్పష్టంగా కనిపిస్తుందన్నది పార్టీవర్గాల టాక్.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవికి నిరసన సెగ

### హామీలపై నిలదీసిన గ్రామస్థులు

రంగారెడ్డి ఫిబ్రవరి 14,

రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల పరిధిలోని గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు వచ్చిన కల్వకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవికి నిరసన సెగ ఎదురయింది. మీరు వాగుపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు.. ఏమైంది సారు అంటూ మహిళలు నిలదీసారు. రైతుబంధు ఇస్తలేరు, రూ.2500 ఇస్తలేరు, రుణమాఫీ కాలేదు, ఎందుకు వచ్చారు? అంటూ నిలదీసారు. పోలీసుల సహాయంతో అక్కడి నుంచి ఇర్విన్ గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే, ఎంపీని గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రం చేయాలంటూ, ఇర్విన్ రిజర్వాయర్ను రద్దు చేయాలంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులకు, స్థానికులకు మధ్య తోపులాట జరిగింది...

## చండూర్ లో పోలీసుల అత్యుత్సాహం

నల్గొండ ఫిబ్రవరి 14,

నల్గొండ జిల్లా చండూర్ లో పోలీసులు అత్యత్సవాహం ప్రదర్శించారు. చండూర్ మాజీ జడ్పీటీసీ అన్నెపర్తి శేఖర్ ను అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేసారు. అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి, తలుపులు పగులగొట్టి, దౌర్జన్యం చెసి భయభ్రాంతులకు గురి చేసారు. స్థానిక పోలీసులు అరెస్ట్ పై తమకు సమాచారం లేదంటున్ఆరు. -ఎవరు అరెస్ట్ చేశారు ?ఎక్కడికి తీసుకుపోయారు ? అంటూ కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. శేఖర్ ఆచూకీ చెప్పాలంటూ.. కుటుంభ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## ఒకటో తరగతి విద్యార్థి తరగతి గదిలో ఉండగానే తాళం వేసారు

నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 14,



...పేట ప్రాథమికోన్నత ...్యార్థులందరూ ఇళ్లకు ...లు వేసి వెళ్లిపోయారు. ...ద్రపోవడంతో గదిలోనే ...లకు ఇంటికి రావాల్సి ...ఇంటికి రాకపోవడంతో ... ఈ క్రమంలో ఓ ...నిద్రించి కనిపించగా.. ...వంటన గది తాళం పగులగొట్టి కుమారుడిని బయటకు తీసుకువచ్చాడు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి..ఆరుగురికి గాయాలు

ఖమ్మం ఫిబ్రవరి 14,

ముదిగొండ మండల కేంద్రం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ఆరుగురుకి గాయాలు అయ్యాయి. గ్రానైట్ లోడుతో వెంకటాపురం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో టైర్లు పేలడంతో న ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మృతు లు ఖమ్మం ఆవేలిఖానాపురంకు చెందినవారుగా గుర్తించారు.

## సినీ ఫక్కీలో చోరీ


బాన్సువాడ ఫిబ్రవరి 14,

కామారెడ్డి జిల్లా బాన్సువాడలో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. కిరాణా షాప్ కు వెళ్లి వచ్చే సరికి కారులో ఉన్న 2 లక్షల నగదు ఎత్తుకెళ్లారు దుండగులు. కారు డోర్ ఓపెన్ చేసి దర్జా గా దొంగతనం చేసిన సీసీ ఫుటేజీ దృశ్యాలు సోషల్ మీడియా లో వైరల్ గా మారాయి.ఇబ్రహీంపేట్ కు చెందిన చందర్ కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వహిస్తున్నాడు.బ్యాంక్ నుంచి డ్రా చేసిన నగదు కారులో ఉంచి గుడికి వెళ్తూ కొబ్బరి కాయ కోసం ఓ షాప్ వద్ద ఆగాడు. షాప్ నుంచి వచ్చే లోపు 2 లక్షల నగదుతో పరారయ్యారు దొంగలు. బ్యాంక్ వద్ద రెక్కీ నిర్వహించి ఈ చోరీ కి పాల్పడినట్లు తెలుస్తోంది. బాధితుడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసిన పోలిసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

## నర్సరీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

చౌటుప్పల్ ఫిబ్రవరి 14,

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం సెంట్రల్ నర్సరీ అటవీ ప్రాంతంలో ప్రమాదవశాత్తు మంటలు



చెలరేగాయి. ఆటవీ ప్రాంతం చాలావరకు దగ్ధమయింది. సమాచారం అందడం తో ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పడానికి రంగంలోకి దిగారు. అక్కడున్న వానరాలు మంటల వేడిమి తట్టుకోలేక బయటకు పరుగులు తీసాయి.

=====================

## సంగారెడ్డి డిఎస్పీ మూతు పురాణం

సంగారెడ్డి ఫిబ్రవరి 14,

సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య పురాణం బయటపడింది. సదాశివపేట ఎంఆర్ఎఫ్ కంపెనీ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులపై డిఎస్పీ నోరు జారాడు. తమని పర్మినెంట్ చేయాలంటూ పరిశ్రమ బయట 300 మంది కార్మికులు ధర్నా చేస్తున్నారు. కార్మికులకు ధర్నా విరమించాలని డిఎస్పీ సత్తయ్య హెచ్చరించారు. కార్మికులు మాట వినకపోవడంతో "నీ అమ్మ చెప్పు తీసుకుని కొడుతా చెత్తనా కొడకా" అంటూ బూతులు తిట్టడంతో కార్మికులు ఒక్కసారిగా నినాదాలు చేసారు. కార్మికులకు డీఎస్పీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు.

## భక్తురాలిని గాయపరిచిన కోడె రాజన్న ఆలయంలో ఘటన

రాజన్న సిరిసిల్ల ఫిబ్రవరి 14, వేములవాడ రాజన్న ఆలయంలో రాజన్న కోడె భక్తురాలిని గాయపరిచింది. రాజన్న దర్శనానికి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బుచ్చి ఎల్లవ్వ వచ్చింది. రాజన్న దర్శించుకుని కోడె మొక్కులు చెల్లించుకునే సమయంలో అకస్మాత్తుగా కోడె దాడి చేసింది. కోడె దాడిలో బుచ్చి ఎల్లవ్వ తీవ్రంగా గాయపడింది. ఆమెను ఆలయ సిబ్బంది హుటాహుటిన 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

## సంగారెడ్డిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటన

సంగారెడ్డి ఫిబ్రవరి 14, సంగారెడ్డి జిల్లాలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొన్నారు. కందిలోని ఎల్ ఎన్ కన్వెన్షన్ సెంటర్ లో ప్రచార సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ బీజేపీ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

# గ్రాడ్యేయేట్ ఎన్నికల ప్రచార జోరు

కాకినాడ, ఫిబ్రవరి 14, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అభ్యర్థుల ప్రచార పర్వం మరింత వేగంగా సాగుతోంది.. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు వ్యక్తిగతంగా ప్రచారం చేస్తున్నారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తరపున ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు రంగంలోకి దిగారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల నాయకత్వంలో కూటమి ప్రజాప్రతినిధులు, ద్వితీయశ్రేణి నాయకులు ఎవరికి వారు జోరుగా ప్రచారం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రత్యక్ష ఎన్నికలు ఇదే మొదటిసారి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉభయగోదావరి జిల్లా నియోజకవర్గం నుంచి పేరాబత్తుల రాజశేఖర్ను బరిలో దింపింది కూటమి నాయకత్వం. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు నుంచి సభ్యత్వాల నమోదు వరకు ఎమ్మెల్యేలపై పూర్తి బాధ్యతలు పెట్టిన నాయకత్వం ఆ దిశగా పనిచేయకపోయిన వారికి అక్షింతలు వేసింది. పనితీరు ఆధారంగా మార్కులు వేస్తానని చెప్పిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రతీ ఒక్క అంశాన్ని పరిశీలించడంతో వారంతా పరుగులు పెడుతున్నారు. మరింత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రచారం నుంచి ఓట్లు వేయించే బాధ్యత తీసుకొని కూటమి అభ్యర్థిని గెలిపించుకునేందుకు సాయాశక్తులు కృషిచేస్తున్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అభ్యర్థుల ప్రచార పర్వం మరింత వేగంగా సాగుతోంది.. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు వ్యక్తిగతంగా ప్రచారం చేస్తున్నారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తరపున ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు రంగంలోకి దిగారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల నాయకత్వంలో కూటమి ప్రజాప్రతినిధులు, ద్వితీయశ్రేణి నాయకులు ఎవరికి వారు జోరుగా ప్రచారం చేస్తున్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రత్యక్ష ఎన్నికలు ఇదే మొదటిసారి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉభయగోదావరి జిల్లా నియోజకవర్గం నుంచి పేరాబత్తుల రాజశేఖర్ను బరిలో దింపింది కూటమి నాయకత్వం. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు నుంచి సభ్యత్వాల నమోదు వరకు ఎమ్మెల్యేలపై పూర్తి బాధ్యతలు పెట్టిన నాయకత్వం ఆ దిశగా పనిచేయకపోయిన వారికి అక్షింతలు వేసింది. పనితీరు ఆధారంగా మార్కులు వేస్తానని చెప్పిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రతీ ఒక్క అంశాన్ని పరిశీలించడంతో వారంతా పరుగులు పెడుతున్నారు. మరింత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రచారం నుంచి ఓట్లు వేయించే బాధ్యత తీసుకొని కూటమి అభ్యర్థిని గెలిపించుకునేందుకు సాయాశక్తులు కృషిచేస్తున్నారు.స్వతంత్ర్య అభ్యర్థిగా మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడు ప్రచారంలో జోరుగా ఉన్నారు. అందుకే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కూడా ప్రచార స్పీడు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాపకింద నీరులా హంగూ ఆర్భాటం లేకుండా చేసుకుపోతున్న సుందర్ కూటమి అభ్యర్థిని పరుగులు పెట్టించే పరిస్థితి కనిపిస్తోంది. సొంత మ్యానిఫెస్టో విడుదల చేయడం, విద్యాసంస్థల వద్ద సమావేశాలు నిర్వహించడం, గ్రాడ్యుయేట్లుతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా సుందర్ తటస్థులు మరింత దగ్గరవుతున్నారన్న సంకేతాలు వినిపించడంతో కూటమి నాయకత్వం అప్రమత్తమైంది. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలతో స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం, నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఎమ్మెల్యేలతో నిర్వహించడం తదితర అంశాలపై దృష్టి పెట్టిన కూటమి అభ్యర్థి ప్రచారాన్ని వేగవంతం చేశారు.ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన 54 మంది నామినేషన్లు దాఖలు చేయగా వాటిలో 11 నామినేషన్లు తిరస్కరణ గురయ్యాయి. 43 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. వామపక్షాల నుంచి డీవీ రాఘవులు, స్వతంత్ర అభ్యర్థిగా జీవీ సుందర్, బండారు రామ్మోహన్రావు బరిలో ఉన్నారు. అందుకే జాగ్రత్త పడిన పేరాబత్తుల రాజశేఖర్ కూటమిలోని అందర్నీ కలుపుకొని ప్రచారంలో జోరు పెంచారు. స్వతంత్ర్య అభ్యర్థిగా మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడు ప్రచారంలో జోరుగా ఉన్నారు. అందుకే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కూడా ప్రచార స్పీడు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాపకింద నీరులా హంగూ ఆర్భాటం లేకుండా చేసుకుపోతున్న సుందర్ కూటమి అభ్యర్థిని పరుగులు పెట్టించే పరిస్థితి కనిపిస్తోంది. సొంత మ్యానిఫెస్టో విడుదల చేయడం, విద్యాసంస్థల వద్ద సమావేశాలు నిర్వహించడం, గ్రాడ్యుయేట్లుతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా సుందర్ తటస్థులు మరింత దగ్గరవుతున్నారన్న సంకేతాలు వినిపించడంతో కూటమి నాయకత్వం అప్రమత్తమైంది. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలతో స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం, నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఎమ్మెల్యేలతో నిర్వహించడం తదితర అంశాలపై దృష్టి పెట్టిన కూటమి అభ్యర్థి ప్రచారాన్ని వేగవంతం చేశారు.ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన 54 మంది నామినేషన్లు దాఖలు చేయగా వాటిలో 11 నామినేషన్లు తిరస్కరణ గురయ్యాయి. 43 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. వామపక్షాల నుంచి డీవీ రాఘవులు, స్వతంత్ర అభ్యర్థిగా జీవీ సుందర్, బండారు రామ్మోహన్రావు బరిలో ఉన్నారు. అందుకే జాగ్రత్త పడిన పేరాబత్తుల రాజశేఖర్ కూటమిలోని అందర్నీ కలుపుకొని ప్రచారంలో జోరు పెంచారు.

# 3 పథకాలకు బడ్జెట్ లో కేటాయింపులు

విజయవాడ, ఫిబ్రవరి 14,

ఈ నెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28న పూర్తిస్థాయి బడ్జెట్ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు బడ్జెట్ కూర్పుపై ఫోకస్ పెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే కొత్త పథకాలు ప్రారంభించేలా ప్లాన్ చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయిఓవైపు ఆదాయం తగ్గింది. మరోవైపు సంక్షేమ పథకాల భారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. పూర్తిస్థాయి బడ్జెట్ను ప్రవేశపెట్టేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ.. బడ్జెట్ రూపకల్పన చేస్తున్నట్టు కూటమి నేతలు చెబుతున్నారు. తాజాగా బడ్జెట్ కూర్పుపై సీఎం చంద్రబాబు.. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించిన 9 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.1.కూటమి ప్రభుత్వ ఏర్పడ్డాక.. తొలిసారి పూర్తి బడ్జెట్ను ప్రవేశపెట్టబోతున్నారు. అటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు.. సీఎం చంద్రబాబు ఈ బడ్జెట్పై ఫోకస్ పెట్టారు.సూపర్సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను.. కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు..కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన ఇసుక విధానాన్ని అమలు చేసింది. దీంతో ఆదాయం తగ్గింది. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణపై చంద్రబాబు దృష్టి పెట్టారు. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం సాయం చేస్తోంది. ఇది కొంతమేర ఊరటనిస్తోంది. అయితే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రత్యేక సాయం చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని కోరుతున్నారు.ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాఖల వారీగా మంత్రులతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవీంద్ర, సాంఘీక సంక్షేమ శాఖమంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి ఫరూక్తో పయ్యావుల కేశవ్ సమావేశమయ్యారు.హంద్రినివా, వెలిగొండ, చింతలపూడి ఎత్తిపోతల వంశధారా, గాలేరు- నగరి తోపాటు.. ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని రామానాయుడు కోరారు.సాంఘీక సంక్షేమ శాఖకు సంబంధించి గత బడ్జెట్లో రూ.18 వేల కోట్లు కేటాయించారు. ఈసారి మరికొంత పెంచాలని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖకు గత బడ్జెట్లో రూ.4100 కోట్లు కేటాయించారు. గిరిజన సంక్షేమానికి రూ.రూ.4500 కోట్లు కేటాయించారు. ఈసారి బడ్జెట్లో 10 శాతం మేర పెంచాలని మంత్రి సంధ్యారాణి కోరారు.గత ప్రభుత్వం భవిష్యత్తు ఆదాయాలను కూడా తాకట్టు పెట్టిందని.. ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నారు.2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.94 లక్షల కోట్లతో నవంబర్లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇప్పుడు రూ.3 లక్షల కోట్లు దాటే అవకాశం ఉందని తెలుస్తోంది.

## రేషన్ బియ్యం పట్టివేత.. రెండు లారీలు సీజ్

మంచిర్యాల ఫిబ్రవరి 14, చెన్నూర్ పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై మహారాష్ట్రకి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని హైదరాబాద్ సివిల్ సప్లయ్, టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. రెండు లారీలు,ఒక ట్రక్ ని స్వాదీనం చేసుకొని సుమారు 615 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసారు. తరువాత చెన్నూర్ పోలీస్ స్టేషన్ కి తరలించారు.

## కొనసాగుతున్న ముజ్గి మల్లన్న జాతర

నిర్మల్ నిర్మల్ రూరల్ మండలం ముజ్గి గ్రామంలో కొనసాగుతున్న మల్లన్న జాతరలో భాగంగా మూడవరోజు రథోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మల్లన్న స్వామికి పసుపు బండారి తో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు నిలువెత్తు బంగారంతో తులాభారం చేపట్టారు. కోరిన కోరికలు తీర్చే దేవుడు మల్లన్న స్వామని పలువురు భక్తులు పేర్కొన్నారు. రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు నిర్మల్ జిల్లా నుండే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుండి భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో పోలీసులు పట్టిష్ట బందోబస్తు నిర్వహించారు.

# బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్. -నేడు ఆ మహనీయుని జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని ) సేవాలాల్ మహారాజ్ దేవత మేరామయాడికి సేవకుడిగా ఆమెకే షరతులు విధించి సాధించుకున్న భక్తుడు. బంజారాల ఉన్నతి కోసం కృషి చేశారు. తమను హింస పెడుతున్న బ్రిటిష్ వారితో పోరాడి జాతి పునర్నిర్మాణానికి కృషి చేశారు. సేవాలాల్ మహారాజ్ అనంతపూర్ జిల్లా గుత్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామపంచాయతీ రంజీనాయక్ తండాలో భీమానాయక్, ధర్మాణిబాయి దంపతులకు 1739 ఫిబ్రవరి 15వ తేదీన జన్మించారు. రాథోడ్ వంశానికి చెందినవారు. భీమానాయక్ కు నలుగురు కుమారులు సేవాలాల్, హప, బాదు, బాణ, సేవాలాల్ మొదటి వారు. పుట్టుకతోనే మహా జ్ఞానిగా ఉన్నారు. చిన్నతనంలోనే సకల విద్యలను అభ్యసించారు. ఎవరికి కష్టం వచ్చినా వారి సమస్యలను పరిష్కరించేవారు. ఒకరోజు మేరామయాడి కలలో దర్శనమిచ్చి సేవాలాల్ ను భగత్ గా మారాలని సూచించింది. తాను మద్యం ముట్టనని, మాంసం తిననని రక్తతర్పణ చేయలేననీ, మద్యాన్ని నైవేద్యంగా ఇవ్వడం చేయలేనని సేవాలాల్ చెబుతారు. భక్తితో మాత్రమే పూజించగలనని విన్నవిస్తారు. దీంతో మేరామాయాడి ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. సేవాలాల్ కుటుంబాన్ని ఇబ్బందులు పెడుతుంది. సేవాలాల్ చిన్న తమ్ముడు బాణాను, ఆంబోతును, గుర్రాలను, 3,755 పశువులను పూర్తిగా నాశనం చేస్తుంది. సేవాలాల్ కు ఒక పూట భోజనం కూడా కరవవుతుంది. సేవాలాల్ మేరామాయాడికి కొన్ని షరతులు పెట్టి తను భగత్ గా ఉంటానని మాట ఇస్తాడు. శాఖాహారిగా ఉంటూ మద్యం సేవించబోనని సేవకుడిగా మారుతాడు. మేరామాయాడి అనుగ్రహించి అతని తమ్ముని పునరుజ్జీవింజేసి, సంపదను తిరిగి ఇస్తుంది. మేరామాయాడికి సవత్సరానికి ఒక సారి కడవ్, చుర్మో, పిండి వంటలు నైవేద్యం సమర్పిస్తామని, జీవహింసను చేయబోమని చెబుతాడు. సేవాలాల్ తన చివరిదశలో యవాత్మల్ జిల్లా డిగ్రాస్ తాలూకాలోని రాయి అనే తాండలో నివసించారు. తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన సేవాలాల్ 1806 ఏప్రిల్ 14న మహారాష్ట్రలోని బేరర్ అకొలా జిల్లాలకు డిగ్రాస్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో పొర అనే గ్రామంలో నిర్యాణం చెందారు. ఆయన కుటుంబీకులు రెండు మందిరాలను నిర్మించారు. ఒకటి సేవాలాల్ మహారాజ్ కోసం, మరొకటి మేరామాయాడి కోసం. ఏటా ఫిబ్రవరి 15న అనంతపూర్ జిల్లా గుత్తి నియోజకవర్గంలో సేవాగఢ్, భోగ్ బండార్ నిర్వహిస్తారు.

# దామోదరం సంజీవయ్యకు సీఎం రేవంత్ నివాళి

హైదరాబాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ లు పటేల్ రమేష్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు చారగొండ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కి పంట పొలాలలో పుష్పాభిషేకం

# ముందస్తుగా జన్మదిన వేడుకలు జరుపుకున్న ముఖరా కె గ్రామస్తులు

హైదరాబాద్

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ముందస్తు గా జరుపుకున్నారు, పంట పొలాలో కేసీఆర్ ఫోటో కి పుష్పాభిషేకం చేస్తూ, మళ్ళీ పల్లెలో సంక్షేమ పథకాలు అందాలంటే కేసీఆర్ సారె రావాలి మళ్ళీ కారే కావాలి ,మళ్ళీ రైతు రాజు కావాలంటే మళ్ళీ తెలంగాణ కు కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని అన్నారు. కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని, ప్రతి రంగంలో అభివృద్ధి జరిగింది అని, కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాల ప్లకార్డులు ప్రదర్శిస్తూ, బాజా భజంత్రిలు డప్పులు వాయిస్తూ పంట పొలాలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు, కేసీఆర్ తోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుంది అని, మళ్ళీ తెలంగాణ లో అభివృద్ధి జర్గాలంటే, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాలంటే మళ్ళీ కేసీఆరే రావాలని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, తిరుపతి, ప్రలాద్, దత్త, శ్రీరామ్ మరియు మహిళలు రైతులు పాల్గొన్నారు

# మంత్రి పొన్నం ను కలిసిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మల్రెడ్డి రాంరెడ్డి, ముద్దగోని రాంమోహన్ గౌడ్ శుక్రవారం కలిసారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, , కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దగోని రాంమోహన్ గౌడ్, మంత్రిని మినిస్టర్ క్వార్టర్స్లో కలిశారు., విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు.

# మంత్రి కోమటిరెడ్డిని కలిసిన మంద కృష్ణ మాదిగ

హైదరాబాద్డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ఎంఆర్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ కలిసారు. పద్మశ్రీ అవార్డు అందుకోవడం, ఎస్సీ వర్గీకరణను సాధించడంపై మందకృష్ణ మాదిగను మంతకరి శాలువాతో సత్కరించి అభినందించారు.

# చికెన్ ప్లేస్ లోకి మటన్...

ఏలూరు, ఫిబ్రవరి 14



వెంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందట.. అలా ఉంది.. ఇప్పుడు బర్డ్ఫ్లూ వైరస్ శుభకార్యాలయాలపై ఎఫెక్ట్ పడుతోంది. మహూర్తాలు బాగున్నాయని పెళ్లిలు, ఇతర శుభకార్యక్రమాలు ఎక్కువ పెట్టుకున్నారురర జనాలు. సడెన్గా బర్డ్ఫ్లూ రావడంతో దాని ఎఫెక్ట్ భోజనాలపై తీవ్రంగా పడిందని అంటున్నారు నిర్వాహకులు. ఇటీవల కాలంలో ప్రతీ వేడుకకు ముక్కలేకుండా ముద్దదిగదని పరిస్థితి నెలకొంది. చాలా మంది నాన్వెజ్ వంటకాలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కొందరు పెళ్లి వేడుక రోజున కేవలం వెజ్ వంటకాలు వడ్డిస్తున్నప్పటికీ ఆ తరువాత జరిపే వేడుకలకు, రిసెప్షన్లకు మాంసాహార వంటకాలు తప్పనిసరి చేస్తున్నారు. బర్డ్ ఫ్లూ పుణ్యమా అని నాన్వెజ్ వంటకాల్లో చికెన్ స్థానంలో మటన్ వచ్చి చేర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. బర్డ్ఫ్లూ వైరస్ వల్ల లక్షల్లో కోళ్లు మృత్యువాతపడడం, బర్డ్ఫ్లూ వైరస్ చాలా వేగంగా వ్యాప్తి చెందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కట్టడి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం వైరస్ ప్రభావం లేదని చెబుతున్నా జనం భయం మాత్రం పోలేదు. ఈ క్రమంలోనే చికెన్, కోడిగుడ్ల అమ్మకాలు పడిపోతున్నాయి. అంతే కాదు పంక్షన్ల మెనూ నుంచి చికెన్ ఐటెం తీసేసి దాని స్థానంలో మటన్ చేర్చుతున్నారు. దీంతో ఒక్కసారిగా ఖర్చు భారీగా పెరగడంతో లబోదిబో మంటున్నారు నిర్వాహకులు. కిలో చికెన్ రూ.250 అదే కిలో మటన్ ధర 800 పైమాటే.. వైరస్ ఉన్నందున మెనూ మార్చాల్సిన పరిస్థితి వచ్చిందని అంటున్నారు. దీని బట్టి ఒక్కో కిలోకు సుమారు రూ.500 అదనంగా ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా పంక్షన్లలో చికెన్లోనే మూడు నాలుగు రకాల ఐటెమ్స్ పెట్టి కేవలం కర్రీ వరకు మటన్ వండుతుంటారు. ఇప్పుడు మొత్తం మటన్ వండాల్సి వస్తోంది. మటన్ బిర్యానీ వంటి ఐటెం చేయించడంతో ఖర్చు పెరిగిపోతుందంటున్నారు. మరికొన్ని పంక్షన్లలో ఫిష్కు ప్రాధాన్యనిస్తున్నారు. దీని వల్ల కూడా ఖర్చు భారీగా పెరిగిపోయిన పరిస్థితి. ఒక కిలో ఫిష్ రూ.300 నుంచి రూ.500 వరకు ఉండడంతో ఫిష్ వంటకాలు చేయించాలన్నా అదనపు ఖర్చు అవుతోంది. బయట తప్పక తినాల్సిన పరిస్థితుల్లో ఎక్కువ శాతం మంది విజిటేరియన్ భోజనానికే ప్రాధాన్యతనిస్తారు. అయితే మాంసాహార ప్రియులు మాత్రం మటన్, ఫిష్లతో చేసిన ఐటెమ్స్కు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెబుతున్నారు. తీరా తినేశాక బిల్లు చూసి ఘొల్లుమనే పరిస్థితి ఉంటుందని చెప్పుకుంటున్నారు. ఒక పూట ఏదైనా హోటల్కు వెళ్లి తప్పనిసరిగ్గా తినాల్సి వచ్చినప్పుడు మటన్ స్టార్టర్ లేదా ఫిష్ స్టార్టర్ ఆర్డర్ ఇచ్చి ఆపై మటన్ లేదా, ఫిష్ బిర్యానీ అంతకీ లేదంటే మటన్, ఫిష్ కర్రీ ఆర్డర్ ఇస్తున్నారు. దీంతో రెట్టింపు ఖర్చు జేబుకు చిల్లు పెడుతోందని వాపోతున్నారు. రూ.1000 అయ్యే ఖర్చు చికెన్ ఐటెమ్లు తినక పోవడం వల్ల మటన్, ఫిష్ ఐటెమ్స్కు ప్రాధాన్యత ఇవ్వడంతో రూ.2000 పైనే బిల్లు చెల్లించాల్సి వస్తోంది. మొత్తం మీద ముక్కలేకుండా ముద్ద దిగని మాంసాహార ప్రియులు మాత్రం అదనపు ఖర్చు వల్ల మాత్రం కాస్త ఇబ్బందులు పడుతున్నారు.

# కన్నాబాబా.... వైసీపీ నేతల ఆగ్రహం

విశాఖపట్టణం, ఫిబ్రవరి 14

ఏపీలో అధికార పోయినా మాజీ సీఎం జగన్ తీరు మారలేదా? అధినేతపై కొందరు ఉత్తరాంధ్ర జిల్లాల నేతలు ఆగ్రహంతో రగిలిపోతున్నారా? ప్రజల్లోకి వెళ్లే ముందు కొత్త టీమ్ను తయారు చేసుకుంటున్నారు వైసీపీ అధినేత జగన్. ఉగాది తర్వాత ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు. ఇందులోభాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్, జిల్లాల అధ్యక్షుడు, నియోజకవర్గాల ఇన్ఛార్జులను నియమిస్తున్నారు. వైసీపీకి, ఎంపీ పదవికి విజయసాయిరెడ్డి ఇటీవల రాజీనామా చేశారు. వైసీపీలో ఆ పదవి ఎవరికి దక్కుతుందనే దానిపై రకరకాల వార్తలు జోరందుకున్నాయి. దగ్గరవాళ్లకే జగన్ ఆ పదవిని అప్పగిస్తారని కొందరన్నారు. ఈసారి కచ్చితంగా ఉత్తరాంధ్ర వైసీపీ నేతలకే ఆ పదవి దక్కుతుందని చాలామంది గంపెడంత ఆశలు పెట్టుకున్నారు. రేసులో చాలామంది పేర్లు వినిపించాయి. మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడవాడ అమర్ నాథ్ వంటి నేతల పేర్లు వినిపించాయి. మాజీ మంత్రి కురసాల కన్నబాబును ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్గా జగన్ నియమించారు. ఈ వ్యవహారం ఉత్తరాంధ్ర వైసీపీలో ములసం మొదలైనట్టు కనిపిస్తోంది. కన్నబాబును నియమించిన విషయం తెలియగానే కొందరు నేతలు ఆగ్రహంతో ఉన్నట్లు పొలిటికల్ సర్కిల్స్ సమాచారం. వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీకి అంటీముట్టనట్టుగా వ్యవహరించారు మాజీ మంత్రి కన్నబాబు. గడిచిన ఎనిమిదినెలల్లో కేవలం ఒక్కటీ లేదా రెండు సార్లు మాత్రమే ఆయన మీడియా ముందుకొచ్చినట్లు నేతలు చెబుతున్నారు. అయినా సరే కన్నబాబును ఏరి కోరి ఉత్తరాంధ్రకు ఇన్ఛార్జ్ను చేయడం అక్కడి నేతలకు మింగుడు పడడం లేదు. వచ్చే ఎన్నికల్లో కాకినాడ కాకుండా విశాఖ సిటీలో పెందుర్తి నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతానని అధిష్టానం చెవిలో వేశారట కన్నబాబు. తనకు పెందుర్తి నియోజకవర్గం ఇన్ఛార్జ్ కావాలని పట్టుబట్టారట. లేదంటే తనకు ఎలాంటి ఇన్ఛార్జ్ పదవి వద్దని తెగేసి చెప్పినట్టు ఆ మధ్య వార్తలొచ్చాయి. ఆయన సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఆ ప్రాంతంలో ఉన్నారట. దీనిపై వైసీపీ హైకమాండ్ సైలెంట్ అయిపోయినట్టు పార్టీ వర్గాల మాట. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రీజినల్ కో-ఆర్డినేటర్ పదవికి ఎక్కువమంది రేసులో ఉండడంతో కొత్త వ్యక్తిని తెరపైకి తెచ్చారు మాజీ సీఎం. దీంతోనైనా నాయకుల మధ్య సఖ్యత ఉంటుందని భావిస్తోంది ఆ పార్టీ. వైసీపీ రూలింగ్ లో ఉండగా విశాఖకు ఇన్ఛార్జ్ మంత్రిగా కన్నబాబు వ్యవహరించారని అంటున్నాయి. ఈ క్రమంలో ఆయనకు ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ పదవి ఇచ్చారని చెబుతున్నారు కొందరు. కొత్తగా వచ్చిన ఉత్తరాంధ్ర వైసీపీ బాస్ కన్నబాబుకు అక్కడి నేతలు సహకరిస్తారా? అన్నదే అసలు పాయింట్. ఇన్ ఛార్జుల వ్యవహారం వైసీపీలో మొదలైన ముసలం ఎంతవరకు దారితీస్తుందో చూడాలి. మొత్తానికి ఉత్తరాంధ్ర రాజకీయాలకు ఈ విధంగా జగన్ ఫుల్స్టాప్ పెట్టేరని చెప్పవచ్చు

# తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, కమ్యూనిస్టు నాయకుడు బోమ్మగాని ధర్మభిక్షం -నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ధర్మభిక్షం విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ప్రవేశించారు. పాఠశాల దశలోనే తోటి విద్యార్థులను చైతన్యపరచి, నిజాం నవాబు జన్మదిన వేడుకలను బహిష్కరించిన తీరు అప్పట్లో పెద్ద సంచలనమైంది. 1922 ఫిబ్రవరి 15న సూర్యాపేటలో బొమ్మగాని ముత్తిలింగం గౌడ్, గోపమ్మ దంపతులకు జన్మించిన భిక్షం నల్లగొండ జిల్లాలో తొలి విద్యార్థి నాయకుడిగా గుర్తింపు పొందారు. సూర్యాపేటలో ఆర్యసమాజంతో పాటు 1940లోనే తొలి విద్యార్థి హాస్టల్ను నిర్వహించడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు. ఈ హాస్టల్ ప్రథమ వార్షికోత్సవ సభకు హాజరైన హైదరాబాద్ కోత్వాల్ రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి ఆయనను తొలిసారి ధర్మభిక్షంగా సంబోధించారు. ఒక చేతితో దానమడుగుతూ రెండో చేత్తో ధర్మం చేస్తున్న వ్యక్తి కేవలం భిక్షం కాదు ధర్మభిక్షం అని పేర్కొనడంతో ఆనాటి నుంచి ఆయన పేరు ధర్మభిక్షంగా స్థిరపడిపోయింది. నల్లగొండ జిల్లాలో మొదటిసారిగా కార్మికసంఘాన్ని, కమ్యూనిస్టు సెల్ను స్థాపించిన ఘనత కూడా ఆయనకే దక్కింది. మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా పనిచేసిన ధర్మభిక్షం చట్టసభల్లో పీడిత ప్రజల గొంతుక వినిపించారు. 1952లో సూర్యాపేట నుంచి, 1957లో నకిరేకల్ నుంచి పీడీఎఫ్ తరపున, 1962లో నల్లగొండ నుంచి కమ్యూనిస్టు పార్టీ తరపున శాసనసభలో ప్రాతినిధ్యం వహించారు. 1991, 1996లో సీపీఐ అభ్యర్థిగా నల్లగొండ నుంచి లోక్సభకు ఎన్నికయ్యారు. ప్రజాపోరాటాలకు సూర్యాపేటతో పాటు నల్లగొండ జిల్లాను కేంద్ర బిందువుగా మార్చడంలో ధర్మభిక్షం సాగించిన కృషి స్ఫూర్తి దాయకమైనది. సామాన్య రైతు కూలీలతో పాటు విద్యావంతులు, ఉద్యోగులు, మహిళలను కూడా పెద్ద సంఖ్యలో ఉద్యమంలోకి ఆకర్షించి, కమ్యూనిస్టు పార్టీని అగ్రభాగాన నిలబెట్టడంలో చేసిన కృషి మరువలేనిది. కల్లుగీత కుటుంబంలో జన్మించిన ధర్మభిక్షం కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి శ్రమించారు. దున్నేవాడిదే భూమి అన్నట్టుగా గీసేవాడిదే చెట్టు అన్న నినాదం ఇచ్చి వారి హక్కుల కోసం పోరాడారు. ఆయన సాగించిన కృషి ఫలితంగానే ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడిపోయిన కార్మికులకు ఎక్స్గ్రేషియా అమలులోకి వచ్చింది. ప్రజా ఉద్యమ క్షేత్రంలో, చట్టసభల్లోనూ పేదల పక్షాన నిలబడి, వారి తరపున కలబడిన



ధర్మభిక్షం 89 ఏళ్ళ వయసులో ఇంట్లో జారి పడటంతో ఆయన తుంటి ఎముకకు దెబ్బతగిలింది. హైదరాబాద్లోని కామినేని ఆసుపత్రిలో ఫిబ్రవరి 11న శస్త్రచికిత్స జరిపారు. తర్వాత తేరుకున్నప్పటికీ ఉపిరితిత్తుల సమస్య జఠిలం కావటంతో చికిత్స పొందుతూ 2011, మార్చి 26న తుదిశ్వాస విడిచారు. ఆయన అవివాహితుడు సోదరుని కుమారున్ని దత్తత తీసుకున్నారు. ప్రజల మనిషిగా సామాన్య జీవితం గడిపిన ధర్మభిక్షం అందరికీ ఆదర్శప్రాయుడు.

# నేడు అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

చైల్డ్హుడ్ క్యాన్సర్ ఇంటర్నేషనల్ (సీసీఐ) సంస్థ బాల్యంలో వచ్చే క్యాన్సర్ను నిర్మూలించాలనే లక్ష్యంతో 2002లో ఇంటర్నేషనల్ చైల్డ్హుడ్ క్యాన్సర్ డే (ఐసీసీడీ)ని స్థాపించింది. ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 15న అంతర్జాతీయ అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవంను ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇతర అంతర్జాతీయ సభ్యులతో కలిసి నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 88దేశాల్లో 171 సభ్యత్వాలు కలిగిన సంస్థల సమన్వయంతో బాల్య క్యాన్సర్ డేపై పోరాటం చేస్తున్నారు. క్యాన్సర్తో బాల్య మరణాలు నిర్మూలన క్యాన్సర్ మహమ్మారిని తొలగింపు లక్ష్యంతో సంస్థలు పనిచేస్తున్నాయి.

నో మోర్ పెయిన్.. నో మోర్ లాస్ నినాదంతో..

నేడు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ డేలో నో మోర్ పెయిన్(నొప్పి), నో మోర్ లాస్ (మరణం) నినాదంతో బాల్య క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం జరిపేందుకు పిలుపునిచ్చారు.

పిల్లల్లో వచ్చే క్యాన్సర్లు

తల్లిదండ్రుల జీన్స్ కారణంగా పిల్లలకు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. రెండేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సు పిల్లలు ఎక్కువగా బాల్య క్యాన్సర్కు గురౌతున్నట్టు బాల్య క్యాన్సర్ నివారణ సంస్థలు గుర్తించాయి. అయితే పిల్లల వయస్సు తక్కువగా ఉండటంతో వారిలోని క్యాన్సర్ లక్షణాలు గుర్తించటం చాలాకష్టంగా ఉంటుంది. మూత్రం, రక్తపరీక్షల ద్వారానే బాల్య క్యాన్సర్లను గుర్తించటానికి వీలు ఉంటుంది. కిమోథెరపి, రేడియో థెరపి, ఆపరేషన్ల ద్వారా బాల్య క్యాన్సర్లకు చికిత్స ఉంటుందని క్యాన్సర్ నిపుణులు పేర్కొంటున్నారు. న్యూరో బ్లస్టామా, వీలు స్టీమార్ (కిడ్నీ), ఎపడో బ్లస్టామా(లీవర్), జమషెడ్ ట్యూమర్, లింపోమాస్, లికోమా క్యాన్సర్.

# మంత్రిగారి గన్ మెన్ గన్ బ్యాగ్ మిస్సింగ్

విజయనగరం

ఏపీ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గన్మెన్ కు సంబంధించిన బ్యాగ్ మిస్సింగ్ అయింది. బ్యాగులో 30 రౌండ్ల గన్ మ్యాగ్జిన్ వుంది. విజయనగరం కలెక్టరేట్ దగ్గర బ్యాగ్ మిస్ అయినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇప్పటివరకు బ్యాగ్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులు ఆందోళనకు గురవతున్నారు. విజయనగరం పోలీసులు బ్యాగ్ కోసం గాలిస్తున్నారు. ఘటన జరిగిన స్థలంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. మంత్రి గన్ మెన్ జీవీ రమణను ఎస్పీ సస్పెండ్ చేసారు.

# యాసిడ్ ఘటనపై మంత్రి లోకేష్ ఖండన

అమరావతి

అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం ప్యారంపల్లెకు చెందిన గౌతమి(23)పై యాసిడ్ దాడి ఘటన నన్ను తీవ్ర ఆందోళనకు గురి చేసిందని మంత్రి లోకేష్ అన్నారు. ఆ సోదరికి మెరుగైన వైద్య సాయం అందించి అండగా నిలుస్తాం. గౌతమిపై అత్యంత అమానవీయంగా వ్యవహరించిన సైకోని కఠినంగా శిక్షిస్తాం. భవిష్యత్ లో మరో చెల్లిపై ఇటువంటి ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరుతున్నానని అన్నారు.

# న్యాయమూర్తిపై దాడిని ఖండించిన న్యాయవాదులు

సికింద్రాబాద్రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయమూర్తి మీద జరిగిన దాడిని సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది... అధ్యక్షుడు వసంత కుమార్ మాట్లాడుతూ నేరం చేసిన వ్యక్తికి శిక్ష విధించిన కారణంగా ఒక న్యాయమూర్తి పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు.. గతంలో న్యాయవాదుల మీద దాడులు జరిగినాయి అని ఇప్పుడు న్యాయమూర్తుల మీద కూడా దాడులు జరుగుతున్నాయని, అడ్వకేట్స్ యాక్ట్ 1961 ప్రకారం యాక్ట్ ఉన్న అది ఇంప్లిమెంట్ జరగడం లేదని అడ్వకేట్లు తెలిపారు ....నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు కోరారు...

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ ప్రయాణికులకు గాయాలు

షాద్ నగర్రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని పరిగి రోడ్డు లో యూ టర్న్ తీసుకుంటున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దాంతో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులు తో పాటు బస్సు డ్రైవర్ గాయాలు అయ్యాయి. సకాలం లో 108 అక్కడికి చేరుకుని గాయపడ్డ వారిని చికిత్సా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.

# హోటల్ కు వచ్చిన కస్టమర్స్ పై ముకుమ్మడి దాడి

రాచకొండమీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హస్తినాపురం దావత్ బిర్యానీ హోటల్ నిర్వహకులు వీరంగం సృష్టించారు. హోటల్ కు వచ్చిన కస్టమర్స్ పై హోటల్ సిబ్బంది దాడికి దిగారు. హోటల్ మేనేజర్ దగ్గరుండి దాడి చేయించాడు. దాంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసారు.

# జగిత్యాలపై కవిత ఫోకస్

కరీంనగర్, ఫిబ్రవరి 14, (

గిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కారు దిగి, కాంగ్రెస్‌లో చేరారు. దీంతో సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు కవిత కసరత్తు మొదలుపెట్టారు. కాలం కలిసి వస్తే కవిత అసెంబ్లీలో అడుగుపెట్టేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతుంది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ తోపాటు.. పదిమంది ఎమ్మెల్యేలు కారు దిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ న్యాయ పోరాటం చేస్తుంది. ఉపఎన్నిక అనివార్యమనే ప్రచారం జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ఉపఎన్నిక వస్తే సిట్టింగ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు బీఆర్ఎస్ కసరత్తు మొదలుపెట్టింది.ముఖ్యంగా జగిత్యాలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫోకస్ పెట్టారు. పట్టున్న జగిత్యాలలో అధికార పార్టీని ఢీకొట్టాలంటే.. కవిత లాంటి వారే సరైన అభ్యర్థి అని పార్టీ భావిస్తుంది. అందులో భాగంగానే కవిత జగిత్యాల గులాబీ శ్రేణులతో మమేకమయ్యే పనిలో నిమగ్నమయ్యారు. తాజాగా కవిత జగిత్యాలలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. కులగణన బీసీల రిజర్వేషన్లపై జగిత్యాల నుంచే ఉద్యమం మొదలవుతుందని స్పష్టం చేశారు. పార్టీని ఎవరు వీడిన నష్టం ఉండదని, రాబోయే కాలం బీఆర్ఎస్ దేనని వ్యాఖ్యానించారు. ఉప ఎన్నిక వస్తే బరిలో ఉంటానని చెప్పకనే చెప్పారు.జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఉపఎన్నికతో సహా 18 సార్లు ఎన్నికలు జరిగితే.. 13 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. టీఆర్ఎస్ ఆవిర్భవించిన తర్వాత.. వరుసగా రెండుసార్లు కారు పార్టీ గెలుచుకుంది. ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపైనే డాక్టర్ సంజయ్ విజయం సాధించారు.సంజయ్ ఇటీవల కారు దిగి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రాజకీయ దుమారం చెలరేగింది. బీఆర్ఎస్ తోపాటు జగిత్యాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు కూడా ఆయన పార్టీ మారడాన్ని వ్యతిరేకించారు. పార్టీ పెద్దల జోక్యంతో కాంగ్రెస్‌లో ఆందోళన సద్దుమణిగింది. కానీ బీఆర్ఎస్ మాత్రం ఆగ్రహంగా ఉంది. ఉప ఎన్నిక వస్తే సంజయ్‌ని ఓడించడమే లక్ష్యంగా కారు పార్టీ కసరత్తు చేస్తుంది.జగిత్యాలలో సామాజికంగా, ఆర్థికంగా.. ఎమ్మెల్యే సంజయ్‌కి గట్టిపట్టు ఉంది. దీంతో బలమైన అభ్యర్థిని బరిలో నిలపాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అందులో భాగంగానే కవిత జగిత్యాలపై నజర్ పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌కు సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ ఎల్.రమణ ఉన్నప్పటికీ.. పార్టీ మారిన సంజయ్ కాంగ్రెస్ తరపున బరిలో నిలుస్తే.. బీఆర్ఎస్ నుంచి కవిత పోటీ చేస్తారనే టాక్ ఉందిజైలు నుంచి విడుదలయ్యాక రెండోసారి కవిత జగిత్యాలలో పర్యటించారు. ప్రైవేటు కార్యక్రమాలు, కొండగట్టు అంజన్న దర్శనం అని చెబుతున్నా.. ఉపఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా కవిత పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. కవిత అయితేనే జగిత్యాలలో కారు పార్టీకి అనుకూలంగా ఉంటుందని.. మరెవరైనా అక్కడ ప్రయోజనం ఉండదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

# టెండర్లు పిలిచేశారు...

హైదరాబాద్, ఫిబ్రవరి 14, (న్యూస్ పల్స్)

రైలు ప్రయాణికులకు శుభవార్త. హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్లు నిర్మించాలని రైల్వే శాఖ అనుకుంటోంది. దీంతో ఈ రెండు నగరాలకు వెళ్లేందుకు ప్రయాణ సమయం తగ్గనుంది.భారతదేశంలో రైల్వే ప్రయాణికులే అధికం. అయితే కొన్ని నగరాలకు వెళ్లేందుకు ఇప్పటికే బుల్లెట్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో చాలా వరకు ప్రయాణికుల సమయం ఆదా అవుతుంది. హైస్పీడ్ కారిడార్లలో భాగంగా బుల్లెట్ రైళ్లు చాలా వరకు ఉపయోగకరంగా ఉన్నాయి. ఇప్పుడు రైల్వే శాఖ హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై నగరాలకు హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మించాలని అనుకుంటోంది. దీంతో చాలా మందికి ప్రయోజనం చేకూరనుంది.ప్రస్తుతం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి విమాన ప్రయాణానికి ఒక గంట 15 నిమిషాలు పడుతుంది. హైదరాబాద్ నుంచి చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి ఒక గంట 20 నిమిషాలు పడుతుంది. విమానాశ్రయం నుండి నగరంలోని వివిధ ప్రదేశాలకు చేరుకోవడానికి సుమారు 2-3 గంటలకు పెరుగుతుంది. అయితే ఈ సమయంలో హైదరాబాద్ నుంచి హై-స్పీడ్ రైళ్లతో బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వెళ్ళవచ్చు.హైదరాబాద్-చెన్నై మార్గంలో హై-స్పీడ్ రైలు కారిడార్ 705 కి.మీ.లకు ప్రతిపాదించగా, హైదరాబాద్-బెంగళూరు మార్గం 626 కి.మీ.లుగా ఉంటుంది. రెండు హై-స్పీడ్ ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం డీపీఆర్, అలైన్‌మెంట్ డిజైన్, అంచనా, ఇంజనీరింగ్ సర్టిఫికేట్స్ తయారీతో కూడిన తుది సర్వేను నిర్వహించడానికి ప్రభుత్వ రంగ సంస్థ, ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ కార్పొరేషన్ అయిన ఖీమెఖా లిమిటెడ్ టెండర్లను ఆహ్వానించింది.'ఈ ప్రాజెక్టు సర్వే, అంచనాకు రూ. 33 కోట్లు అవసరం అవుతుంది. రాబోయే రైలు మార్గాలు ప్రత్యేకంగా హై స్పీడ్ రైళ్లకు సేవలు అందిస్తాయి. ఇవి సాంప్రదాయ రైలు ట్రాక్‌ల నుండి భిన్నంగా ఉంటాయి. ఈ డిజైన్ ముంబై-అహ్మదాబాద్ హై-స్పీడ్ కారిడార్ నమూనాను అనుసరిస్తుంది. దీనిని బుల్లెట్ రైలు కార్యకలాపాల కోసం అభివృద్ధి చేస్తున్నారు.' అని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ అధికారి ఒకరు చెప్పారు.టెండర్ నోటీసు ప్రకారం.. రెండు రైలు కారిడార్లలో రిమోట్ సెన్సింగ్ అధ్యయనాలు, జియోలాజికల్ మ్యాపింగ్, ప్రధాన వంతెనల డ్రిల్లింగ్, వయాడక్ట్, మట్టి, రాతి నమూనాలపై ప్రయోగశాల పరీక్షలను చేపట్టాల్సి ఉంటుంది. 350 కి.మీ. వేగంతో ప్రయాణించేలా రూపొందించబడినప్పటికీ, గంటకు 320 కి.మీ. వేగంతో పనిచేస్తాయని టెండర్‌లో పేర్కొన్నారు. ఈ అధ్యయనం ట్రాఫిక్ అధ్యయనాలు, బ్రిడ్జింగ్, టన్నెలింగ్, భవనం, ఇతర నిర్మాణాలతో సహా సివిల్ ఇంజనీరింగ్ అధ్యయనాలులాంటివాటిని కవర్ చేస్తుందని టెండర్ నోటీసులో పేర్కొన్నారు

# రైల్వేకు కలిసొచ్చిన వాటర్ బిజినెస్

హైదరాబాద్, ఫిబ్రవరి 14, (

ప్రస్తుతం రైల్ నీర్ నీటిని రూ.15 లీటర్ ధరకు అందిస్తున్న ఐఆర్సీటీసీ, దీనివల్ల భారీగా ఆదాయం ఆర్జిస్తోంది. రోజూ 14 లక్షల నీటిబాటిళ్ల ఉత్పత్తి చేస్తున్న ఈ సంస్థ, 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 39.5 కోట్ల విలువైన బాటిళ్లను ఉత్పత్తి చేసింది. ఈ బాటిళ్ల అమ్మకాలను చూస్తే, ప్రతిరోజూ సుమారు 10.82 లక్షల యూనిట్ల నీటిబాటిళ్ల అమ్మకం కైవసం చేసుకుంటోంది.ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్సీటీసీ) ప్రయాణికుల సౌకర్యం కోసం 'రైల్ నీర్' పేరుతో సొంత బ్రాండ్‌ను ప్రారంభించింది. రైలు ప్రయాణికులకు పరిశుభ్రమైన నీటిని అందించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ప్రారంభమైన ఈ వ్యాపారం, ఇప్పటివరకు విజయవంతంగా దినదినాభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం రైల్ నీర్ నీటిని రూ.15 లీటర్ ధరకు అందిస్తున్న ఐఆర్సీటీసీ, దీనివల్ల భారీగా ఆదాయం ఆర్జిస్తోంది. రోజూ 14 లక్షల నీటిబాటిళ్ల ఉత్పత్తి చేస్తున్న ఈ సంస్థ, 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 39.5 కోట్ల విలువైన బాటిళ్లను ఉత్పత్తి చేసింది. ఈ బాటిళ్ల అమ్మకాలను చూస్తే, ప్రతిరోజూ సుమారు 10.82 లక్షల యూనిట్ల నీటిబాటిళ్ల అమ్మకం కైవసం చేసుకుంటోంది. గత ఆర్థిక సంవత్సరంలో కేవలం నీటిబాటిళ్లను మాత్రమే అమ్మి రూ.29.22 కోట్ల ఆదాయాన్ని సాధించి, రికార్డు సృష్టించింది.ఐఆర్సీటీసీకు మొత్తం 16 ప్లాంట్లు ఉన్నాయి. అందులో 4 ప్లాంట్లు సొంతంగా నిర్వహిస్తున్నారు. 12 ప్లాంట్లు పీపీపీ మోడల్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ ప్లాంట్లు నంగ్లోయి, దానాపూర్, పాలూర్, అంబర్నాథ్, అమేథి, పర్సాల, బిలాస్పూర్, సనంద్, హాపూర్, మందిదీప్, నాగ్పూర్, జాగిరోడ్, మనేర్, సంక్రైల వంటి ప్రాంతాల్లో ఉన్నాయి.తాజా నివేదికల ప్రకారం, 2024 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 395 మిలియన్ బాటిళ్ల నీటిని ఉత్పత్తి చేశారు. గత ఏడాది, ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు చేయడం సంస్థకు మరింత లాభం చేకూర్చింది. 2003లో రైల్ నీర్ ప్యాకేజ్డ్ తాగునీటి వ్యాపారం మొదలుపెట్టింది.రైల్ నీర్ నీటిని అత్యాధునిక ఆటోమేటెడ్ ప్లాంట్ ద్వారా ప్రాసెస్ చేస్తారు. ఇది పూర్తిగా ఆటోమేటెడ్ ప్లాంట్, ఇక్కడ ఏ దశలోనూ నీటిని చేతులు తాకవు. దీని ద్వారా ఉత్పత్తి సమయంలో అధిక నాణ్యతను నిర్ధారించేందుకు ఐఆర్సీటీసీ పర్యవేక్షణ చేపడుతుంది.రైల్ నీర్‌ను ఎక్కడా కూడా చేతులు కలవకుండా ఉత్పత్తి చేస్తారు. మొత్తం ప్రక్రియ ఐఆర్సీటీసీ నియంత్రణలో ఉండటం ద్వారా, వినియోగదారులకు శుద్ధమైన, నాణ్యమైన నీటిని అందించడం వల్ల ఈ బ్రాండ్‌కు విశ్వసనీయత పెరిగింది. ఈ విధంగా రైల్ నీర్ ప్రస్తుతం ఐఆర్సీటీసీకి మంచి ఆదాయ వనరుగా మారింది. మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

# చికెన్... కర్రీ.... వర్రీ...

విజయవాడ, ఫిబ్రవరి 14 చికెన్ కర్రీస్ కాదు.. చికెన్ వర్రీసే ఇప్పుడు ట్రెండీ టాపిక్. చికెన్ తింటే అంతేనా..! గుడ్డు కూడా వెరీ బ్యాడా !! అనే భయాలే ఎటుచూసినా.. కోళ్లే కదా అని తేలిగ్గా తీసుకుంటే మన కిందకీ నీళ్లొచ్చేస్తాయి. ప్రజారోగ్యాలకు ప్రమాదాలు పొంచి ఉంటాయ్. బర్డ్ ఫ్లూ ఎంత లోతుల్లోకెళ్లి కెలికేస్తుందంటే.. లక్షలాది కోళ్లు మృత్యువాత పడి పౌల్ట్రీ రంగం కుదేలైపొయ్యి.. బ్రాండెడ్ చికెన్ కంపెనీల్లోనే వందలాది ఔట్‌లెట్లు మూసుకుపోయేంతలా.. అంత పెద్ద కేఎఫ్‌సీ వాళ్లే చికెన్ రేట్‌కార్డుల్ని మార్చుకునేంతలా.. చివరికి.. పెళ్లిళ్ల డిన్నర్ మెనూల్లో సడన్‌గా కనిపించకుండా పోయేంతలా.. తెలుగురాష్ట్రాల బార్డర్‌లో టెన్షన్లు పుట్టించేంతలా.. అమెరికా హెల్త్ ఎమర్జెన్సీ విధించేంతలా.. వరల్డ్ హెల్త్ ఆర్గనేజేషనే చేతులెత్తేసేంత సీరియస్‌గా మారబోతోంది సిట్యువేషన్..ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా.. కోళ్లకు, వాటి ద్వారా



మనుషులకు వ్యాపించే ప్రాణాంతకమైన బర్డ్‌ఫ్లూ వైరస్.. తొలిసారిగా ఇండియాలో 2006లో మహారాష్ట్రలోని నవాపూర్ అనే గ్రామంలోని ఒక పౌల్ట్రీ ఫామ్‌లో బైటపడింది. అప్పటినుంచి ఏటా మన దేశంలో బర్డ్‌ఫ్లూ అలారమ్ మోగుతూనే ఉంది. మహారాష్ట్ర, కేరళ, బెంగాల్, ఒడిషా, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దాదాపు 25 సీజన్లలో విరుచుకుపడింది ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా. ఇంతవరకూ బర్డ్‌ఫ్లూ ఫియర్‌తో 90 లక్షల కోళ్లు వధకు గురయ్యాయి. వాటితో పాటు పౌల్ట్రీ రంగానికి వేల కోట్లలో నష్టాలు కూడా. లేటెస్ట్‌గా మళ్లీ దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో మోత మోగిస్తోంది బర్డ్‌ఫ్లూ మహమ్మారి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్నికుదిపేస్తోంది బర్డ్ ఫ్లూ వైరస్..పశ్చిమగోదావరి జిల్లా తణుకు, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, భీమడోలు, కొల్లేరు సమీప ప్రాంతాల్లోని కోళ్లఫారాల్లో మరణ మృదంగం.. చూస్తుండగానే లక్షలాది కోళ్లు కుప్పకూలిపోతున్నాయి. కానూరు, వేల్పూరులో ఏకంగా ఐదు లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాయి. 15 రోజులుగా వణికిస్తున్న అంతుబట్టని వైరస్‌పై కొంత క్లారిటీ ఐతే ఉంది. ఐనా.. కోళ్ల నుంచి బ్లడ్ శాంపిల్స్ తీసుకుని భోపాల్‌లోని యానిమల్ డిసీజెస్ ల్యాబ్‌కు పంపితే? ఇది మరేదో కాదని.. ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా-ఊ5ఔ1 అని తేల్చేశారు. ల్యాబ్ రిపోర్ట్ రాగానే రాజమండ్రిలో అత్యవసర సమావేశం నిర్వహించారు జిల్లా కలెక్టర్ ప్రశాంతి.పౌల్ట్రీ ఫామ్ చుట్టుపక్కన కిలోమీటరు దూరం వరకు రెడ్‌జోన్‌గా.. పది కిలోమీటర్లు సర్విలెన్స్ జోన్‌గా ప్రకటించారు. మనుషుల సంచారాన్ని కూడా నియంత్రించారు. బర్డ్ ఫ్లూ పాజిటివ్ అని తేలిన కోళ్లను బతికుండగానే పూడ్చిపెట్టాలని, కోడిగుడ్లనూ నిర్మూలించాలని ఆదేశాలొచ్చేశాయ్. పూడ్చిపెట్టే ఒక్కో కోడికి 90 రూపాయల చొప్పున పరిహారం కూడా అందిస్తోంది ప్రభుత్వం. లక్షలు పెట్టి దాణా వేసి, పెంచుకున్న కోళ్లు కళ్లముందే నిమిషాల్లో చచ్చిపోతుంటే లబోదిబోమంటున్నారు పౌల్ట్రీ యజమానులు..కొల్లేరు సరస్సుకు వలస పక్షులు ఎక్కువగా రావడం వల్ల వాటి ద్వారా కోళ్లకు వైరస్ వ్యాపించి ఉంటుందా? చనిపోయిన కోళ్లను శాస్త్రీయంగా ఖననం చేయని పౌల్ట్రీ యజమానుల అలసత్వమే కారణమా..? అని ఆరా తీస్తున్నారు. కానీ.. ఉష్ణోగ్రతలు 32 నుంచి 34 డిగ్రీల మధ్య ఉంటేనే బర్డ్‌ఫ్లూ వైరస్ బతికుంటుంది. ప్రస్తుతం సగటున 34 డిగ్రీల పైనే టెంపరేచర్ నమోదౌతోంది కనుక.. బర్డ్‌ఫ్లూ వ్యాప్తి నియంత్రణలో ఉంటుంది అనేది ఒక భరోసా. కానీ.. ఉమ్మడి గోదావరి జిల్లాలనుంచి పక్కనే ఉన్న ఎన్టీఆర్‌జిల్లాకూ పాకింది బర్డ్ ఫ్లూ. చనిపోయిన కోళ్లను గొయ్యి తవ్వి ఎక్కడికక్కడే పాతిపెట్టేస్తున్న దృశ్యాలైతే హృదయ విదారకం.కొన్నేళ్ల కిందట ఒకసారి బర్డ్‌ఫ్లూ వైరస్ కనిపించింది. కానీ అలా వచ్చి ఇలా వెళ్లిపోయింది. ఈసారి మాత్రం పౌల్ట్రీ పరిశ్రమను నాశనం చేసేదాకా వదిలేలా లేదు.చనిపోయిన కోళ్లను భూమిలో పూడ్చిపెట్టాలి.. లేదా జనావాసాలకు దూరంగా డిస్పోజ్ చేయాలన్నది అధికారుల ఆదేశం. కానీ.. పంటకాలవల్లో పడేస్తూ జనారోగ్యంతో చెలగాటమాడితే..!పశు సంవర్ధక శాఖ ఎంత అప్రమత్తమైనా.. ఎన్ని చర్యలు తీసుకున్నా అధికారుల కళ్లు గప్పి కోళ్లను మాయం చేస్తున్నారు పౌల్ట్రీ ఓనర్లు. పశ్చిమగోదావరి జిల్లాలో కొన్నిచోట్ల బర్డ్ ఫ్లూ వైరస్‌ను గుర్తించిన పౌల్ట్రీల్లోంచి గుట్టుచప్పుడు కాకుండా కోళ్లను తరలిస్తున్నారు. కనిపిస్తే కోళ్లను చంపేస్తారనే భయంతో రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు సర్దేస్తున్నారు. దీంతో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి సులభంగానే జరిగిపోతోంది. అటు.. ముందే మేలుకున్న పొరుగురాష్ట్రం తెలంగాణ సరిహద్దుల్లో 24 ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి.. ఏపీ నుంచి రవాణా ఔతున్న కోళ్లను తిప్పి పంపుతున్నారు తెలంగాణ రవాణా శాఖ అధికారులు.చెక్ పోస్టుల్లో మూడు షిఫ్టుల్లో పనిచేస్తూ పూర్తి నిఘా పెట్టారు. బర్డ్ ఫ్లూ పూర్తిగా కంట్రోల్‌లోకి వచ్చేవరకు ఇలా నిషేధాజ్ఞలు కొనసాగుతాయ్. సో.. కోళ్ల వ్యాన్లకు తెలంగాణలో నో ఎంట్రీ అన్నమాట. ఆ రేంజ్‌లో ఉంది తెలుగురాష్ట్రాల్లో బర్డ్‌ఫ్లూ టెర్రర్.గత ఏప్రిల్‌లో అమెరికానూ వణికించింది బర్డ్‌ఫ్లూ. కోళ్ల నుంచి 70 మంది మనుషులకు సోకింది. కానీ.. మనిషి నుంచి మనిషికి బర్డ్‌ఫ్లూ వ్యాపిస్తుందా.. ప్రజారోగ్యం నిజంగానే ప్రమాదంలో పడుతుందా అనే స్పష్టతైతే లేదు.. సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇది. ఐనా.. బర్డ్‌ఫ్లూ అనగానే ఎందుకంత టెర్రర్.. పౌల్ట్రీ ప్రొడక్ట్స్ తింటే మనకూ బర్డ్‌ఫ్లూ సోకుతుందా.. ?కోళ్ల ఫారమ్‌లో పనిచేసేవాళ్లకు, కోళ్లకు దగ్గరగా మెలిగేవాళ్లకు మాత్రమే బర్డ్‌ఫ్లూ సులభంగా సోకే అవకాశముంది. మరి.. చికెన్ తింటే అంతేనా.. గుడ్డు కూడా వెరీ బ్యాడా !! అనే డౌట్లకు సమాధానమెక్కడ? వైరస్ సోకని కోడి మాంసాన్ని, గుడ్లను బాగా ఉడికించి భేషుగ్గా తినొచ్చు. కానీ.. వైరస్ సోకిన కోడి ఏది.. సోకని కోడి ఏది స్పష్టంగా తెలిసేదెలా..? అందుకే.. కొన్నిరోజుల పాటు చికెన్‌కు దూరంగా ఉండడమే మంచిది. జిహ్వాచాపల్యాన్ని తట్టుకోలేక చికెన్ తింటే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే.బర్డ్‌ఫ్లూతో కోళ్లు చనిపోయిన ప్రాంతాల్లో.. పది కిలోమీటర్ల దూరం వరకు చికెన్ షాపులు ఉండొద్దని, చికెన్ గానీ, గుడ్లను కానీ తినొద్దని దండోరా వేస్తున్నారు. అమ్మడం, కొనడం, తినడం కాదు.. ట్రాన్స్‌పోర్ట్ చేసినా నేరమేనట. ఫలితం.. రెండు తెలుగు రాష్ట్రాల్లో చికెన్ అమ్మకాలు దారుణంగా పడిపోవడం.

# తెలంగాణలో క్రైస్తవులు లేరా...

హైదరాబాద్, ఫిబ్రవరి 14,

కుల గణనలో పాల్గొనని వారికి తిరిగి అవకాశం ఇస్తున్నామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రీ సర్వే ఈ నెల 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించింది. తొలి విడత సర్వేలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓసీ కులాలకు సంబంధించిన వివరాలు కొంత బయపెట్టింది. దీనిపై ఇప్పటికే రాష్ట్రంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. బీసీ, ఎస్సీ జనాభా తగ్గించి చూపించారని, ఓసీ జనాభా పెరిగిందని ఇదంతా కుట్రపూరితంగా జరిగిందన్న విమర్శలు కాంగ్రెస్ పాలకులపై వచ్చాయి. అయితే దీన్ని సవరించేందుకు తిరిగి తెలంగాణ సర్కార్ రీసర్వేకు ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే మైనార్టీల విషయానికి వస్తే తెలంగాణలో ముస్లిం మైనార్టీ వివరాలు ప్రకటించిన ప్రభుత్వం క్రిస్టియన్లు ఎంత మంది ఉన్నారన్న లెక్క మాత్రం చెప్పలేదు. క్రైస్తవులను ఓసీల్లో కలిపారా లేదా బీసీల్లో ఉంచారా అనే ప్రశ్నలు క్రైస్తవ సమాజం నుంచి వస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 1.27 శాతం క్రైస్తవులు తెలంగాణలో ఉన్నారు. అన్ని కులాల వాళ్లు క్రైస్తవంలోకి మారారు. వీరిలో ఎక్కువ శాతం దళిత వర్గాలే. చట్ట ప్రకారం ఏ కులం వారు ఆ మతంలోకి మారినా కులం మాత్రం మారదు. ఉదాహరణకు ఓసీ క్రైస్తవుడు అయితే అతడు ఓసీగానే పరిగణిస్తారు. బీసీ కులం వ్యక్తి అయితే బీసీగానే గుర్తిస్తారు. ఎస్టీలకు ఇదే వర్తిస్తుంది. దళితులు మారితే 1952 కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం ఎస్సీగా గుర్తించే అవకాశం లేదు. వాళ్లు బీసీ- సీ క్యాటగిరీ కిందకు వస్తారు. వీరికి ఒక శాతం రిజర్వేషన్ కల్పించారు. ఈ సర్వేలో క్రైస్తవుల సంఖ్య కాని, ఎంత శాతం ఉన్నారన్న వివరాలు మాత్రం ప్రభుత్వం ప్రకటించ లేదు. దీంతో క్రైస్తవ సమాజంలో కొంత ఆందోళన నెలకొంది.హిందువుల్లోని కులాల జనాభా సంఖ్య, శాతం, ముస్లిం మైనార్టీల జనాభా, వారి శాతం తెలిపి కేవలం ఎందుకు క్రైస్తవ జనాభా సంఖ్య, జనాభా శాతం వివరాలు దాచడం ఏంటన్న ప్రశ్నను తలెత్తుతోంది. క్రైస్తవ సమాజం మాత్రమే కాకుండా బీజేపీ నుంచి ఎంపీ ధర్మపురి అరవింద్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వంటి వారు ప్రభుత్వాన్ని క్వశ్చన్ చేస్తున్నారు. ఈ రీ సర్వే తర్వాతైనా తెలంగాణలో క్రైస్తవ జనాభా ఎంత ఉంది అన్న విషయాన్ని బయటకు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. దళితుల నుంచి క్రైస్తవ మతంలో చేరిన బీసీలు ఎంత మంది అన్న వివరాలు తెలిపాలని కోరుతున్నారు.

# యువతిపై యాసిడ్ దాడి

అన్నమయ్య ఫిబ్రవరి 14,

గుర్రంకొండలో ప్రేమికుల దినోత్సం నాడు అమానుషం జరిగింది. ప్యారంపల్లెకు చెందిన గౌతమి(23) పై యాసిడ్ దాడి జరిపాడో శాడిస్టు. నిందితుడు మదనపల్లె అమ్మచెరువు మిట్టకు చెందిన గణేష్ గా గుర్తించారు. గౌతమి తలపై కత్తితో పొడిచి మొహంపై యాసిడ్ పోసాడు నిందితుడు. బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏప్రిల్ 29న గౌతమికి పెళ్లి నిశ్చయం అయిన నేపథ్యంలో ఘటన జరిగినట్లు అనుమానం.

# గవర్నర్ పాలన వెనుక బీజేపీ వ్యూహం

ఇంపాల్, ఫిబ్రవరి 15,

కుకి, మైతేయి వర్గాల మధ్య తీవ్రస్థాయిలో గొడవలు జరుగుతున్నాయి. ఈ రెండు వర్గాలు ఘర్షణ పడుతున్న నేపథ్యంలో వందలాది మంది చనిపోయారు. కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది.. కేంద్ర బలగాలు అక్కడ పహారా కాస్తున్నప్పటికీ శాంతిభద్రతలు ఇంకా అదుపులోకి రాలేదు.. దీంతోపాటు మణిపూర్ రాష్ట్రానికి మొన్నటిదాకా ముఖ్యమంత్రిగా పనిచేసిన బీరేన్ సింగఓ వర్గానికి కొమ్ముకొస్తున్నారని అక్కడి ప్రజలు




ఆరోపిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ చెందిన ఎమ్మెల్యేలు కూడా అదే పల్లవి అందుకున్నారు. ఒకవేళ విశ్వాస పరీక్ష జరిగితే ఎమ్మెల్యేలు విప్ ను సైతం ధిక్కరించే ప్రమాదం ఉండడంతో.. బిజెపి అధిష్టానం రంగంలోకి దిగింది. దీంతో బీరేన్ సింగ్ రాజీనామా చేయక తప్పలేదు. ఇటీవల ఆయన తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కు అందజేశారు. దానికంటే ముందు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో ఆయన భేటీ అయ్యారు. అమిత్ షా సూచనలతోనే బీరేన్ సింగ్ రాజీనామా చేసినట్టు తెలుస్తోంది.. విశ్వాస పరీక్ష పెట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిన ఒకరోజు ముందుగానే.. బీరెన్ సింగ్ ఈ నిర్ణయం తీసుకోవడంతో మణిపూర్ రాజకీయాలలో అనూహ్య మార్పు చోటు చేసుకుంది. ఈ క్రమంలో తదుపరి సీఎం ఎవరు అనే విషయంపై సందిగ్ధత ఏర్పడింది. అయితే కొత్త ముఖ్యమంత్రిని నియమిస్తారని.. మణిపూర్ రాష్ట్రంలో నెలకొన్న అల్లకల్లోల పరిస్థితులను బిజెపి అధిష్టానం చక్క దిద్దుతుందని అందరూ భావించారు. కానీ గురువారం రాత్రి కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.

మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పరిపాలన విధిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మణిపూర్ ముఖ్యమంత్రి ఇటీవల రాజీనామా చేసిన నేపథ్యంలో.. ఆ రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి 2023 నుంచి మణిపూర్ రాష్ట్రంలో ఘర్షణలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయి. మైతేయి, కుకీ వర్గాలు హోరాహోరీగా ఘర్షణ పడుతున్నాయి. అంతకంతకు హింస పెరుగుతున్న నేపథ్యంలో.. రెండు వర్గాల వారు చనిపోతున్న నేపథ్యంలో.. కేంద్రం రాష్ట్రపతి పరిపాలన విధిస్తూ నిర్ణయం తీసుకుంది.. రాష్ట్రపతి పరిపాలన విధించాలని గతంలోనే కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విపక్షాలు కూడా పార్లమెంటు వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని ఇదే విషయంపై నిలదీశాయి. అయితే ఇన్ని రోజులకు కేంద్రం మణిపూర్ ప్రాంతంలో రాష్ట్రపతి పరిపాలన విధిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వం తీరును స్వాగతిస్తున్నాయి. ఇప్పటికైనా జన బాహుళ్య కోణంలో ఆలోచించారని.. ఇదే ఆలోచన ముందే చేసి ఉంటే మణిపూర్ అలా మండిపోయేది కాదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈశాన్య రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని ప్రతిపక్షాలు విజ్ఞప్తి చేస్తున్నాయి

# అప్పుడే సెక్రటేరియెట్ లో లీకులా...

హైదరాబాద్, ఫిబ్రవరి 14,

తెలంగాణ పరిపాలనా యంత్రాంగం మొత్తం కొలువుదీరే రాష్ట్ర సచివాలయం భవనాలు పెచ్చులూడిన ఘటన పై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. సచివాలయం మూడో అంతస్తు నుంచి ఎదురు వైపున ఉండే డిజైన్ లోని ఓ భాగం ఊడిపోయింది. ఆ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి సహా ఇతర మంత్రులు సచివాలయంలోనే ఉన్నారు. ఈ ఘటనలో సెక్రటేరియట్ పార్కింగ్ స్థలంలో ఉంచిన రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ కారుపై పెచ్చులు పడడంతో.. కారు పై భాగం దెబ్బతింది.ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. నిర్మాణం పూర్తయ్యి రెండేళ్లు కూడా పూర్తవకుండానే ఇలాంటి ఘటనలు జరగడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దాంతో.. రాష్ట్ర ఉన్నతాధికారులు సైతం ఈ ఘటన పై దర్యాప్తు ప్రారంభించారు.దాదాపు రూ.1200 కోట్లతో నిర్మించిన భవనం. దేశంలోనే అత్యంత పేరున్న సంస్థ నిర్మించిందని ప్రచారం. నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదంటూ ప్రభుత్వాలు ఊదరగొట్టేశాయి. తీరా.. రెండేళ్లు కూడా గడవక ముందే పెచ్చులూడుతూ.. నిర్మాణంలోని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో.. ప్రభుత్వ అధికారులతో పాటు పాలకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. తాజాగా పెచ్చులూడిన ఘటన పై సెక్రటేరియట్ బిల్డింగ్ ఇంజనీర్లపై ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం రైలింగ్ పట్టి కూలిపోయి 24 గంటలైనా ఘటనపై అధికారులు నివేదిక ఇవ్వకపోవడంపై సీరియస్ అయ్యారు. 24 గంటల్లోగా తనకు ఈ ఘటన పై పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గతంలోని బిల్డింగ్ లను పూర్తిగా నేలమట్టం చేసి 28 ఎకరాల సువిశాల ప్రాంగణంలో నూతన సచివాలయం భవనాన్ని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. 265 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ బిల్డింగ్ ను దేశంలోని అత్యంత ఎత్తైన సచివాలయ భవనాల్లో ఒకటిగా గుర్తించారు. 2019 జూన్ 27న అప్పటి సీఎం కేసీఆర్ భూమిపూజ చేసి నిర్మాణాన్ని ప్రారంభించగా.. 2023 ఏప్రిల్ 30న ప్రారంభోత్సవం చేశారు. ఈ బిల్డింగ్ నిర్మాణ బాధ్యతల్ని షాపూర్ జీ పల్లోంజీ గ్రూప్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. కాగా.. దీని నిర్మాణం కోసం ఏకంగా రూ.1,200 కోట్లు ఖర్చు చేశారు. ఇంతా చేసిన తర్వాత.. రెండేళ్లు కూడా గడవక ముందే.. బిల్డింగ్ గోడలు చాలా వరకు పగుళ్లు కనిపిస్తున్నాయి. పిల్లర్ల పక్కన పొడవైన చీలికలు కనిపిస్తుండంతో.. బిల్డింగ్ నాణ్యతపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో.. రాష్ట్ర సచివాలయ బిల్డింగ్ నిర్మాణంలో లోపాలు, ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో పూర్తి వివరాలతో రిపోర్ట్ ఇవ్వాలని బిల్డింగ్ ఇంజనీర్లకు ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం మొత్తం పాలన నిర్వహించే నిర్మాణంలో నాణ్యతా లోపాలపై నిర్మాణ సంస్థ షాపూర్ జీ పలోంజి కంపెనీ ప్రతినిధులపై మంత్రి కోమటి రెడ్డి ఆగ్రహం చేశారు. భవనం రెయిలింగ్ కూలిన విషయంలో సంస్థ తరఫున వివరణ ఇచ్చేందుకు సంస్థ ప్రతినిధులు మంత్రిని కలవగా.. కోమటి రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కేంద్ర స్థానమైన భవనాన్నే ఇలా కడితే మిగతా వాటి పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. ఏది ఏమైనా నాణ్యతా లోపాలు ఉంటే.. సదరు సంస్థ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు.

లోపాలను సమీక్షిస్తున్నాం

ఘటనపై షాపూర్ జి పల్లోంజి నిర్మాణ సంస్థ స్పందించింది. రెగ్యులర్ డిపార్ట్‌మెంట్ వర్క్‌లో భాగంగా కేబుల్, లైటింగ్ కోసం పనులు చేస్తున్నారని వివరించింది. ఇది నిర్మాణ లోపం వల్ల జరిగింది కాదని స్పష్టం చేసింది. ఊడి పడింది కాంక్రీట్ వర్క్ కాదు.. స్ట్రక్చర్‌కు ఎలాంటి ప్రాబ్లం లేదని వివరించింది. ఊడి పడింది జీఆర్సీ ఫ్రేమ్ అని నిర్మాణ సంస్థ స్పష్టం చేసిందిఇటీవల లైటింగ్ కోసం, కొత్త కేబుల్స్ కోసం జీఆర్సీ డ్రిల్ చేస్తున్నారని పల్లోంజి సంస్థ వివరించింది. డ్రిల్ చేస్తే జీఆర్సీ డ్యామేజ్ అవుతుందని తెలిపింది. స్ట్రక్చర్ నిర్మాణం పూర్తయి రెండేళ్లు అవుతుందని.. ఎలాంటి నాణ్యత లోపం లేదని వెల్లడించింది. అయినా ఈ ఘటనపై తాను రివ్యూ చేస్తున్నామని.. ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.ఈ సచివాలయాన్ని గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. అయితే.. సచివాలయ నిర్మాణంలో పలు సమస్యలు ఉన్నట్లు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. సచివాలయం నిర్మాణంలో నాణ్యత లోపాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేశారు. తన ఛాంబర్‌తో పాటు టాయ్‌లెట్స్‌లోనూ శబ్దాలు వస్తున్నాయని.. అప్పట్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులకు చెప్పారు

# రీసర్వేతో దిద్దుబాటు చర్యలా...

హైదరాబాద్, ఫిబ్రవరి 14,

తెలంగాణలో కొద్ది రోజులుగా కుల గణన రచ్చ సాగుతోంది. స్వపక్షం, విపక్షం అన్న తేడా లేకుండా కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శలు చెలరేగాయి. బీసీ కుల గణన చేసిన విధానం దేశంలో తెలంగాణ ఆదర్శమవుతుందని సీఎం రేవంత్ రెడ్డి సగర్వంగా ప్రకటించారు. కానీ అందుకు తగ్గట్టుగా కుల గణన జరగలేదని తేలిపోయింది. కేసీఆర్ సర్కార్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేకు, రేవంత్ సర్కార్ చేసిన సర్వేకు మధ్య తేడాలు చర్చాంశనీయంగా మారాయి. 1931లో బ్రిటీష్ పాలకులు చేసిన కుల గణన సర్వే తర్వాత భారత దేశంలో కుల గణన సర్వే జరగలేదు. ఆ గణన ఆధారంగానే దేశంలో రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. 75 సంవత్సరాల తర్వాత బిహార్‌లో 2021లో కుల గణన జరిగింది. అది జరిగిన తీరుపై చాలా విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత గత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే దేశ వ్యాప్తంగా కుల గణన చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. అయితే ఎన్డీఏ గవర్నమెంట్ అధికారంలోకి రావడం, తెలంగాణలో బీఆర్ఎస్ ఓడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి రావడం జరిగింది. ఇచ్చిన హామీ మేరకు రేవంత్ ప్రభుత్వం బీసీ కులగణనకు పచ్చ జెండా ఊపింది. సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క సభ్యులుగా మంత్రి వర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 160 కోట్లతో శాస్త్రీయంగా సర్వే నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా కుల గణన సర్వే కోసం 1 లక్షా 3 వేల 889 మంది ఎన్యుమరేటర్లను వినియోగించారు. 1,15, 71, 457 కుటుంబాలను తెలంగాణలో గుర్తించగా ఎన్యుమరేటర్లు 1,12,15,134 కుటుంబాలను సర్వే చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. వివిధ కారణాలతో 3,56,323 కుటుంబాలను సర్వే చేయలేదు. తెలంగాణలో 96.9 శాతం సర్వే కవర్ అయినట్లు 3.1 శాతం సర్వేలో పాల్గొనలేదని ప్రభుత్వం ప్రకటించింది. 2024 నవంబర్ ఆరున సర్వే ప్రారంభించి, 2025 డిసెంబర్ 25వ తేదీతో సర్వేను ముగించారు.

ఈ సర్వేలో తెలంగాణ కులాల శాతం పరిశీలిస్తే..

ఎస్టీల జనాభా శాతం - 10.45

ఎస్సీల జనాభా శాతం - 17.43

మొత్తం ఓసీల జనాభా శాతం - 15.79

ముస్లిం మైనార్టీల జనాభా శాతం - 12.56

ముస్లిం మైనార్టీలలో ఓసీ జనాభా శాతం - 2.48 శాతం

బీసీల జనాభా శాతం - 46.25 శాతం

ముస్లిం మైనార్టీలలో బీసీల శాతం - 10.08 శాతం

ముస్లిం మైనార్టీలు, బీసీలు కలుపుకుని మొత్తం జనాభా శాతం - 56.33

2014 నుంచి పదేళ్లలో అంటే ఈ ఏడాది 2024 వరకు చూస్తే బీసీలు, ఎస్సీ, ముస్లిం జనాభా తగ్గినట్లు, ఓసీ జనాభా మాత్రం పెరిగినట్లు రేవంత్ సర్కార్ చేసిన కుల గణన తేల్చింది. దీనిపై ఆ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కుల గణన సర్వే కాగితాలు తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో బీసీ,ఎస్సీ నేతలు సైతం దీనిపై గుర్రుగా ఉన్నారు. ఓసీ జనాభా మాత్రమే ఎందుకు పెరిగింది , మిగతా సామాజిక వర్గాల జనాభా ఎలా తగ్గుతుంది. ఇదంతా ఓ కుట్ర లా జరిగిందన్న విమర్శలు వచ్చాయి. దీనికి సరైన సమాధానం ఇవ్వలేని పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలది. ఈ కుట్ర కోణం వెనుక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి ఉన్నారన్న చర్చ కాంగ్రెస్‌లో సాగింది. బీసీలకు అవకాశాలు లేకుండా చేసేందుకు ఓ వర్గం వారు కుట్ర పన్నారన్న ఆరోపణలు వచ్చాయి. బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కాంగ్రెస్‌ను ఈ విషయంలో టార్గెట్ చేస్తూ తమదైన శైలిలో విమర్శలు గుప్పించారు. ముస్లిం మైనార్టీలకు లబ్ధి చేకూరేలా బీసీ జనాభా తగ్గించి మైనార్టీ సంఖ్య పెంచి చూపించాలని చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభాతో పోల్చుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేయించిన సర్వేలో ఎలా తగ్గిందని ప్రశ్నలు గుప్పించారు. తిరిగి రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై హరీశ్ రావు, కేటీఆర్ ఎందుకు సర్వేలో పాల్గొన లేదని రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు కౌంటర్ ఎటాక్ చేశారు. ఇలా కుల గణన విషయంలో కాంగ్రెస్ సర్కార్ డిఫెన్స్‌లో పడింది. ఇది ఎన్నికల సమయంలో కాంగ్రెస్ గెలిస్తే దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన జరిపి తీరతామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ. ఆ హామీ మేరకు తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు బీసీల జనాభా తగ్గించి చూయించినట్లు విస్తృత ప్రచారం జరుగుతుండటంతో ఆ వార్త పార్టీ హైకమాండ్ వరకు చేరిందని తెలుస్తోంది. ఆ క్రమంలోనే ఇటు బీసీ కుల గణన రచ్చ, మరోవైపు ఎస్సీ వర్గకరణ విషయంలోను ఎమ్మార్పీఎస్ మందకృష్ణ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రెండు విషయాలు కాంగ్రెస్ పార్టీ కంట్లో నలుసుగా మారాయి. ఈ వివాదాలు నడుస్తుండగానే రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు అయింది. అందుకు రాష్ట్రంలోని ఈ పరిస్థితులే కారణమన్న చర్చ హస్తం నేతల్లో నడుస్తోంది. ఇటు ఎస్సీ వర్గీకరణ, అటు బీసీ కుల గణన ద్వారా రాజకీయ లబ్ధి పొందుదామనుకుంటే ఆ వ్యూహం బూమ్ రాంగ్ అయ్యే పరిస్థితి కలిగింది. దీంతో రేవంత్ సర్కార్ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఇటీవలే జరిగిన మందకృష్ణ మాదిగతో రేవంత్ భేటీ అందులో భాగమని తెలుస్తోంది. మరోవైపు బీసీల ఆగ్రహాన్ని చల్చార్చేందుకు మరో దఫా కుల గణన చేపట్టాలని నిర్ణయించింది. ఈ నెల16 నుంచి 28వ తేదీ వరకు మరోమారు కులగణన చేయనున్నారు. అయితే 3.1 శాతం మంది ఈ గణనలో పాల్గొనలేదు. వారి కోసం ఇది చేపడుతున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు.

## ఇంటర్మీడియట్ పబ్లిక్ థియరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి



కడప, ఫిబ్రవరి 14(భారత శక్తి ) : జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో ఇంటర్మీడియట్ పబ్లిక్ థియరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి.. డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప నగర కమీషనర్ మనోజ్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం కోర్సులకు సంబంధించి మార్చి 1వ తేదీ నుండి మార్చి 20వ తేదీ వరకు పబ్లిక్ థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 9 నుండి 12 వరకు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 64 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగిందన్నారు. అన్ని ప్రయివేటు కళాశాలలను సెన్సిటీవ్ కేంద్రాలుగా గుర్తించి ఆయా కేంద్రాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను అమర్చడం జరుగుతుందన్నారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి బందోబస్త్ ఏర్పాటు చేయాలనీ పోలీస్, రెవిన్యూ అధికారులకు సూచించారు. పరీక్ష ప్రారంభానికి అర్ధ గంట ముందు నుండి పరీక్ష పూర్తయ్యే వరకు విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలని, విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష సమయాల్లో విద్యార్ధులకు రవాణా వ్యవస్థ అనుకూలంగా ఉండేలా ఉదయం 6 నుండి 8 గంటల మధ్యలో బస్సులను అన్ని రూట్లలో నడపాలని, పరీక్ష పూర్తి అయ్యాక కూడా బస్సు సౌకర్యం ఉండేలా చూడాలని ఆర్.టి.సి అధికారులను ఆదేశించారు. ఆ సమయాల్లో ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు.

మాస్ కాపీయింగ్ కు పాల్పడే అవకాశాలు ఎక్కడా లేకుండా జాగ్రత్త వహించాలని, ఈ విషయంలో కళాశాలల యాజమాన్యం, సిబ్బంది అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. ఏ చిన్నపాటి పొరపాట్లు జరిగినా సంబంధిత బాద్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీటిని ఏర్పాటు చేయాలనీ మున్సిపల్ అధికారులకు, అత్యవసర మందులతో పాటు ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకుని ప్రధమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. ఆర్.ఐ.ఓ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఈ పరీక్షల కోసం 3 ఫ్లైయింగ్, 5 పెయిర్ల సిట్టింగ్ స్క్వాడ్లను, 64 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 64 మంది డిపార్టుమెంటల్ అధికారులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ కు అవకాశం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ కేంద్రాలను పూర్తిగా మూసి వేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. పరీక్షల నిర్వహణకు రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారం ఎంతైనా అవసరం అని, అందుకోసం సంబందిత శాఖల అధికారులు సహకరించాలని ఆయన కోరారు.సమావేశంలో విద్యాశాఖ, పోలీస్, ఏపీఎస్ ఆర్.టి.సి, విద్యుత్, వైద్య శాఖల అధికారులు పరీక్షల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మండల, జిల్లా ప్రాదేశిక నియోజక వర్గాల ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్





(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఫిబ్రవరి 14: మండల, జిల్లా ప్రాదేశిక నియోజక వర్గాల ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాలకు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాలకు జరిగే ఎన్నికలు సమర్ధవంతంగా ఎన్నికల నియమావళి మేరకు ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. రిటర్నింగ్ అధికారులకు, సహాయ రిటర్నింగ్ అధికారులకు అందజేసిన రూల్స్ పుస్తకాలను చదవాలని, ఎన్నికల నియమ నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, ఉపసంహరణ, అప్పీలు, తదితర విషయాలను శిక్షణలో తెలుసుకోవాలని అన్నారు. ఈ శిక్షణ లను మాస్టర్ ట్రైనర్ ఇవ్వడం జరుగుతున్నదని , ఏమైనా సమస్యలు ఉంటే నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ శిక్షణలో జడ్పీ సీఈవో చందర్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ సమ్మర్ చాలా హాట్ గురూ

హైదరాబాద్, ఫిబ్రవరి 14,

తెలంగాణకు భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాబోయే రోజుల్లో హైదరాబాద్ లో, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వడగాలులు వీచే అవకాశముందని పేర్కొంది. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేసింది. వడగాలులు, అత్యధిక ఉష్ణోగ్రతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.తెలంగాణలో ముందుగానే వేసవి కాలం ప్రారంభమైంది. రాబోయే రోజుల్లో హైదరాబాద్ మహా నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 36 నుంచి 38 డిగ్రీలకు చేరుకోవచ్చని.. అలాగే రాష్ట్రంలోనే పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. రానున్న 24 గంటల్లో నగరంలో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రత 33 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 20 డిగ్రీ ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే రానున్న 48 గంట్లలో గరిష్ట ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 21 డిగ్రీలు ఉండొచ్చని తెలిపింది.రాబోయే ఏడు రోజుల్లో హైదరాబాద్ లో గరిష్ట ఉష్ణోగ్రతలు 34 నుంచి 36 డిగ్రీలకు చేరే అవకాశం ఉందని పేర్కొంది. 2017 లో వీచిన భారీ వడగాలులు వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల్లో వీయొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. 2017లో తెలంగాణలో రికార్డు స్థాయిలో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అప్పుడు 23 రోజుల పాటు వడగాలులు వీచాయి. కాబట్టి ప్రజలు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.తీవ్రమైన వడగాలులు, ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు, సూచనలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు.హైడ్రేటెడ్ గా ఉండడానికి పుష్కలంగా నీరు తాగాలి.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవసరమైతేనే బయటకు రావాలి.భారీ వడగాలులు, ఉష్ణోగ్రతల నుంచి బయటపడడానికి తేలికైన తెలుపు రంగు దుస్తులను ధరించాలి. పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా ఉంటే మంచిది.ఈ ఏడాది భారత రుతుపవనాలపై ఎల్ నినో ప్రభావం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి టీ. బాలాజీ పేర్కొన్నారు. అయితే హిందూ మహాసముద్రం డైపోల్ అండ్ మాడెన్ జూలియన్ ఆసిలేషన్ వంటి అంశాలు భారీ ఉష్ణోగత్రలు కారణమయ్యే అవకాశం ఉండొచ్చు.హైదరాబాద్ ఏయిర్ క్వాలిటి ఇండెక్స్ 160 వద్ద ఉంటుంది. అయితే ఇది శ్వాసకోశ సమస్యలు ఉన్న వారికి ప్రాణానికే ముప్పు కలిగే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతల ఎక్కువగా ఉన్న సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఫిబ్రవరి నెలలోనే ఎండలు దంచికొడుతున్నాయి. ప్రజలు ఉక్కపోతకు లోనవుతున్నారు. ఉదయం 9 గంటలకే ఎండలు దంచికొడుతుండడంతో నగర వాసులు ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటి నుంచి ఏప్రిల్ 15 వరకు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. మార్చి నెల మధ్యలో వరకు 37 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఏప్రిల్ చివర్లో ప్రజలకు ఎండలు, ఉక్కుపోత నుంచి కాస్త ఉపశమనం పొందే అవకాశం ఉందని వివరించింది.రాబోయే రోజుల్లో హైదరాబాద్ లో భారీ ఉష్ణోగ్రతలు, వడగాలులు వీచే అవకాశం ఉన్నందున నగర వాసులు వాతావరణ శాఖ సూచనలు పాటించడం ముఖ్యం. ఎప్పటికప్పుడు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా.. ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచిస్తున్నారు. వృద్ధులు ఇంటికే పరిమితమైన మంచిదని చెబుతున్నారు. వాతావరణ శాఖ అధికారులు సూచనలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండొచ్చు.

# ఇది లవర్స్ డే కాదు బ్లాక్ డే

## పుల్వామా దాడుల్లో అమరులైన వీర జవాన్లకు జోహార్లు...

## 40 మంది సైనికులు అమరులైన పుల్వామా ఘటనకు ఆరేళు

భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి: 14ఈరోజు ఫిబ్రవరి 14! కొందరికి ఇది లవర్స్ డే, కానీ దేశభక్తులందరికీ బ్లాక్ డే! ఎందుకంటే ఇదే రోజు, 2019లో, మన దేశాన్ని కాపాడేందుకు తమ ప్రాణాలను అర్పించిన వీర జవాన్లకు ఘోరమైన దినం. పుల్వామా దాడి జరిగి, మన సైనిక సోదరులు అమరులయ్యారు. ప్రేమంటే రొమాన్స్ కాదు, దేశం కోసం చస్తానని చెప్పే తపనే నిజమైన ప్రేమ గులాబీలు ఇచ్చుకోవడం కాదు, రక్తాన్ని ధారపోసి జెండా ఎగరించడం నిజమైన ప్రేమ ఈ రోజు, మనం ప్రేమ గురించి మాట్లాడాలి? కానీ దేశాన్ని ప్రేమించే ప్రేమ గురించి! మన భవిష్యత్తును కాపాడే సైనికుల గురించి మనకు రక్షణగా నిలిచిన భారత ఆర్మీ గురించి! అందుకే ఈ రోజు బ్లాక్ డే. పాకిస్తాన్ మాయమాటలు చెప్పినా, మనం మర్చిపోం! మన జవాన్ల త్యాగం వృధా కాదు! ప్రతీ భారతీయుడి గుండెలో కడుపు మంటగా ఉంటేనే, శత్రువులకు గుణపాఠం చెప్పగలం!

# వైఎస్ఆర్ జిల్లాకు "నీతీ ఆయోగ్" అత్యుత్తమ పురస్కారం: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## ఆకాంక్షిత జిల్లా అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 3 కోట్ల కేటాయింపు



కడప, జనవరి 14 (భారత శక్తి ): ఆకాంక్షిత జిల్లాలలో అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు వైఎస్ఆర్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం "నీతీ ఆయోగ్" ద్వారా అత్యుత్తమ పురస్కారంతో రూ. 3 కోట్లను కేటాయించిందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి శుక్రవారం తెలిపారు.ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా.. ఆర్థిక పరిపుష్టి, నైపుణ్య అభివృద్ధి అనే అంశాల్లో ఫిబ్రవరి 2024 వరకు ఉత్తమ పనితీరు కనబరిచినందుకు గాను శుక్రవారం జిల్లాకు రూ. 3 కోట్ల నగదు పురస్కారాన్ని నీతీ ఆయోగ్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా 112 ఆకాంక్షిత జిల్లాల్లోని 36 జిల్లాలకు ఈ అత్యుత్తమ పురస్కారాన్ని నీతీ ఆయోగ్ ప్రకటించగా అందులో వైఎస్ఆర్ జిల్లా కూడా ఒకటిగా పురస్కారాన్ని అందుకోవడం గర్వించదగ్గ విషయం.జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం, బ్యాంకింగ్ యాక్సెస్‌ను విస్తరించడం, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంతో పాటు విస్తృతంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల ఈ పురస్కారం జిల్లాను వరించింది. కాగా ప్రజలను ఆర్థికంగా చైతన్యవంతం చేయడం, సామాజికంగా శక్తివంతం చేయడంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ, జిల్లా పరిపాలన యంత్రాంగం నిబద్ధత.. ఈ ప్రతిభా పురస్కారానికి ప్రధాన తార్కాణంగా చెప్పవచ్చు. అంతేకాకుండా జిల్లాలో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల సామాజిక-ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యంగా వినూత్న వ్యూహాలతో చురుకైన పాలన సాగించడం వంటి ఫలితాల కారణంగానే ఈ విజయం సాధ్యమైంది.జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి నాయకత్వంలో జిల్లా ఆర్థిక రాబడులను పెంచే లక్ష్యాలను నిర్దేశించుకుని, అన్ని రంగాల్లో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి మెరుగైన ఉపాధి అవకాశాలను సృష్టించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వం నీతీ ఆయోగ్ ద్వారా ప్రకటించిన రూ. 3 కోట్ల కేటాయింపును జిల్లాలోని యువతకు ఉపాధి కల్పన, యువ పారిశ్రామిక వేత్తల (స్టార్టప్) లను, వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, స్థిరమైన జీవనోపాధి అవకాశాలను సృష్టించడానికి సద్వినియోగం చేయడం జరుగుతుంది.జిల్లా ఆర్థిక ప్రగతిలో నీతీఆయోగ్ అవార్డు ఒక మైలురాయిగా, ప్రేరణగా గుర్తింపు నిచ్చింది. రానున్న రోజుల్లో జిల్లాలో సామాజిక, ఆర్థిక పురోభివృద్ధిని సాధించడానికి జిల్లా యంత్రాంగం అంకితభావంతో పనిచేసేందుకు జిల్లాను సమ్మిళిత, స్థిరమైన అభివృద్ధి వైపు పురోగమనంలో ముందుకెళ్లడానికి తోడ్పడనుంది.

# మినీ మేడారం జాతర సందడిగా కొనసాగుతుంది: జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్






తాడ్వాయి/ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 14 (భారత శక్తి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క సారలమ్మ మినీ జాతర సందడిగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. జిల్లాలోని మేడారం, ఐలాపూర్, కొండాయి, మల్యాల గ్రామాల్లో మినీ మేడారం జాతర జిల్లా అధికారుల సమన్వయంతో విజయవంతం చేశామని, రానున్న మేడారం మహా జాతరకు ఇదే తరహాలో ఏర్పాట్లు చేసి భక్తులకు ఇబ్బందులు కలగ కుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. తాడువాయి మండలం మేడారం గ్రామంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను శుక్రవారం దర్శించుకున్న జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆలయ పూజార్లు గిరిజన సంప్రదాయ పద్ధతిలో కలెక్టర్ ఆహ్వానం పలికి గద్దెల ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఐటిడిఏ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మినీ మేడారం జాతర ను పురస్కరించుకొని ఇప్పటివరకు ఐదు లక్షల మందికి పైగా భక్తులు అమ్మ వాళ్ళని దర్శించుకున్నారని, మినీ మేడారం జరిగే ప్రదేశాలలో మూడు లక్షలకు పైగా మంది భక్తులు అమ్మ వాళ్ళని దర్శించుకున్నారని తెలిపారు. మినీ మేడారం జాతర సందర్భంగా వచ్చే భక్తులతో పాటు ప్రతి శనివారం, ఆదివారం రోజులలో భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని, రానున్న ఆదివారాన్ని దృష్టిలో ఉంచుకొని అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలుగకుండా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయడంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు, సాయంత్రం 6 నుండి రాత్రి 9:00 వరకు అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వాళ్ళని దర్శించుకుంటున్నారని వివరించారు. మినీ మేడారం జరిగే గ్రామాలలో సైతం భక్తులకు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో మేడారం ఈవో రాజేందర్, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎం.డి. రఫీక్, డిడబ్లూఓ శిరీష, ఐటి డి ఏ ఎస్ ఓ రాజ్ కుమార్, తహసీల్దార్లు జగదీశ్వర్, రవీందర్, సృజన్ కుమార్, తదితరులుపాల్గొన్నారు.

# ఉద్యోగులకు లబ్ధి చేకూర్చడం కోసం బీజేపీ ప్రభుత్వం ఆదాయ పన్ను పరిమితిని 12 లక్షలకు పెంచింది : పార్లమెంటు సభ్యులు, జాతీయ ఓబీసి అధ్యక్షుడు లక్ష్మణ్







(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఫిబ్రవరి 14: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యక్రమంలో టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల సమావేశం నిర్వహించడం జరిగింది. కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి హాజరైన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ ఓబీసి అధ్యక్షుడు లక్ష్మణ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కామారెడ్డిలో కామారెడ్డి ఎమ్మెల్యేగా బీజేపీ పార్టీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి గెలిచి చరిత్ర సృష్టించారన్నారు. తెలంగాణలో ప్రజలు బీజేపీ పార్టీ వైపు ఉన్నారని, రాష్ట్ర సమగ్ర ఆభివృద్ధిని ఆలోచించి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పాల్గొని ఓటుని వేయాలన్నారు.

భారతదేశంలో ఉన్న ప్రజలందరూ ప్రధానమంత్రి మోదీ వైపు ఉన్నారన్నారు. మొన్నటి కేంద్ర బడ్జెట్ సమాజ అభివృద్ధి కోసం తోడ్పటైందన్నారు. మహిళలు స్వశక్తి కావాలని,చట్టసభలో రిజర్వేషన్లను ప్రకటించడం జరిగిందన్నారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులుకి 12 లక్షల వరకు ఆదాయ పన్నును మాఫీ చేసిన ఘనత బీజేపీకి ఉందన్నారు. విధాన సభలో ప్రశ్నించే గొంతు ఎత్తడానికి బీజేపీ అభ్యర్థులయిన అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రతీ శుక్రవారం వాటరింగ్ డే కార్యక్రమం నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఫిబ్రవరి 14: ప్రతీ శుక్రవారం వాటరింగ్ డే కార్యక్రమాన్ని తప్పని సరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.

శుక్రవారం రోజున స్థానిక కళాభారతి ముందుగల మొక్కలకు నీటిని పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతీ శుక్రవారం మొక్కలకు నీటిని పోయాలని, ముఖ్యంగా ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా నాటిన మొక్కలు, చెట్లకు నీటిని పోయాలనీ అధికారులను ఆదేశించారు.

పట్టణంలోని పార్క్ లు, మీడియన్, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు వాటరింగ్ చేయాలని మున్సిపల్ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాజేందర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, ఏఈ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలు

## భారత సంస్కృతికి విశేష కృషిచేసిన అహల్యా బాయి హెూల్కర్





కరీంనగర్, ఫిబ్రవరి 14(భారత శక్తి):ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మహిళలు మూల స్తంభాలాంటివారని, నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని , గృహిణిగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే పలు వ్యాపారాలు, వృత్తులు, ఉద్యోగాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ విజయాల బాటలో పయనిస్తున్నారని మహిళా సాధికారత , వ్యాపార వ్యవస్థాపకత కమిటీ చైర్మన్ బెల్లం మాధవి తెలిపారు. స్వదేశీ మేళా ప్రోగ్రాం లో భాగంగా శుక్రవారం మహిళా ఆర్థిక స్వావలంబన, అభివృద్ధి అంశంపై స్వశక్తి మహిళలకు సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య వక్తగా హాజరై మాట్లాడుతూ మహిళలు చిన్న తరహా, కుటీర పరిశ్రమల వంటివి స్థాపించి తాము స్వయం ఉపాధి పొందడమే కాకుండా ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. మహిళలకు ఆసక్తి ఉన్న రంగంలో ఉపాధి అవకాశాలను వెతుక్కుని స్థిరపడుతున్నారన్నారు. మహిళలను శక్తివంతం చేయడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని, వివిధ రంగాల్లో అనేక మహిళా సాధికారత కార్యక్రమాలు విజయవంతంగా చేపడుతున్నామన్నారు. ప్రధానంగా సాధికారత అంటే బాధ్యత తీసుకునే సామర్థ్యమని , జీవితంలో తమ ఎంపికలను తామే నిర్ణయించుకునే హక్కు మహిళలకు ఉందన్నారు. అలాగే లింగ సమానత్వం, లైంగిక వేధింపులు, గృహహింస, చట్టపరమైన హక్కుల వంటి అంశాలపై అవగాహన పెంచడానికి , సాంప్రదాయ నైపుణ్యాలను అప్ గ్రేడ్ చేయడానికి, అదే సమయంలో కొత్త నైపుణ్యాలను ప్రోత్సహించడానికి వివిధ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలలో మహిళలు తప్పకుండా పాల్గొనాలన్నారు. ఇవన్నీ కూడా మహిళలకు సాధికారత కల్పించే అంశాలేనన్నారు. మహిళలు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని, జీవనోపాధిని మెరుగుపరచుకోవాలన్నారు. అనంతర కాలాంశంలో లోకమాత , ధీరవనిత అహల్యబాయి హెూల్కర్ గురించి కేశవ మెమోరియల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్, స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ప్రాంత మహిళా ప్రాంత మహిళా ప్రముక్ కళ్లెం స్వప్న మాట్లాడారు. భారతదేశ సంస్కృతికి అహల్య భాయి విశేష కృషి చేశారని, ఆమె చేసిన కృషికి గుర్తింపుగా ఆమె పేరిట శ్రీ శక్తి పురస్కారాన్ని నెలకొల్పారని చెప్పారు. పరిపాలన సమయంలో అహల్య భాయి సేవకు, దానధర్మాలకు మారుపేరుగా నిలిచారన్నారు. మమ్మదీయుల దాడుల్లో శిథిలమైన అనేక దేవాలయాలను పునర్నిర్మించారన్నారు. హిందూ ధర్మ పునరుత్తేజ్జానికి ఆమె విశేష కృషి చేశారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పాడిపంట, రైతు ఆర్థిక స్వావలంబన సెమినార్ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఎన్నారై సామ ఎల్లారెడ్డి హాజరై మాట్లాడారు. వ్యవసాయం అనేక విషయాల సమ్మిళితమని , ప్రధానంగా వ్యవసాయభివృద్ధి, గ్రామీణభివృద్ధితో దగ్గరి సంబంధం కలిగి ఉందన్నారు. గ్రామీణ జనాభాలో ఎక్కువమంది ఏదో రూపంలో వ్యవసాయంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. అత్యధిక వ్యవసాయ ఉత్పత్తి గ్రామీణ ప్రాంతాల్లోనే జరుగుతుందన్నారు. రసాయన వ్యవసాయం కంటే ప్రకృతి వ్యవసాయమే సంపూర్ణ వ్యవసాయ విధానమే శ్రేయస్కరమన్నారు. ప్రకృతి వ్యవసాయం నేల పునరుత్పత్తి , నీరు, గాలి నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుందని, పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తుందన్నారు. సమగ్ర వ్యవసాయంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, పంటలతో అనుసంధానానికి ఎన్నో రంగాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా రైతులు వారి ప్రాంతంలో ఉన్న వనరులను అనుసరించి వ్యవసాయంపై శ్రద్ధ చూపితే మన సాంప్రదాయ వృత్తిగా ఉన్న వ్యవసాయంలో అంటూనే కుటుంబానికి అదనపు ఆదాయం , ఉపాధి కలిగించుకోవచ్చున్నారు. పాడి పశువులు , సేంద్రియ ఎరువుల ఉత్పత్తి , కూరగాయల సాగు వంటివి సమగ్ర వ్యవసాయ విధానంలో రైతులకు అనుకూలమైనవన్నారు. సమగ్ర వ్యవసాయ విధానంతో రైతుకి ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయానికి ప్రగతి అన్నారు. ఇట్టి కార్యక్రమంలో స్వదేశీ జాగరన్ మంచ్ తెలంగాణ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ బల్ల స్వప్న, రాష్ట్ర సేవికాసమితి జిల్లా కార్యవాహిక బూర్ల విజయలక్ష్మి, సహా కార్య వాహిక కామారపు మంజుల, నగర కార్యవాహిక కళ్లెం కవిత, పాక సంధ్య రేఖా, రమ, స్వరూపరాణి , ప్రముఖ న్యూట్రిషనిస్ట్ కాచం దీప్తి లతో పాటు కరీంనగర్ డైరీ చైర్మన్, స్వదేశీ మేళ కన్వీనర్ రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి భయంతో ప్రతిపక్షాలు విష ప్రచారం

## ప్రభుత్వానికి పట్టభద్రులకు వారధినవుతా


## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి





కరీంనగర్, ఫిబ్రవరి 14(భారత శక్తి) : రానున్న కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఓటమిని ముందే అంగీకరించాయని ఆ భయంతోనే తనపై ప్రతిపక్షాలు సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగతంగా విష ప్రచారం చేస్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఘాటుగా స్పందించారు.శుక్రవారం జగిత్యాల జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ధర్మపురి, జగిత్యాల,కోరుట్ల, నియోజకవర్గాల్లో పట్టభద్రులు కాంగ్రెస్ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలకు రిహాల్సర్ లాంటివని కాంగ్రెస్ శ్రేణులంతా కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ఉద్యోగ నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రభుత్వానికి పట్టభద్రులకు వారధిగా ఉండి వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానని, అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు ప్రకటించి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించిందని అన్నారు.ఎన్ ఎస్ యు ఐ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిపక్షాలు సోషల్ మీడియా ద్వారా చేసే విష ప్రచారాలను తిప్పికొట్టాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి ప్రతి పట్టభద్రుని కలిసి వివరించాలని తెలిపారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరు లక్ష్మణ్ కుమార్. ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నరసింగ రావు పలువురు మండల అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్ లు నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్యారా నగర్ డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని రద్దు చేయాలి: మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



గుమ్మడిదల,( సంగారెడ్డి) భారతశక్తి, ప్రతినిధి, ఫిబ్రవరి 14:: గుమ్మడిదలను మరో లగచర్లగా గా మార్చవద్దని ప్రజల నిర్ణయాన్ని గౌరవించి తక్షణమే డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని రద్దు చేయాలని మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలంలో డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతు జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నిరసనకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మద్దతు తెలిపారు. ఆయనతోపాటు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు చింతా ప్రభాకర్ ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు పాల్గొన్నారు .ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ డంపింగ్ యార్డు వల్ల ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. గుమ్మడిదల రైతులు బంగారం వంటి పంటలు పండిస్తారు. వారి భూములను మరో లగచర్లగా మార్చవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పక్కన పెట్టి దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమర్జెన్సీ తరహా పాలన అమలు చేస్తున్నారని విమర్శించారు. వందలాది స్థానికులను అన్యాయంగా అరెస్ట్ చేస్తూ, రాత్రికి రాత్రి పనులు మొదలు పెట్టడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతుల కోరిక మేరకు డంపింగ్ యార్డు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎయిర్ ఫోర్స్ అధికారులు సైతం ఇక్కడ డంపింగ్ యార్డు వద్దని జిల్లా కలెక్టర్ కు తెలియజేశారని. హైకోర్టు కూడా రెండు సార్లు పనులు ఆపాలని చెప్పినప్పటికీ, ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.అసెంబ్లీ వేదికగా ఈ సమస్యపై పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల నిర్ణయాన్ని గౌరవించి డంపింగ్ యార్డు ఏర్పాటును తక్షణమే రద్దు చేయాలి. లేదంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు . ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు చిమ్ముల జైపాల్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి, కొలాన్ బాల్రెడ్డి, వెంకటేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, రాజేష్,నరసింహారెడ్డి, తులసీదాస్,మద్దుల బాల్రెడ్డి సంతోష్ రెడ్డి, సదానంద రెడ్డి ముదిరాజ్ సంఘం నాయకులు జేఏసీ నాయకులు, రైతు సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోనే మొట్టమొదటి సారిగా ప్రతి పాఠశాల నుండి ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ను నియమించడం జరిగింది : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఫిబ్రవరి 14: తెలంగాణలోనే మొట్టమొదటి సారిగా ప్రతి పాఠశాల నుండి ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ను నియమించడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం స్థానిక కళాభారతి లో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా నియమించబడిన హెడ్ మాస్టర్స్, టీచర్స్ లకు పోక్సో చట్టంపై ఒక రోజు ఓరియన్టేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియమించబడిన ప్రొటెక్షన్ ఆఫీసర్ పాఠశాలలో పిల్లల పట్ల ఎటువంటి లైంగిక దాడులకు గురికాకుండా వాటిని ప్రారంభ దశలోనే అణిచివేసే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందనీ, వీటిలో భాగంగా జిల్లాలో ప్రతి స్కూల్ నుండి ఒక ప్రొటెక్షన్ ఆఫీసర్, హెడ్ మాస్టర్ లను ఎంపిక చేసి వారికి చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్స్ విధుల పైన సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ చిల్డ్రన్స్ ఇన్ స్కూల్ కాన్సెప్ట్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా మొట్టమొదటగా కామారెడ్డి జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ కి యునిసేఫ్ వారి సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. పోక్సో చట్టం గురించి ఆ చట్టంలో నిర్దేశితమైన బాధ్యతల గురించి వివరించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలలో సమస్యలు తలెత్తినప్పుడు వాటిని సమర్థవంతంగా పరిష్కరించే పరిజ్ఞానం హెడ్ ఆఫ్ ది ఇన్స్టిట్యూషన్స్ కి ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వివిధ రకాల వేధింపుల గురించి వివరించడం జరిగింది. జిల్లాలో సమర్థవంతమైన పాఠశాలలను తయారు చేసే దిశగా ప్రతి పాఠశాలలో సిబ్బందికి చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతున్నదని తెలిపారు. పోక్సో చట్టంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సీసీ టీవీ కెమెరాల పనితీరును ,అన్ని ప్రదేశాలలో కవరేజ్ ఉండే విధంగా చర్య తీసుకోవాలని సూచించారు. విద్యార్థినిలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ల గురించి వివరించాలని తెలిపారు. వేధింపుల సంఘటనలు జరిగినప్పుడు అట్టి విషయాన్ని రిపోర్ట్ చేసే విధంగా విద్యార్థిని లకు అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా కంప్యూటర్ ల్యాబ్, వరండాలలో సీసీ టీవీ లను ఏర్పాటుచేయాలని సూచించారు. విద్యార్థిని లను స్వంత పిల్లల్లాగ చూడాలని తెలిపారు. అవగాహన కార్యక్రమాలంలో ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో ఈ చట్టాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి సుమారు 500 మంది హెడ్ మాస్టర్ లకు, ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సి.డబ్ల్యు,సి. మెంబర్ స్వర్ణలత మాట్లాడుతూ, ఆడపిల్లలు హింసకు గురికాకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, యునిసెఫ్ రిసోర్స్ పర్సన్ డేవిడ్ రాజ్, రెసిడెన్షియల్ పాఠశాలల హెడ్ మాస్టర్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పలువురు హెడ్ మాస్టర్స్, ఉపాధ్యాయులకు బ్యాడ్జెస్ లను కలెక్టర్ పంపిణీ చేశారు.

# న్యాయమూర్తి పై దాడి న్యాయ వ్యవస్థను అవమానించినట్టే.

## న్యాయాన్ని పరిరక్షించే వాళ్ల పై దాడులు సమాజానికి చేటు

## కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి ఆవేదన

కరీంనగర్, ఫిబ్రవరి 14(భారత శక్తి):రాష్ట్రంలో, దేశంలో నిత్యం ఏదో ఒక చోట న్యాయవాదుల పై, న్యాయమూర్తులపై దాడులు జరగడం బాధాకరమని, ఈ దాడులు న్యాయ వ్యవస్థ పైనే నమ్మకం కోల్పోయేలా చేయడమే కాకుండా న్యాయ వ్యవస్థనే అవమానించేలా ప్రవర్తిస్తున్నారని, వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి ఆవేదనతో కోరారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో 9వ అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు మహిళ న్యాయమూర్తి పై గురువారం కరణ్ సింగ్ అనే కరడుగట్టిన నేరస్థుడు దాడి చేయడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ న్యాయాన్ని పరిరక్షించే వాళ్ల పై నిత్యం దాడులు చేయడం సమయానికి మంచిది కాదని, సమాజంలో ఏ వ్యవస్థ పైన నమ్మకం ఉంది అనుకుంటే అది ఒక న్యాయవ్యవస్థ పైనే ఉందనే విషయం ప్రభుత్వాలు గమనించాలని, లేనిపక్షంలో ఈ దాడులు ఇలాగే జరుగుతుంటే




న్యాయ వ్యవస్థ పై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా కొంతమంది వ్యవహరిస్తున్న తీరును ప్రభుత్వాలు గమనించి అరికట్టే విధంగా న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాల్సిందేనని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు టి.రఘువీర్, లైబ్రరీ సెక్రటరీ కే. రాజేందర్, సేనియర్, జూనియర్ కార్యవర్గ సభ్యులు సుంకే దేవకిషన్, బెజ్జంకి శ్రీకాంత్ తో పాటు పెంచాల ప్రభాకర్ రావు, సిరికొండ శ్రీధర్ రావు, బలరాం, సంపత్, రమేష్, శ్రీనివాస్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారానికి జవాబుదారిగా పనిచేయాలి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైయస్సార్ జిల్లా,ఫిబ్రవరి 14(భారత శక్తి ): రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి పూర్తి బాధ్యతాయుతంగా, జవాబుదారితనంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని సభా భవన్ లో బద్వేల్,కడప రెవెన్యూ డివిజన్ల పరిధిలోని రెవెన్యూ అధికారులకు రెవెన్యూ అంశాలు వివిధ చట్టాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం(వర్క్ షాప్) జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డి.ఆర్.ఓ విశ్వేశ్వర నాయుడు,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారిక వేదికలో 80% పైగా రెవెన్యూ సమస్యల పైనే వస్తున్నాయని అన్నారు. ఇందుకు సంబంధించి కడప బద్వేలు ఆర్డిఓ రెవిన్యూ డివిజన్లో పరిధిలోని సర్వేయర్లు, వీఆర్వోలు డిప్యూటీ తహసిల్దారులు, తహసిల్దార్లకు రెవెన్యూ అంశాలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఆయా మండలాల పరిధిలో తహసీల్దారులు కూడా కార్యాలయ సిబ్బందితో రెవెన్యూ సమస్యలపై వర్క్ షాప్ నిర్వహించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మండలాల్లో ఆయా గ్రామాలకు సంబంధించి వచ్చిన అర్జీలు అన్నింటినీ పరిశీలించి ఏ అంశాలకు సంబంధించిన అర్జీలు వచ్చాయో క్రోడీకరించుకోవాలని సూచించారు. అలాగే పిజిఆర్ఎస్, రెవెన్యూ సదస్సులు, రీసర్వే లో వచ్చిన అర్జీలను పరిశీలించి డూప్లికేట్ అర్జీలు లేకుండా చూసుకోవాలన్నారు. అర్జీలను నిశితంగా పరిశీలించి సమస్యను అర్థం చేసుకొని అనాలసిస్ చేసి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. గ్రామస్థాయిలో గుర్తించిన అర్జీలను పరిష్కరించడానికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు వారంలో నాలుగు రోజులు విజిట్ చేసి పూర్తి అవగాహనతో పరిష్కరించాలన్నారు. రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ ఎంక్వయిరీలు నిర్వహించేటప్పుడు సర్వేయర్లు, రెవెన్యూ




సిబ్బంది సమన్వయంతో కలసి పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రతి ఒక్క మండల స్థాయి అధికారులపై మోనిటరింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ భూముల ఆక్రమించుకునే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములు, ఆర్ ఓ ఆర్, పట్టాదారు పాస్ పుస్తకాలు,చట్టాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి పని చేయాలన్నారు.

జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి నుంచి రెవెన్యూ సదస్సులు, పిజిఆర్ఎస్, రీ సర్వే, గ్రామసభలు ఫ్రీ హోల్డ్ భూములపై మోనిటరింగ్ చేస్తున్నారని అందుకు అనుగుణంగా జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది నిబద్ధతతో పని చేయాలన్నారు. ఆయా మండలాలు గ్రామాల స్థాయిలోనే అర్జీలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు కమలాపురం తహసిల్దార్ శివరామిరెడ్డి రెవెన్యూ చట్టాలపై, పిపిటి ప్రజెంటేషన్ ద్వారా రెవెన్యూ అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్,బద్వేల్ ఆర్డీవో చంద్ర మోహన్, కడప, బద్వేల్ డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు,డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు,వీఆర్వోలు,తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య, ఆరోగ్య శాఖ అధ్వర్యంలో : కర పత్రాలు, గోడ ప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఫిబ్రవరి 14: కాలానుగుణ వాతావరణ పరిస్థితుల మార్పులకు అనుగుణంగా రానున్న వేసవి కాల పరిస్థితుల దృష్ట్యా సంభవించే ఆరోగ్య సమస్యలను నివారించడానికి తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అధ్వర్యంలో జాతీయ వాతావరణ మార్పుల ఆరోగ్య సమస్యల నియంత్రణ కార్యక్రమం లో భాగముగా ఈ రోజు కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యలయంలో కర పత్రాలు, గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగ్వాన్ చేత ఆవిష్కరించ బడినవి. ఇట్టి కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లా లో క్షేత్ర స్థాయి లో ప్రతి మండల గ్రామ పంచాయతీ ల వారీగా తీవ్రమైన ఎండల వల్ల సంభవించే వడ దెబ్బ తదితర అత్యవసర ప్రజారోగ్య సమస్యల గురించి ప్రజలలో అవగాహన కల్పించాలి. ఇట్టి విషయంలో వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వుంటూ తీవ్రమైన వేడి వల్ల వచ్చే వడ దెబ్బ ఇతర ఆరోగ్య సమస్యలు సంభవించినప్పుడు వెంటనే స్పందించాలని సూచించారు. ఈ రోజు ఆవిష్కరించిన గోడ ప్రతులను , కర పత్రాలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.చంద్రశేఖర్,ఎన్.సి.డి.ప్రోగ్రాం అధికారి డా.శిరీష , వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.విద్య , అదనపు జిల్లా వైద్యాధికారి డా.ప్రభు దయా కిరణ్ , జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎన్.భీమ్ కుమార్ , వైద్యాధికారులు పాల్గొన్నారు .

# సమస్య వుంటే నీ శ్రేయోభిలాషులకు తెలియజేయండి: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)ఫిబ్రవరి14: విధి నిర్వహణలో గాని లేదా ఏద్కెనా వ్యక్తిగత సమస్యలతో ఒత్తిళ్లకు గురౌవుతే నీ శ్రేయోభిలాషులకు లేదా నీ స్నేహితులకు తెలియజేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. విధినిర్వహణతో పాటు వ్యక్తిగతంగా ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లను నియంత్రించడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు శుక్రవారం పోలీస్ కమిషనరేట్‌లోని రుద్రమదేవి ప్రాంగణంలో నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో పాటు పరిపాలన విభాగం అధికారులు సిబ్బంది పాల్గోన్న ఈ సదస్సుకు వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గోన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ నిరంతరం విధులు నిర్వహించే పోలీస్ ఉద్యోగులకు విధి నిర్వహణలో భాగంగా ఎన్నో పని ఒత్తిళ్లను ఎదుర్కోనాల్సి వుంటుంది. క్రమ శిక్షణ, ప్రణాళికబద్దంగా విధులు నిర్వహించడంతో ద్వారా ఈ ఒత్తిళ్లను అధిగమించవచ్చని. కాని వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసి ఒత్తిళ్ల చాలా ప్రమాదకరమని. కొన్ని సందర్భాల్లో ఈ ఒత్తిళ్ల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోనాల్సి వుంటుందని. కొన్ని సందర్భాల్లో ఒత్తిళు తట్టుకోలేక క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబ రోడ్డున పడుతుందని. ముఖ్యంగా క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకునే ముందు మీ కుటుంబ గురించి ఆలోచించాలని. ఒత్తిళు అధిగమించేందుకుగాను రోజు కొద్ది సేపు వ్యాయామం లేదా



యోగకు సమయాన్ని కేటాయించాలని, మీ భావాలను ఇతరులతో పంచుకోండి, ఆరోగ్యకరమైన అహారపు అలవాట్లు చేసుకోవడంతో పాటు, ఆరోగ్యానికి హానీ కలిగించే అలవాట్లకు దూరంగా వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీసులకు సూచించారు. అంతకుముందుగా నగరానికి చెందిన మనస్తత్వవేత్తలు డా.జ్యోతి, స్వప్న బెన్సన్‌లు మానసిక ఒత్తిళ్లను ఏవిధంగా నియంత్రించుకోవాలని పోలీస్ సిబ్బంది, అధికారులకు తెలియజేసారు. ఈ కార్యక్రమములో డిసిపిలు షేక్ సలీమా, రవీందర్, అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, ఏసిపిలు జితేందర్,మధసూధన్,నాగయ్య,అనంతయ్య, ఏఓ రామకృష్ణతో పాటు ఆర్.ఐలు,ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఎస్.ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

# జిల్లాలో గ్రామాలు, పట్టణాలను స్వచ్ఛతకు ప్రతీకలుగా తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, ఫిబ్రవరి 14(భారత శక్తి ) : స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా జిల్లాలోని గ్రామాలు, పట్టణాలను స్వచ్ఛతకు ప్రతీకలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి నెలా 3వ శనివారం చేపట్టే "స్వచ్ఛ దివస్" కార్యాచరణపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, పంచాయతీ అధికారులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి విసి ద్వారా పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రా దివస్ గా నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఈ నెల మూడవ శనివారం (15వ తేదీ) నాడు అన్ని గ్రామాలు, పట్టణాల్లోని వీధుల్లో, ఇళ్లలో ''స్వచ్ఛ దివస్'' కార్యక్రమాన్ని విధిగా, బాధ్యతగా నిర్వహించాలన్నారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా.. దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్తను, డంపింగ్ యార్డులను పూర్తిగా తొలగించే చర్యలు చేపట్టాలన్నారు. చెత్త కాగితాలు, వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ కాగితలను సంపూర్తిగా తొలగించాలన్నారు. ఈ స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని.. అత్యంత ప్రధాన్యతతో ప్రత్యేకంగా చేపడుతూనే దైనందిన రోజువారీ క్లినింగ్ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించాలన్నారు. వచ్చే నెల స్వచ్ఛ దివస్ కార్యక్రమంలోగా జిల్లాను స్వచ్ఛ జిల్లాగా మార్చాలన్నారు. తేదీ చెత్త పొడిచెత్తను వేరు చేసే గ్రీన్, బ్లూ రంగుల ట్విన్ బిన్ పద్ధతిని ఉపయోగించాలన్నారు. ఐవిఆర్ఎస్ సిస్టమ్ ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి నుండి సేకరించే వ్యర్థాల నుండి హెూం కంపోస్టును తయారు చేసి ఇళ్లలోనే కిచెన్ గార్డెన్, హెూమ్ గార్డెన్ ద్వారా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. వ్యర్థాల సెగ్రిగేషన్, ట్విన్ బిన్ సిస్టమ్, డంప్ సైక్లింగ్ పై అవగాహన పెంచే ర్యాలీలు, ఇతర అవగాహన కార్యక్రమాలను ఉదయం 7 గంటల నుండే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇళ్లతో పాటు అన్ని రకాల కార్యాలయాలలో ఆయా కార్యాలయ సిబ్బంది స్వచ్ఛందంగా క్లిన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. గ్రామాలు, వార్డుల్లోని వీధుల్లో ఉత్పన్నమయ్యే చెత్తను సేకరించే కార్యక్రమంలో కేవలం హరిత రాయబారులు (గ్రీన్ అంబాసిడర్లు) మాత్రమే కాకుండా ప్రజలు కూడా పూర్తిస్థాయి భాగస్వామ్యం చేయాలన్నారు. అలాగే ఎన్జీవోలు, అన్ని శాఖల ఉద్యోగులు భాగస్వామ్యాన్ని కూడా ప్రోత్సహించాలన్నారు. మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట పరిశుభ్రతలతో మన గ్రామాన్ని, మన పట్టణాన్ని స్వచ్ఛతకు ప్రతీకలుగా తీర్చిదిద్దాలన్నారు. అపుడే మన జిల్లాను స్వచ్ఛ జిల్లాగా, రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా సాధించుకోగలమన్నారు. ఆ మేరకు స్వచ్ఛత వైపు ఒక ముందడుగు గేద్దామని పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, ప్రజలకు జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. "స్వచ్ఛ దివస్" లో భాగంగా ప్రతి పౌరుడు మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపివో రాజ్యలక్ష్మి, డిఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్ లు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధ(ఏ ఐ) అవగాహన సదస్సు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి,ఫిబ్రవరి 14: సంగారెడ్డి జిల్లా పరిధిలోని జేఎన్టీయూ సుల్తాన్పూర్ యూనివర్సిటీలో కృత్రిమ మేధా ఏఐ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథి హరి సాత్విక్ వీర్ల మాట్లాడుతూ కృత్రిమ మేధా అన్ని రంగాల వారికి అనగా వ్యవసాయం, విద్యా రవాణా అందరికీ అందుబాటులో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు డిజిటల్ భవిష్యత్తు ఉపయోగపడుతుందని నేర్చుకోవాలని, ఈ ఆధునిక కాలంలో ఎంతోమందికి ఉపాధి నిస్తుందని ఆయన అన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఏఐ



కేంద్రాలు ఉండడం విద్యార్థులకు మంచి అవకాశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నరసింహ, వైస్ ప్రిన్సిపల్ రాఘవేందర్ రావు, సిఎస్సి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వరుస విజయాలతో జోరు..

## కాస్కో అంటూ సవాలు విసురుతున్న పాకిస్థాన్




ఛాంపియన్స్ ట్రోఫీ ( సమరానికి సమయం ఆసన్నమవుతోంది. పాకిస్థాన్ వేదికగా జరగనున్న ఈ మెగా టోర్నీ ఫిబ్రవరి 19 ప్రారంభం కానుంది. 29 ఏళ్ల తర్వాత ఐసీసీ ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తోన్న పాక్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఇటీవల పాకిస్థాన్ ( వరుసగా మూడు వన్డే సిరీస్‌లు గెలిచి జోరుమీదుంది. ఇదే ఊపులో అగ్రశ్రేణి జట్లను ఓడించి వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలవాలనుకుంటోంది. టోర్నీ స్వదేశంలో జరగడం, డిఫెండింగ్ ఛాంపియన్ కావడం, భీకరమైన పేస్ దళం ఉండటం ఆ జట్టుకు కలిసొచ్చే అంశాలు. సూపర్ ఫామ్‌లో ఉన్న సైమ్ ఆయూబ్ చీలమండ గాయం కారణంగా ఈ మెగా టోర్నీకి దూరమవడం మైనస్‌గా మారింది. ఇటీవల సిరీస్‌ల్లో పాక్ ప్రదర్శన ఎలా ఉందంటే..

కంగారులను కంగుతినిపించి

గతేడాది ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన పాకిస్థాన్.. నవంబర్‌లో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో కంగారులను కంగారు పెట్టించింది. తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైనప్పటికీ తర్వాత రెండు మ్యాచ్‌ల్లో గొప్పగా పుంజుకుంది. అడిలైడ్‌లో జరిగిన రెండో వన్డేలో హారిస్ రవూఫ్ (%ఋతీఱం ఋబట%) (5/29) సంచలన బౌలింగ్ చేసి అదరగొట్టడంతో ఆసీస్ 163కే ఆలౌటైంది. పెర్త్‌లో జరిగిన మూడో వన్డేలో షషీన్ షా అఫ్రిది (3/32), నసీమ్ షా (3/54), రవూఫ్ (2/24) మెరవడంతో ఆస్ట్రేలియా 140కే కుప్పకూలింది. యువ బ్యాటర్లు సైమ్ ఆయూబ్, అబ్దుల్లా షఫీక్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. దీంతో పాక్ జట్టు 22 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై వన్డే సిరీస్ కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది.

ఆసీస్‌ను ఓడించిన తర్వాత రిజ్వాన్ (%వీశ్రీఱఎఋఎ =అఓఋఅ%) సారథ్యంలో ఎక్కువ అనుభవం లేని ఆటగాళ్లతో జింబాబ్వే పర్యటనకు వెళ్లిన పాక్‌కు ఆతిథ్య జట్టు షాక్ ఇచ్చింది. మూడు వన్డేల సిరీస్ తొలి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 80 పరుగుల తేడాతో పాకిస్థాన్ ఓటమి పాలైంది. మొదట జింబాబ్వే 40.2 ఓవర్లలో 205 పరుగులకే ఆలౌటైంది. వర్షం వల్ల ఆట నిలిచే సమయానికి పాక్ 21 ఓవర్లలో 6 వికెట్లకు 60 పరుగులే చేయగలిగింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో జింబాబ్వేను విజేతగా ప్రకటించారు. తర్వాత రెండు మ్యాచ్‌ల్లో మాత్రం పాక్ ఘన విజయం సాధించి 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.

2024 చివర్లో పాకిస్థాన్ జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లింది. అదిరే ఆటతో మూడు వన్డేల సిరీస్‌ను 3-0 క్లీన్‌స్వీప్ చేసి సఫారీలను సొంతగడ్డపై చిత్తు చేసింది. చివరి రెండు వన్డేల్లో పాక్ 300కుపైగా స్కోర్లు చేసింది. 22 ఏళ్ల సైమ్ ఆయూబ్ మొదటి, మూడో వన్డేలో సెంచరీలతో అదరగొట్టాడు. రబాడ, మార్కో యాన్సెన్ వంటి ప్రమాదకర పేసర్లను అతను దీటుగా ఎదుర్కొన్నాడు. తొలి మ్యాచ్‌లో సల్మాన్ ఆఘా బ్యాటింగ్‌లో 82 పరుగులు.. బౌలింగ్‌లో (4/32) ఆల్‌రౌండ్ ప్రదర్శన చేశాడు. ఈ సిరీస్‌లో బాబర్ అజామ్ (148 పరుగులు), మహ్మద్ రిజ్వాన్ (134 పరుగులు) కూడా రాణించారు. షహీన్ షా 7, నసీమ్ షా 5 వికెట్లు పడగొట్టారు.

వన్డే చరిత్రలో అత్యధిక ఛేదన

సొంతగడ్డపై జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలై పాకిస్థాన్.. సౌతాఫ్రికాపై అద్భుత విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా.. క్లాసెన్ (87), బ్రీట్జ్‌కే (83), బవుమా (82) రాణించడంతో 5 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యాన్ని పాక్ 49 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి ఛేదించింది. ఆ జట్టు వన్డేల్లో 350కిపైగా టార్గెట్‌ని ఛేజ్ చేయడం ఇదే మొదటిసారి. 91 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన పాక్‌కు.. సల్మాన్ ఆఘా (134బీ 103 బంతుల్లో 16ఐ4, 3ఐ6), మహ్మద్ రిజ్వాన్ (122 నాటౌట్‌బీ 128 బంతుల్లో 9ఐ4, 3ఐ6) మెరుపు శతకాలతో విజయాన్నందించారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 260 పరుగులు జోడించింది.

స్పిన్ ఎటాక్ ఎలా ఉందంటే?

పేస్ బౌలింగ్ పరంగా పాక్ పటిష్టంగా ఉన్నా స్పిన్ విభాగంలో అంత బలంగా లేదనే చెప్పాలి. ఆ జట్టులో అబ్రార్ అహ్మద్ ఏకైక స్పెషలిస్టు స్పిన్నర్. కానీ, అతడికి అనుభవం లేదు. ఇప్పటివరకు 6 వన్డేలు మాత్రమే ఆడి 12 వికెట్లు పడగొట్టాడు. ఖుష్దిల్ షా, సల్మాన్ ఆఘా, సౌద్ షకీల్ పార్ట్ టైమ్ స్పిన్నర్లున్నా వారు ఎంతవరకు ప్రభావం చూపిస్తారో చూడాలి. ఇటీవల ముగిసిన బంగ్లాదేశ్ ప్రిమియర్ లీగ్‌లో ఖుష్దిల్ 10 మ్యాచ్‌ల్లో 6.03 ఎకానమీతో 17 వికెట్లు పడగొట్టాడు. ఇతను బ్యాటింగ్‌లోనూ రాణించాడు. 59.60 సగటుతో 298 రన్స్ చేశాడు.



# ఆ ఒక్కటి తప్ప.. ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట

## రెట్టించిన ఉత్సాహంతో భారత్

ఏమూడు వారాల వెనక్కి వెళ్తే.. టీమ్ ఇండియా ( పరిస్థితి అగమ్య గోచరంగా కనిపించింది. ఓవైపు సొంత గడ్డపై న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్ పరాభవం.. మరోవైపు ఆస్ట్రేలియా పర్యటనలోనూ సిరీస్ ఓటమి.. ఇంకోవైపు చేజారిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తు.. ఇవన్నీ చాలవన్నట్లు భారత క్రికెట్ మూలస్థంభాలనదగ్గ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల పేలవ ఫామ్‌తో వారి రిటైర్మెంట్ గురించి ఊహాగానాలు.. ఇలా మొత్తంగా భారత క్రికెట్ అభిమానులకు అన్నీ చేదు గుళికలే. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఇంగ్లండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌ల్లో ఘనవిజయాలు సాధించడమే కాక.. జట్టులో సమస్యలన్నీ పరిష్కరించుకొని రెట్టించిన ఉత్సాహంతో ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీకి సిద్ధమైంది భారత జట్టు.

పుష్కరకాలం పాటు సొంతగడ్డపై టెస్టుల్లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది టీమ్ ఇండియా. 2012-13 సీజన్లో ఇంగ్లండ్ చేతిలో టెస్టు సిరీస్ ఓడాక.. భారత్‌కు సొంతగడ్డపై సిరీస్ ఓటమన్నదే లేదు. కానీ గత ఏడాది చివర్లో భారత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్.. టీమ్ ఇండియాకు షాక్‌ల మీద షాక్‌లు ఇచ్చింది. మూడు టెస్టుల్లోనూ భారత్‌ను ఓడించి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. మహామహా జట్లను మట్టికరిపించిన భారత్‌కు సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఇలాంటి పరాభవం ఎదురవుతుందని ఎవరూ ఊహించలేదు. ఇదే పెద్ద దెబ్బ అంటే.. తర్వాత ఆస్ట్రేలియాలో సైతం ఓటమి తప్పలేదు. తొలి టెస్టులో ఘనవిజయంతో సిరీస్‌ను ఘనంగా ఆరంభించిన భారత్.. తర్వాత నాలుగు టెస్టుల్లో మూడు ఓడి సిరీస్‌ను చేజార్చుకుంది.

వరుసగా ఆస్ట్రేలియాలో రెండు సిరీస్‌లు సాధించిన భారత్.. ఈసారి మాత్రం బోర్డర్-గావస్కర్ ట్రోఫీని ప్రత్యర్థికి అప్పగించక తప్పలేదు. ఈ ఓటమితో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు కూడా గల్లంతయింది. వరుసగా రెండుసార్లు ఫైనల్ చేరిన భారత్.. ఈసారి మాత్రం లీగ్ దశలోనే నిష్క్రమించింది. వరుసగా రెండు సిరీస్‌ల్లోనూ రాణించకపోవడంతో కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిల మీద తీవ్ర విమర్శలు తప్పలేదు. వాళ్లిక రిటైరైతే మేలనే వ్యాఖ్యానాలు వినిపించాయి. ఆస్ట్రేలియా పర్యటనలోనే రోహితరిటైర్మెంట్ గురించి జోరుగా ప్రచారం జరిగింది. కానీ అతను ఒత్తిడికి తలొగ్గలేదు.

టీమ్ ఇండియా మీద అభిమానుల్లో అంచనాలు తగ్గిపోయిన స్థితిలో సొంతగడ్డపై ఇంగ్లండ్ లాంటి బలమైన జట్టుతో టీ20 సిరీస్ మొదలైంది. అందులో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీ20 జట్టు అదరగొట్టింది. 4-1తో సిరీస్ సాధించింది. ఈ సిరీస్‌తోనే సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ పునరాగమనం చేశాడు. ఫిట్‌నెస్, ఫామ్ చాటుకున్నాడు. బ్యాటర్లు, బౌలర్లు నిలకడగా రాణించారు. ఇక వన్డే సిరీస్‌లో ఇంకా ఉత్తమ ప్రదర్శన చేసింది రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు. జట్టులో స్థానం ప్రశ్నార్థకమైన స్థితిలో శ్రేయస్ అయ్యర్ అదరగొట్టాడు. శుభ్‌మన్ గిల్ మళ్లీ ఫామ్ అందుకున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ ఏడాదికి పైగా విరామం తర్వాత వన్డేల్లో శతకం సాధించాడు. చివరి వన్డేలో కోహ్లీ సైతం అర్ధశతకంతో లయ అందుకున్నాడు. కేఎల్ రాహుల్ సైతం చివరి వన్డేలో కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

ఇక బౌలింగ్‌లో అయితే భారత్‌కు ఢోకా లేదు. సీనియర్ పేసర్ మహ్మద్ షమీతో పాటు యువ బౌలర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా ఆకట్టుకున్నారు. స్పిన్నర్లు జడేజా, అక్షర్ పటేల్ నిలకడగా రాణించారు. వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ సైతం తమకు దక్కిన అవకాశాలను ఉపయోగించుకున్నారు. ప్రధానంగా రోహిత్, కోహ్లీ జోరందుకోవడం భారత్‌కు అతిపెద్ద సానుకూలాంశం. ఇంగ్లండ్ లాంటి మేటి జట్టుపై వన్డే సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి ఛాంపియన్స్ ట్రోఫీలో అడుగుపెట్టడం భారత్ ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచుతుందనడంలో సందేహం లేదు.

అతడూ ఉండుంటే..

ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు కనిపిస్తున్న ఏకైక లోటు ప్రధాన పేసర్ ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా (లేకపోవడం. ఆస్ట్రేలియా పర్యటనలో అతనెంత గొప్ప ప్రదర్శన చేశాడో తెలిసిందే. మిగతా జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయకపోయినా.. బుమ్రా మాత్రం అదరగొట్టాడు. చివరి టెస్టులో అతను పూర్తిస్థాయిలో బౌలింగ్ చేసి ఉంటే.. సిరీస్ చేజారేదే కాదు. బుమ్రా ధాటికి ఆస్ట్రేలియా మేటి బ్యాటర్లు ఎలా వణికిపోయారో తెలిసిందే. నిరుడు భారత జట్టు టీ20 ప్రపంచకప్ గెలవడంలో బుమ్రా ఎంత కీలకపాత్ర పోషించాడో విధితమే. ముఖ్యంగా ఫైనల్లో ఆశలే లేని స్థితిలో తన అద్భుత బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపుతిప్పిన తీరును అభిమానులు మరిచిపోలేరు. అలాంటి బౌలర్ ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఉంటే భారత్ మరింత ఉత్సాహంతో టోర్నీలో బరిలోకి దిగేది. బుమ్రా లేకపోవడం 30 శాతం మేర భారత్ అవకాశాలను తగ్గిస్తుందని వ్యాఖ్యాత రవిశాస్త్రి చెప్పడంలో అతిశయోక్తి లేదు. కానీ బుమ్రా స్థానంలో జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా.. ఇంగ్లండ్‌తో టీ20 మ్యాచ్‌లో, వన్డేలో అదరగొట్టాడు. మరోవైపు మహ్మద్ షమీ ఫిట్‌నెస్, ఫామ్‌ను చాటుకున్నాడు. అర్ష్‌దీప్ సైతం జోరుమీదున్నాడు కాబట్టి బుమ్రా లేని లోటు కనిపించదనే భారత జట్టు, అభిమానులు ఆశిస్తున్నారు.

యూఏఈ మన అడ్డా..

ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమిస్తున్నది పాకిస్థానే అయినా.. ఆ దేశానికి భారత జట్టు వెళ్లడం లేదన్న సంగతి తెలిసిందే. టీమ్ ఇండియా తన మ్యాచ్‌లను యూఏఈలోనే ఆడబోతోంది. భారత్‌తో మ్యాచ్ కోసం పాకిస్థాన్ సైతం అక్కడికే రానుంది. టీమ్ ఇండియా ఫైనల్ కు చేరినా.. ప్రత్యర్థి జట్టు అక్కడికి వచ్చి ఆడాల్సిందే. యూఏఈ పిచ్‌లు భారత వికెట్లకు దగ్గరగా ఉంటాయి. స్పిన్‌కు బాగా అనుకూలిస్తాయి. ప్రస్తుతం భారత్‌కు ఉన్న స్పిన్ బలం మరే జట్టుకూ లేదంటే అతిశయోక్తి కాదు. జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్‌లకు తోడు వరుణ్ చక్రవర్తి కూడా తోడయ్యాడు.

ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో అదరగొట్టిన వరుణ్‌ను ఇటీవలే జట్టులోకి చేర్చారు. దీంతో సుందర్ తప్పుకోవాల్సి రావచ్చు. అయినా భారత్ స్పిన్ బలానికి తిరుగు లేనట్లే. భారత ఆటగాళ్లందరికీ యూఏఈ వికెట్లు కొట్టిన పిండే. భారత్ అక్కడే ఉండి ప్రాక్టీస్ చేయడం, తన మ్యాచ్‌లన్నీ ఆడడం వల్ల వాటి మీద పూర్తి అవగాహన ఉంటుంది. ఒకరకంగా భారత్‌కు ఇది సొంతగడ్డ అన్నట్లే. పాక్ సహా మిగతా జట్లు పర్యటక జట్లు కానున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ జోరును ప్రత్యర్థులు అడ్డుకోవడం కష్టమే కావచ్చు. మన జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాలే కానీ.. మరో ఐసీసీ ట్రోఫీ భారత్ ఖాతాలో చేరడం ఖాయం.

# ఛాంపియన్స్ ట్రోఫీ 2025..

## విజేతకు బంపర్ ప్రైజ్‌మనీ

పాకిస్థాన్ ఆతిథ్యాన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఎనిమిది టీమ్‌లు తమ స్క్వాడ్‌లను ప్రకటించాయి. టీమ్‌ఇండియా ఆడే మ్యాచులు దుబాయ్ వేదికగానే జరుగుతాయి. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీ కి సంబంధించి వివరాలను ఐసీసీ ప్రకటించింది. చివరిసారిగా 2017లో ఈ టోర్నీ జరిగిన సంగతి తెలిసిందే. అప్పటితో పోలిస్తే దాదాపు 53 శాతం ప్రైజ్‌మనీని పెంచడం గమనార్హం. దాదాపు రూ.60 కోట్ల ప్రైజ్‌మనీని టీమ్‌లకు పంచనుంది. చివరి ప్లేస్‌లో నిలిచిన జట్టుకూ రూ.1.22 కోట్లు దక్కనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఒక్కో మ్యాచ్‌కు రూ.29 లక్షలు అదనంగా ఇవ్వనుంది.

వివరాలు ఇలా..

విజేత ప్రైజ్‌మనీ: రూ. 20.8 కోట్లు

రన్నరప్ ప్రైజ్‌మనీ: రూ. 10.4 కోట్లు

సెమీ ఫైనలిస్టులు: రూ. 5.2 కోట్లు (ఒక్కొక్క జట్టుకు)

ఐదో స్థానం, ఆరో స్థానం: రూ.3 కోట్లు

ఏడు, ఎనిమిదో స్థానాలు: రూ.1.2 కోట్లు

ప్రతి మ్యాచ్‌కు ప్రైజ్‌మనీ: రూ.29 లక్షలు

గత ట్రోఫీలో ఎవరికెంతంటే?

ఎనిమిదేళ్ల కిందట 2017లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరిగింది. ఫైనల్‌లో భారత్‌పై గెలిచిన పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఆ జట్టుకు అప్పుడు రూ. 14.18 కోట్లను ప్రైజ్‌మనీగా ఐసీసీ ఇచ్చింది. రన్నరప్‌గా నిలిచిన భారత్‌కు రూ.7 కోట్లు దక్కాయి. సెమీస్‌కు చేరిన ఇంగ్లండ్, బంగ్లాదేశ్‌కు ఒక్కొక్క టీమ్‌కు రూ.3 కోట్లు, ఐదు-ఆరు స్థానాల్లోని ఆసీస్, దక్షిణాఫ్రికాకు చెరో రూ.58 లక్షలు, ఆఖరి రెండు ప్లేస్‌ల్లోని శ్రీలంక, న్యూజిలాండ్‌కు రూ.39 లక్షలు అందాయి.






# వారి నుంచి ప్రశంసలు..

## విమర్శలూ ఎక్కువే: స్మృతి మంధాన

మహిళల ప్రీమియర్ లీగ్ మూడో సీజన్‌కు వేళైంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బరిలోకి దిగనుంది. తొలి మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో తలపడనుంది. ఐపీఎల్‌లో ఆర్సీబీ ఇప్పటి వరకూ టైటిల్ సాధించలేదు. కానీ, డబ్ల్యూపీఎల్ టైటిల్‌ను గతేడాది ఆ మహిళా జట్టు అందించడంతో ఫ్రాంచైజీ ఫ్యాన్స్ ఆనందానికి అవధుల్లేవు. ఈ క్రమంలో మహిళా జట్టుపై ప్రశంసలు కురిపించిన అభిమానులు.. పురుషుల టీమ్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో తమ ఫ్యాన్ బేస్‌పై ఆర్సీబీ సారథి స్మృతి మంధాన ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒకరకంగా తమ ప్రదర్శనకు వారి అభిమానమే ఎంతో సాయంగా ఉంటుందని తెలిపింది."మా చుట్టూ ఏం జరుగుతుందనేది మేం పట్టించుకోం. జట్టుగా నాణ్యమైన క్రికెట్ ఆడేందుకు ప్రయత్నిస్తాం. ఆర్సీబీకి అభిమాన గణం భారీ స్థాయిలో ఉంటుంది. మిగతా టీమ్‌లతో పోలిస్తే మాపై వచ్చే ప్రశంసలు, విమర్శలూ కాస్త ఎక్కువగానే ఉంటాయి. ఇలా ఉండటం వల్ల జట్టంతా కలిసికట్టుగా మైదానంలో పోరాడుతాం. ఎక్కడికెళ్లినా అభిమానులు ఆర్సీబీ అంటూ నినాదాలు చేయడం బాగుంటుంది. దానిని మేం పాజిటివ్‌గానే తీసుకుంటాం" అని మంధాన వ్యాఖ్యానించింది. మాకు అది లోటే.."డబ్ల్యూపీఎల్ వేలం తర్వాత మా జట్టులో చాలా మంది గాయాలపాలయ్యారు. అందుకే, గత సీజన్‌లో బరిలోకి దిగిన ఫైనల్ %శ×%లో కొందరు అందుబాటులో లేరు. మా ఆల్‌రౌండర్ సోఫీ డివైన్ లేకపోవడం మాకు తీవ్రమైన లోటే.



# టారిఫ్ భయాలు.. కొనసాగిన నష్టాలు.. 23 వేల దిగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. భారత్ సహా ఇతర దేశాలపై రెసిప్రోకల్ టారిఫ్‌లను విధిస్తాననే నిర్ణయాన్ని ట్రంప్ సమర్థించుకోవడం మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో సూచీలు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఓ దశలో దాదాపు 700 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ సైతం 22,774.85 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆఖర్లో రెండు బెంచ్ మార్క్ సూచీలు కోలుకున్నాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది.

సెన్సెక్స్ ఉదయం 76,388.99 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,138.97 ) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. రోజంతా ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 75,439.64 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 199 పాయింట్ల నష్టంతో 75,939.21 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 102.15 పాయింట్ల నష్టంతో 22,929.25 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 9 పైసలు బలపడి 86.84 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎన్టీపీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. నెస్లే ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 75.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు మరింత పెరిగి 2960 డాలర్ల వద్ద గరిష్ఠ స్థాయికి చేరింది. 3 వేల డాలర్ల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది.

కారణాలు ఇవే..

భారత్ మిత్ర దేశమైనా పరస్పర పన్నుల విషయంలో వెనక్కి తగ్గబోనని ట్రంప్ సున్నితంగా తేల్చి చెప్పారు. భారత్ సహా ఇతర దేశాలపై పరస్పర పన్నులు తప్పవని ఆయన చేసిన వ్యాఖ్యలు మార్కెట్లపై గట్టి ప్రభావమే చూపాయి.

అటు విదేశీ సంస్థాగత మదుపర్లు విక్రయాలు కొనసాగుతుండడం మార్కెట్ల పతనానికి కారణమవుతున్నాయి. డాలర్ విలువ, అమెరికా బాండ్ రాబడులు తగ్గితేనే ఈ విక్రయాలు తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

ప్రధాన కంపెనీలు సైతం మూడో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను ప్రకటించకలేకపోవడం మార్కెట్ల నష్టాలకు మరో కారణంగా నిపుణులు భావిస్తున్నారు.

# ఐపీఎల్ ఫ్రీ బంద్.. మ్యాచ్ చూడాలంటే సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సిందే

రిలయన్స్‌కు చెందిన జియో సినిమా, డిస్నీ హాట్‌స్టార్‌ను ఒకే వేదిక పైకి తీసుకొచ్చాయి. దీంతో జియో హాట్‌స్టార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై జియో సినిమా, డిస్నీ హాట్‌స్టార్‌లోని కంటెంట్ అంతా ఒకేచోట వీక్షించొచ్చు. ఈ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్స్ రూ.149 నుంచే ప్రారంభమవుతాయి. ఆ వివరాలు ఇవే..

మొబైల్ ప్లాన్ (యాడ్- సపోర్టెడ్ ప్లాన్) ప్రారంభ ధర రూ.149. దీని వ్యాలిడిటీ 3 నెలలు. ఇక ఏడాది వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ.499గా కంపెనీ నిర్ణయించింది. ఈ ప్లాన్ల ద్వారా కేవలం ఒక మొబైల్‌లో మాత్రమే కంటెంట్ చూసే సదుపాయం ఉంటుంది.

రెండు డివైజ్‌లకు సపోర్ట్ చేసేలా రెండు సూపర్ ప్లాన్లను (యాడ్- సపోర్టెడ్ ప్లాన్) జియోహాట్‌స్టార్ తీసుకొచ్చింది. మూడు నెలల వ్యాలిడిటీతో అందుబాటులోకి తెచ్చిన ప్లాన్ ధర రూ.299. ఇక ఏడాది వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ.899.




ప్రకటనలు లేకుండా కంటెంట్ వీక్షించాలనుకొనేవారి కోసం జియోహాట్‌స్టార్ రెండు ప్రీమియం ప్లాన్లను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ నెలకు రూ.299తో ప్రారంభమవుతుంది. మూడు నెలల ప్రీమియం ప్లాన్ ధర రూ.499. ఏడాది వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ.1499. ఈ ప్రీమియం ప్లాన్లతో నాలుగు డివైజ్‌లలో కంటెంట్‌ను వీక్షించొచ్చు.

ఇప్పటి వరకు ఐపీఎల్ మ్యాచ్‌లను ఉచితంగా వీక్షించిన అభిమానులకు ఆ అవకాశం పూర్తిగా లేనట్లే. హాట్‌స్టార్ ం జియో కలిసి జియోహాట్‌స్టార్ పేరిట విలీనం నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లను ఉచితంగా చూడటం సాధ్యం కాదు. అందుకోసం కనీస ప్లాన్ రూ. 149తో సబ్‌స్క్రిప్షన్‌ను తీసుకోవాల్సి ఉంటుంది.

ఒకటే యాప్

జియో సినిమా, డిస్నీ హాట్‌స్టార్ కలిపి జియో హాట్‌స్టార్‌గా అవతరించింది. ప్రస్తుతం హాట్‌స్టార్ యాప్‌ను వినియోగిస్తుంటే.. యాప్ అప్‌డేట్ తర్వాత అది జియో హాట్‌స్టార్‌గా మారుతుంది. అలాగే, జియో సినిమా యాప్‌నకు వెళితే అక్కడి నుంచి జియో హాట్‌స్టార్ యాప్‌కు రీడైరెక్ట్ అవుతుంది. ఒకవేళ ఇప్పటికే హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ తీసుకుని ఉంటే రాబోయే 3 నెలల పాటు వారికి పాత రేట్లే కొనసాగుతాయి. ఒకవేళ జియో సినిమా ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ తీసుకుని ఉంటే వారు ఆటోమేటిక్‌గా జియోహాట్‌స్టార్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌కు మారుతారు.



# మీరేం చేస్తే.. మేమూ అదే: భారత్‌పై టారిఫ్‌ల విషయంలో తగ్గేదే లేదన్న ట్రంప్..

అక్క అక్కే.. లెక్క లెక్కే అన్నటుంది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరి. భారత్ ఎంత మిత్ర దేశమైనా.. పరస్పర పన్నుల విషయంలో తగ్గేదేలే అని సున్నితంగా తేల్చి చెప్పారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా నేడు శ్వేతసౌధంలో ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఇరువురు నేతలు సంయుక్త విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రెసిప్రోకల్ టారిఫ్‌ల గురించి వచ్చిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. భారత్ సహా ఇతర దేశాలపై విధిస్తున్న పన్నులను సమర్థించుకొన్నారు.

"ప్రస్తుతం మేము రెసిప్రోకల్ నేషన్ (ఎదుటి దేశం ఎలా స్పందిస్తే.. అలానే ప్రతిస్పందించే దేశం). భారత్ లేదా మరే దేశమైనా సరే.. మాపై తక్కువ పన్నులు విధిస్తే.. మేము కూడా అలానే టారిఫ్‌లు వేస్తాము. భారత్ మాపై ఎంత శాతం పన్ను విధిస్తే.. మేమూ అంతే ఛార్జి చేస్తాము. వారి సుంకాలు ఎంత ఎక్కువన్నది ఇక మా సమస్య కాదు. నా తొలివిడత పాలనలో అధిక టారిఫ్‌లపై చర్చించాము. కానీ, ఎలాంటి రాయితీలు పొందలేకపోయాం. అందుకే మేము తేలికైన మార్గాన్ని ఎంచుకొన్నాం. వారెంత విధిస్తే.. మేము అంతే ఛార్జి చేస్తాం. అమెరికా ప్రజల కోసం ఇదే సరైన చర్య.

మాకు ఐరోపా అత్యంత సమస్యాత్మకం. ఎవరూ కనీవినీ ఎరుగని స్థాయిలో మాపై పన్నులు విధిస్తున్నారు. వారు చాలా విషయాల్లో అడ్వాంటేజ్ తీసుకొంటున్నారు. ఆ చర్యలతో మేము ఏమాత్రం సంతృప్తిగా లేము.

ఇక చైనా విషయం మరింత భయంకరం. నేను అధికారంలోకి రాక ముందు కనీసం 10శాతం కూడా పన్ను విధించేవారు కాదు. నేను తొలిసారి పగ్గాలు చేపట్టినప్పుడు వారి నుంచి వందల బిలియన్ డాలర్ల పన్నుల రూపంలో వసూలు చేశాం. మేము సరిగ్గా ఎలా చేయాలో అలానే చేశాము" అని ట్రంప్ వివరించారు. మోదీ-ట్రంప్ పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్ల దాటించే లక్ష్యంతో మిషన్-500ను ప్రకటించారు.

ఇక మోదీ పర్యటన రోజే పరస్పర టారిఫ్‌ల విషయాన్ని ట్రంప్ ముందుగానే తెరపైకి తెచ్చి బలమైన సంకేతాలు పంపారు. "మూడు అద్భుతమైన వారాలు. ఇప్పటివరకు అత్యుత్తమైనవి కావచ్చు. కానీ, ''నేడు మాత్రం అత్యంత ముఖ్యమైంది.




# వాట్సప్‌లో నచ్చినట్టుగా చాట్ థీమ్.. రంగులతో చాట్ బబుల్

తక్షణ సందేశం పంపాలన్నా, ఫొటోలు పంచుకోవాలన్నా వెంటనే గుర్తుకు వచ్చే మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ . ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు, అప్‌డేట్లను యూజర్లకు పరిచయం చేస్తుంటుందీ యాప్. నచ్చినట్టుగా చాట్ థీమ్, రంగులతో చాట్ బబుల్‌ను మార్చుకొనే కొత్త సదుపాయాన్ని తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చింది.

కొత్త ఫీచర్ సాయంతో యూజర్లు అనేక రకాల థీమ్‌లను తమ చాట్‌కు జోడించొచ్చు. ఇందులో 30 రకాల వాల్‌పేపర్ ఆప్షన్లు ఉన్నాయి. కావాలంటే మీ కెమెరాతో బంధించిన ఫొటోలనూ చాట్ థీమ్‌గా పెట్టుకోవచ్చు. అంతే కాదండోయ్ చాట్ బబుల్‌ని కూడా రంగుల్లో మార్చుకోవచ్చు. సాధారణంగా వాట్సప్‌లో మనం పెట్టే మెసేజ్‌లు ఆకుపచ్చ రంగుల్లో.. మనకు పంపే మెసేజ్‌లు తెలుపు రంగులో కనిపిస్తాయి. వీటిని కూడా మార్చుకోవచ్చు. అంటే ఇకపై వాట్సప్‌ని మీకు నచ్చిన రంగులతో నింపొచ్చన్నమాట. యూజర్ల అనుభవాన్ని మెరుగపరిచి, చాటింగ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ఈ సదుపాయాన్ని తీసుకొచ్చింది.

నచ్చితే అన్ని చాట్‌లకు ఒకే థీమ్ పెట్టుకోవచ్చు. లేదంటే నచ్చిన వ్యక్తుల చాట్‌లకు మాత్రమే థీమ్‌ను ఎంచుకోవచ్చు. అయితే ఈ థీమ్ మీకు మాత్రమే కనిపిస్తుందనే విషయం గుర్తుంచుకోండి. వాట్సప్ ఛానల్ నిర్వహిస్తున్నవారు కూడా ఈ ఫీచర్‌ని వినియోగించుకోవచ్చు. %ాావ్అఅస్త్రంగజష్ఠ్రంగణవటుఖబశ్రీ ఎష్ట్ర్ష్ర్రవవవ% ని ఎంచుకొని ఈ థీమ్‌ని ఛేంజ్ చేయొచ్చు. ఇప్పటికే వాట్సప్ యూజర్లకు ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. యాప్‌ని అప్‌డేట్ చేసుకొని మీరు కూడా దీనిని ట్రై చేయండి.

# లాభాల్లో ప్రారంభమైన దేశీయ మార్కెట్ సూచీలు..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. వాణిజ్య యుద్ధ భయాలతో వరుసగా నష్టాలు చవిచూసిన మార్కెట్లు నేడు.. కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోలుకు దిగడంతో లాభాల బాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ సూచీలు లాభాల్లో ట్రేడవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే నిఫ్టీ 23,100 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టగా.. సెన్సెక్స్ 200 పాయింట్ల లాభంతో ప్రారంభమైంది.

ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 149 పాయింట్ల లాభంతో 76,201 వద్ద.. నిఫ్టీ 40 పాయింట్లు పెరిగి 23,030 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ, టాటా మోటార్స్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, జొమాటో, ఏషియన్ పెయింట్స్, టైటాన్, అల్ట్రా టెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్ నష్టాల్లో కదలాడుతున్నాయి.



# తెరపైకి కోడి రామ్మూర్తి జీవితం: అల్లు అరవింద్

మల్లయోధుడు కోడి రామ్మూర్తి నాయుడి జీవితం ఆధారంగా ఎప్పటికైనా సినిమాగానీ వెబ్‌సిరీస్‌గానీ చేయాలని తాము ఆకాంక్షిస్తున్నట్టు నిర్మాత అల్లు అరవింద్ చెప్పారు. శాకాహారి అయిన ఆయన శారీరక ధారుఢ్యంలో ఎందరికో స్ఫూర్తి అని కొనియాడారు. వెబ్‌సిరీస్‌గా తీయాలనే ఉద్దేశంతో రామ్మూర్తి చరిత్రను కొంత స్టడీ చేశామన్నారు. శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన 'తండేల్' థాంక్యూ మీట్ (%ష్ఠుఱఅవశ్రీ ఎష్ఠుఱఅ౯శీఱ వీవవ%)లో అల్లు అరవింద్ మాట్లాడారు. నాగచైతన్య, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో రూపొందిన సినిమా ఇది. చందూ మొండేటి దర్శకుడు. ఇటీవల విడుదలైన ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు 'తండేల్' టీమ్ ఈవెంట్స్ నిర్వహిస్తోంది. శ్రీకాకుళంలో గురువారం నిర్వహించిన వేడుకలో చైతన్య, సాయి పల్లవి, డైరెక్టర్, నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాసు తదితరులు సందడి చేశారు.



అల్లు అరవింద్ మాట్లాడుతూ.. "శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన కొందరు మత్స్యకారుల జీవితాల్లో చోటుచేసుకున్న సంఘటనల ఆధారంగా మేం ఓ కథ తయారు చేసి, తెరకెక్కించాం. అందుకే ముందుగా ఇక్కడ నుంచే ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పాలని నిర్ణయించుకున్నాం'' అని తెలిపారు.

ప్రశంసలు మీ వల్లే: నాగచైతన్య

"తండేల్' ప్రయాణం ఇక్కడి నుంచే ప్రారంభమైంది. మీ అందరిని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మత్స్యలేశంలోని మత్స్యకారులతో మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకున్నాం. నేను పోషించిన తండేల్ రాజు పాత్రకు ప్రశంసలు దక్కుతున్నాయంటే అది మీ వల్లే. మీరు లేనిదే ఈ పాత్ర లేదు. శ్రీకాకుళం ఓ అద్భుతం" అని నాగచైతన్య అన్నారు.

"సినిమా తీసేందుకు మాకు అనుమతి ఇచ్చిన మీకు ధన్యవాదాలు. ఇందులో బుజ్జి పాత్ర నాకు దక్కినందుకు దేవుడికి థాంక్స్. ఈ సినిమా కోసం నాగ చైతన్య చాలా కష్టపడ్డారు. సినిమా తప్పక విజయం సాధిస్తుందనే నమ్మకం ముందు నుంచీ ఉ ందేది" అని సాయి పల్లవి తెలిపారు.

# రివ్యూ 'బ్రహ్మా ఆనందం'.. బ్రహ్మానందం నటించిన సినిమా మెప్పించిందా

చిత్రం: బ్రహ్మా ఆనందం, నటీనటులు: రాజా గౌతమ్, బ్రహ్మానందం, ప్రియా వడ్లమాని, వెన్నెల కిషోర్, దివిజ, సంపత్ రాజ్, రాజీవ్ కనకాల, తాళ్లూరి రామేశ్వరి తదితరులు.., సంగీతం: శాండిల్య పీసపాటి, ఛాయాగ్రహణం: మితేశ్ పర్వతనేని, రచన, దర్శకత్వం: ఆర్‌వీఎస్ నిఖిల్, నిర్మాత: రాహుల్ యాదవ్ నక్కా విడుదల తేదీ: 14-02-2025



ఈ మధ్య కాలంలో ప్రచార చిత్రాలతోనే అందరి దృష్టినీ ఆకర్షించిన చిన్న చిత్రాల్లో 'బ్రహ్మా ఆనందం' ఒకటి. హాస్య నటుడు బ్రహ్మానందం పేరుతోనే వస్తున్న సినిమా కావడం.. ఇందులో ఆయన, తన తనయుడు రాజా గౌతమ్ తాత-మనవళ్లుగా ప్రధాన పాత్రల్లో నటించడం.. 'మళ్లీరావా', 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ', 'మసూద' లాంటి విజయవంతమైన చిత్రాల్ని అందించిన రాహుల్ యాదవ్ దీన్ని నిర్మించడం.. ప్రభాస్, చిరంజీవి లాంటి అగ్రతారలు దీని కోసం ప్రచారం చేయడం.. ఇలా పలు రకాలుగా ఈ సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దీనికి తగ్గట్టుగానే టీజర్, ట్రైలర్లతో పాటు పాటలు అలరించడంతో దీనిపై ఉన్న అంచనాలు రెట్టింపయ్యాయి. మరి ఈ చిత్ర కథేంటి? సినీప్రియులకు ఎలాంటి అనుభూతి అందించింది? తెలుసుకుందాం పదండి..

కథేంటంటే: బ్రహ్మ అలియాస్ బ్రహ్మానందం (రాజా గౌతమ్) ఓ థియేటర్ ఆర్టిస్ట్. చిన్నప్పుడే తల్లిని.. తండ్రిని కోల్పోతాడు. నాకు నేనే.. నాతో నేనే అన్నట్లు సెల్ఫిష్‌గా బతుకుతుంటాడు. ఎప్పటికైనా పెద్ద నటుడు కావాలన్నది తన లక్ష్యం ( ఈ ప్రయత్నాల్లో ఉండగానే తన గురువు సాయంతో దిల్లీలో జరగనున్న కళారంగ మహోత్సవంలో నాటకం వేసే అవకాశాన్ని అందిపుచ్చుకుంటాడు. అయితే ఇందులో పాల్గొనాలంటే రూ.6 లక్షలు ఇవ్వాలని ఆ వేడుక నిర్వాహకుడు బ్రహ్మను డిమాండ్ చేస్తాడు. దీంతో ఆ డబ్బు సర్దేందుకు రకరకాల ప్రయత్నాలు చేసి విఫలమవుతాడు బ్రహ్మ. సరిగ్గా అప్పుడే వృద్ధాశ్రమంలో ఉండే తన తాత మూర్తి అలియాస్ ఆనంద రామ్మూర్తి (బ్రహ్మానందం) (%దీఱఎవ్రఖుఱఅఱఎఖుఐ%) తన పేరు మీద కోదాడ దగ్గర ఆరెకరాల భూమి ఉ ందని.. తాను చెప్పినట్లు చేస్తే అది తనకు ఇస్తానని చెప్పి బ్రహ్మను ఊరికి తీసుకెళ్తాడు. మరి అక్కడికి వెళ్లాక ఏం జరిగింది? తాను చెప్పినట్లుగా బ్రహ్మకు మూర్తి పొలం రాసిచ్చాడా? దీన్ని ఇవ్వడం కోసం అతను పెట్టిన షరతులేంటి? అసలు మూర్తి వృద్ధాశ్రమంలో ఉండిపోవడానికి కారణమేంటి? తనకు, ఆ వృద్ధాశ్రమంలో పరిచయమైన జ్యోతి (తాళ్లూరి రామేశ్వరి)కి మధ్య చిగురించిన ప్రేమకథ ఏ కంచికి చేరింది? బ్రహ్మను ఎంతో ఇష్టంగా ప్రేమించిన తార (ప్రియా వడ్లమాని) తనని ఎందుకు వదిలి వెళ్లిపోయింది? చివరకు వీళ్లిద్దరూ కలిశారా? బ్రహ్మ నటుడవ్వాలన్న తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్నాడా? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి.

ఎలా సాగిందంటే: ఇది తాత-మనవడు అనుబంధాలతో ముడిపడి ఉన్న కథ. ఆ పాత్రల్ని నిజ జీవితంలో తండ్రీకొడుకులైన బ్రహ్మానందం.. రాజా గౌతమ్ పోషించడం వల్ల ఇది అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ కథ ప్రథమార్ధమంతా పాత్రల పరిచయాలతోనే చాలా నెమ్మదిగా సాగుతుంది. థియేటర్ ఆర్టిస్ట్‌గా బ్రహ్మ పరిచయ సన్నివేశాలు.. తనకెదురయ్యే సవాళ్లు.. మిత్రుడు గిరి (వెన్నెల కిషోర్)తో అనుబంధం.. తారతో ప్రేమాయణం.. బాబాయ్ కుటుంబంతో ఉ న్న విభేదాలు అన్నీ ఆ పాత్రపై ఆసక్తిపెంచేలా చేస్తాయి. బ్రహ్మకు రూ.6 లక్షలు కావాల్సిరావడం.. అందుకోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవడం.. సరిగ్గా అప్పుడే తారతో ప్రేమ కూడా చెడిపోవడం కథను కాస్త రసవత్తరంగా మారుస్తాయి. ఇక ఎప్పుడైతే బ్రహ్మానందం పాత్ర కథలోకి పూర్తిగా ఎంట్రీ ఇస్తుందో.. అక్కడినుంచి సినిమా వేగం పుంజుకుంటుంది పొలం ఇస్తానని తను బ్రహ్మను బలవంతంగా ఊరికి తీసుకెళ్లడం.. ఆ ప్రయాణంలో షరతుల పేరుతో మూర్తి చేసే హంగామా.. బామ్మ ఇల్లు అనుకొని సర్పంచ్ ఇంటికెళ్లి వెన్నెల కిషోర్, రాజా గౌతమ్ చేసే అల్లరి అక్కడక్కడా నవ్వులు పూయిస్తాయి. ముఖ్యంగా ప్రథమార్ధంలో రాజా - వెన్నెల కిషోర్ - బ్రహ్మానందం పాత్రల మధ్య రాసుకున్న కొన్ని ట్రాక్స్, డైలాగ్స్ బాగా పేలాయి. పొలం ఎక్కడ అంటూ మూర్తిని బ్రహ్మ సతాయించే తీరు.. దాని పేరుతో అతనాడే డ్రామా సాగతీతగా ఉంటుంది. ఇక పొలం లేదని తెలిశాక హీరో స్పందించే తీరు.. అక్కడ బ్రహ్మానందం ఇచ్చే ట్విస్ట్ ద్వితీయార్ధంపై ఆసక్తి పెంచేలా చేస్తాయి.

అయితే ప్రథమార్ధంతో పోల్చితే ద్వితీయార్ధం పూర్తిగా గాడి తప్పింది. హీరోని ఏ లక్ష్యం కోసమైతే ఊరికి తీసుకొచ్చాడో.. ఆ ట్రాక్‌ను పూర్తిగా పక్కకు పెట్టేశాడు దర్శకుడు. పైగా అతన్ని బెస్ట్ క్లాస్ పాఠాలు చెప్పే టీచర్‌గా మార్చడం.. ఓ ప్రతినాయకుడి లాంటి వ్యక్తిని పాస్ చేయించే బాధ్యత తనపై పెట్టడం.. ఈ తతంగమంతా కథకు సంబంధం లేనట్లుగా ఉంటుంది. ఇక మూర్తి - జ్యోతిల వృద్ధ జంట ప్రేమకథను వినోదాత్మకంగా నడిపించే ప్రయత్నం చేసినా అదీ సరిగ్గ పండలేదు. వృద్ధాప్యంలో ఓ తోడుండాలని దర్శకుడు చెప్పాలనుకున్న పాయింట్ మంచిదే అయినా దాన్ని భావోద్వేగభరితంగా మనసులకు హత్తుకునేలా చెప్పడంలో తడబడ్డాడు (%దీఱఎవ్రఖుఱ ౹ాఖుఱఅఖుఐ =వఙఐఅవఙ%). క్లైమాక్స్‌లో హీరో తన తప్పుల్ని తెలుసుకొని తాత ప్రేమను గెలిపించడం కోసం నడుం బిగించడం.. ఈ క్రమంలో మూర్తి - జ్యోతిల పెళ్లి చుట్టూ జరిగే డ్రామా.. దీనికోసం సర్పంచ్ ఇంట్లో చేసే హంగామా అన్నీ చాలా సిల్లీగా అనిపిస్తాయి. సినిమాని ముగించిన తీరు ప్రేక్షకుల్ని అసలే మాత్రం మెప్పించదు.

ఎవరెలా చేశారంటే: బ్రహ్మానందం పాత్రలో రాజా గౌతమ్ చక్కగా ఒదిగిపోయాడు. నటనలో పరిణతి కనిపించింది. భావోద్వేగభరిత సన్నివేశాల్లో సహజమైన నటనతో కట్టిపడేశాడు. మూర్తిగా బ్రహ్మానందం ఓవైపు నవ్విస్తూనే.. మరోవైపు ఎమోషనల్‌గా మదిని బరువెక్కించే ప్రయత్నం చేశారు. అయితే రచనలో లోపం వల్ల దర్శకుడు ఆ పాత్రను పూర్తిగా వాడుకోలేకపోయినట్లు అనిపిస్తుంది. గిరి పాత్రలో వెన్నెల కిషోర్ కనిపించినప్పుడల్లా నవ్వించే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా తనకు.. రాజాకు మధ్య సెట్ చేసిన ట్రాక్స్.. అందులో పలికిన కొన్ని వన్‌లైనర్స్ బాగా వర్కవుట్ అయ్యాయి. సర్పంచ్‌గా రాజీవ్ కనకాల ఒకటి, రెండు సన్నివేశాల్లో నవ్వులు పంచారు. సంపత్ పాత్ర కథలో బలవంతంగా ఇరికించినట్లు ఉంటుంది. ప్రియా వడ్లమాని, దివిజ పాత్రలు సినిమాలో అలా వచ్చి ఇలా వెళ్లిపోతుంటాయి. దర్శకుడు చెప్పాలనుకున్న పాయింట్ రొటీన్‌కు భిన్నంగా ఉన్నా.. దాన్ని అందరూ మెచ్చేలా తెరపై చూపించడంలో తడబడ్డాడు. ప్రథమార్ధం చాలా నెమ్మదిగా సాగితే.. ద్వితీయార్ధం పూర్తి గందరగోళంగా నడిచింది. స్క్రీన్‌ప్లేలో బిగి కనిపించదు. క్లైమాక్స్ బాగా నిరుత్సాహపరుస్తుంది. శాండిల్య సంగీతం, మితేశ్ ఛాయాగ్రహణం ఫర్వాలేదనిపిస్తాయి. నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.

# మరో జన్ముంటే.. నీ హృదయంగా పుడతా: నటికి ఆర్థిక నేరగాడు ప్రేమలేఖ

ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ కు.. జైలు శిక్ష అనుభవిస్తోన్న ఆర్థిక నేరగాడు సుఖేశ్ చంద్రశేఖర్ ప్రేమలేఖ రాశాడు. మరో జన్ముంటే ఆమె హృదయంగా పుట్టాలనుందని అన్నాడు. ఆమెకు ప్రైవేట్ జెట్‌ను కానుకగా ఇస్తున్నట్లు తెలిపాడు. "బేబీ.. హ్యాపీ వాలెంటైన్స్ డే. ఈ సంవత్సరం మనకు ఎంతో సానుకూలంగా, ప్రత్యేకమైన విషయాలతో ప్రారంభమైంది. జీవితాంతం ప్రేమికుల రోజును మనం సెలబ్రేట్ చేసుకోవడానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నాం. జాకీ.. నిజంగానే నాకు నువ్వంటే ఎంతో ఇష్టం. ఈ ప్రపంచంలోనే అద్భుతమైన ప్రియురాలివి. పిచ్చివాడిలా నిన్ను ప్రేమిస్తున్నా.




కానుకగా ఇస్తున్నట్లు తెలిపాడు.

వృత్తిపరమైన పనుల రీత్యా నువ్వు వివిధ దేశాలకు ప్రయాణిస్తుంటావు. అందుకే నీకు ఒక ప్రైవేట్ జెట్‌ను కానుకగా ఇస్తున్నా. నీ పేరులోని తొలి అక్షరాలు ఆ జెట్‌పై రాసి ఉంటాయి. అదే విధంగా నీ పుట్టిన రోజు తేదీతో రిజిస్ట్రేషన్ నంబర్ తీసుకున్నా. ఈ జెట్‌లో ఇకపై నీ ప్రయాణాలు సౌకర్యంగా జరుగుతాయి. నాకున్న కోరిక ఒక్కటే. నాకంటూ మరో జన్మ ఉంటే.. నీ హృదయంగా పుట్టాలని ఉంది. ఆవిధంగా నీ గుండె చప్పుడు అవుతా. నీలాంటి అందమైన, అద్భుతమైన మనిషిని ప్రియురాలిగా కలిగి ఉన్నందుకు ఈ భూమ్మీద అదృష్టవంతుడిని నేనే" అని సుఖేశ్ రాసుకొచ్చాడు.

సుఖేశ్ 2020 జూన్ నుంచి మే 2021 వరకు మొబైల్ ఫోన్లు, వాయిస్ మాడ్యూలర్లు వినియోగిస్తూ ర్యాన్‌బ్యాక్సీ మాజీ యజమాని శివిందర్ సింగ్ భార్య అదితి సింగ్‌కు ఫోన్లు చేశాడు. ఆ సెక్రెటరీ అనూప్‌కుమార్‌గా పరిచయం చేసుకొన్నాడు. ఆమె భర్తకు బెయిల్ ఇప్పిస్తానని రూ.200 కోట్లకుపైగా వసూలు చేశాడు. ఈ కేసులో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఈ క్రమంలోనే అతడు జాక్వెలిన్‌తో క్లోజ్‌గా ఉ న్న ఫొటోలు బయటకు వచ్చాయి. ఆమె తన ప్రియురాలని పేర్కొన్నాడు. మరోవైపు సుఖేశ్ చంద్రశేఖర్ తన జీవితాన్ని నరకప్రాయం చేశాడని జాక్వెలిన్ ఫెర్నాండెజ్ వాపోయింది. అతడు తన జీవితంతో ఆడుకొని కెరీర్‌ను నాశనం చేశాడని న్యాయస్థానం ఎదుట వాంగ్మూలం ఇచ్చింది. ఇంత జరిగినా సుఖేశ్ మాత్రం జాక్వెలిన్‌కు జైలులో నుంచి ప్రేమ లేఖలు రాస్తున్నాడు. ప్రతి పండుగకు లేఖ పంపిస్తున్నాడు. క్రిస్మస్ కానుకగా పారిస్‌లో ఒక వైన్ యార్డ్‌ను

# కథ బాగుంటే బామ్మ పాత్ర అయినా చేస్తా: రష్మిక

అగ్రహీరోల సరసన నటిస్తూ వరుస విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్నారు నటి రష్మిక. తాజాగా 'ఛావా'తో ప్రేక్షకులను పలకరించి మెప్పించారు. ఈ సినిమా విడుదల నేపథ్యంలో ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను (జీవితాన్ని సీరియస్‌గా తీసుకోనని.. ఏదో శక్తి తనను నడిపిస్తుందని నమ్ముతానని చెప్పారు."ప్రతి దాని గురించి ఆలోచించడం ప్రారంభిస్తే జీవితం చాలా కష్టతరమవుతుంది. అందుకే నేను దేన్నీ సీరియస్‌గా తీసుకోను. కాలంతోపాటు ముందుకు సాగుతాను. నిజాయతీగా నా పని చేసుకుంటూ పోతాను. ఎవరైనా సినిమా కోసం సంప్రదించినప్పుడు కథకు ప్రాధాన్యమిస్తా. కథ బాగుంటే నలుగురు పిల్లల తల్లిగానైనా నటిస్తాను. బామ్మ పాత్ర చేయడానికి కూడా వెనుకాడను. కథ నచ్చి అందులో నేను భాగం కావాలనుకున్నప్పుడు ఇలాంటి పట్టింపులు ఉండవు. నా సినిమాల విజయం వెనక ఎలాంటి ప్రణాళికలు లేవు. అదృష్టవశాత్తూ అవి ప్రేక్షకాదరణ పొందుతున్నాయంతే. అలాంటి గొప్ప కథల్లో భాగం కావడం నా అదృష్టం. ప్రేక్షకులు ఆ పాత్రల్లో నన్ను ఇష్టపడుతున్నందుకు ఆనందంగా ఉంది. సినిమాల విజయం మన చేతిలో ఉండదు" అని చెప్పారు.



ఇక తన తాజా చిత్రం 'ఛావా' గురించి రష్మిక మాట్లాడుతూ.. "హీరోలందరూ ఇలాంటి కథలో భాగం కావాలని కోరుకుంటారు. ఛత్రపతి శివాజీ మహరాజ్, ఆయన కుమారుడు శంభాజీ మహరాజ్ గురించి మనం పుస్తకాల్లో చదివినప్పుడు భావోద్వేగాలు తెలియవు. వారి జీవితాలను తెరపై చూస్తున్నప్పుడు కళ్లకు కట్టినట్లు అనిపిస్తాయి. అలాంటి గొప్ప వారి వల్లే మనం ఈరోజు దేశంలో ఉండగలుగుతున్నాం. 'ఛావా'లో యేసుబాయిగా నటించే అవకాశం వచ్చినందుకు నిజంగా గర్వపడుతున్నాను. ఇలాంటి మహారాణి పాత్రలో నటిస్తానని ఎప్పుడూ అనుకోలేదు. చాలా సంతోషంగా ఉ ంది" అని అన్నారు.

ప్రస్తుతం రష్మిక రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో 'ది గర్ల్‌ఫ్రెండ్', సల్మాన్‌ఖాన్-మురుగదాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'సికిందర్', అలాగే ధనుష్-శేఖర్ కమ్ముల ఫిల్మ్ 'కుబేర' చిత్రాల్లో నటిస్తున్నారు.

# నేను ప్రశ్నించడం మొదలుపెట్టాక.. అభాండాలు వేస్తున్నారు: మంచు మనోజ్

: ప్రముఖ నటుడు మోహన్‌బాబుకు చెందిన విద్యాసంస్థల సమీపంలో ఉన్న ఒక రెస్టారెంట్‌పై దాడి జరిగిన ఘటన గురించి ఆయన తనయుడు, నటుడు మంచు మనోజ్ ప్రెస్‌మీట్ పెట్టారు. ఈ దాడిని ఖండించిన ఆయన.. అధికారులు ఈవిషయంపై దృష్టి సారించాలని కోరారు. "బౌన్సర్ల సమస్య గురించి గతంలో నేను ఫిర్యాదు చేశాను. పోలీసు అధికారులు వెంటనే స్పందించి నాడు చర్యలు తీసుకున్నారు. అందుకు ధన్యవాదాలు. ఈ దాడి గురించి నాకు గురువారం కాల్స్ వచ్చాయి. బౌన్సర్లు ప్రతిఒక్కరినీ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గొడవైన వెంటనే సీసీ టీవీ ఫుటేజీలూ తీసుకువెళ్లిపోయారు. హైదరాబాద్‌లో నా ఇంట్లో అయినా, బయట ఎక్కడ గొడవలు జరిగినా సీసీ ఫుటేజీ తీసుకెళ్లిపోతుండటం గమనార్హం. ఈ విషయమ్మై దృష్టి సారించాలని స్థానిక ఎమ్మెల్యేను కోరుతున్నా. ఇక్కడి ప్రజలకు ధైర్యం ఇవ్వండి. పది మందికి సాయం చేయడం కోసమే నాన్న ఈ విద్యా సంస్థల్ని ప్రారంభించారు. ఇప్పుడు దీని మేనేజ్‌మెంట్ ఎవరి చేతుల్లో ఉందో అందరికీ తెలుసు. దయచేసి బౌన్సర్లను తొలగించండి. రెస్టారెంట్ యజమాని ప్రాణభయంతో పారిపోయాడు. ఆయనకు ఎన్నోసార్లు బెదిరింపులు వచ్చాయి'' అని మనోజ్ తెలిపారు."ఇక్కడ జరుగుతున్న విషయాల గురించి కొంతమంది విద్యార్థులు నాకు లేఖలు రాశారు. దానిపై నేను ప్రశ్నించడం మొదలుపెట్టాక.. నాపై లేనిపోని అభాండాలు వేస్తున్నారు. పైగా వాటిని కుటుంబ వివాదాలు అని చెబుతున్నారు. నా కుటుంబంలోని మహిళలను టార్గెట్ చేశారు. ఈ వ్యవహారంలో నా వైపు మాత్రమే నిజం ఉంది. ఒక్క ప్రూఫ్ ఉన్నా ఇవ్వమనండి.

# చక్కెర తీపీ చేదూ



తీపి పదార్థాలంటే ఎవరికి ఇష్టముండదు? పరిణామక్రమంలో భాగంగానే మనకు వీటిని తినటం అలవాటైంది. ఆదిమ మానవుల దగ్గరి నుంచి ఆధునిక మానవుల వరకూ అంతా తీపికి దాసులే. దీనికి కారణం వీటిల్లోని చక్కెర. శరీరానికి అవసరమైన శక్తిని అందించటమే కాకుండా ఆనందాన్నీ ఇవ్వటం దీని ప్రత్యేకత. ఇది ఎక్కువైనా, తక్కువైనా ఇబ్బందే. చక్కెర అతిగా తింటే అధిక బరువు, ఊబకాయం, మధుమేహం వంటి జబ్బుల ముప్పు పెరుగుతుంది. అలాగని అతి తక్కువగా తింటే మెదడు, మనసుకు సంబంధించిన రకరకాల సమస్యలు తలెత్తొచ్చు. ఇంత చిత్రమైన చక్కెర కథేంటో? అది మెదడు మీద ఎలాంటి ప్రభావాలు చూపుతుందో? తెలుసుకుందాం.

చక్కెరకూ మనదేశానికీ అనాదిగా విడదీయరాని సంబంధముంది. దీని మీద మనకు గల 'ప్రేమ' అంతా ఇంతా కాదు. ఆ మాటకొస్తే- చెరకు రసాన్ని తొలిసారిగా పంచదార పలుకులుగా మార్చింది మనమే. అదీ 3,000 ఏళ్ల క్రితం. ప్రాచీన ఆయుర్వేద శాస్త్రాచార్యులైన శుశ్రుతుడు మొట్టమొదటిసారిగా మధుమేహంలో మూత్రం తీయగా ఉంటుందని వర్ణించారు. అధికబరువు గలవారిలో, ఎక్కువగా తినేవారిలో ఈ గుణం సాధారణమని క్రీస్తుపూర్వమే వివరించారు. అధర్వణ వేదం కూడా చక్కెరను కోరికతో ముడిపడిన దినుసుగా పేర్కొంది. మన ఆచారాల్లోనూ పంచదార తొలిస్థానంలో నిలుస్తుంది. ఇంటికి కొత్తవాళ్లు వచ్చినా, పాత మిత్రులు, బంధువులు వచ్చినా నోరు తీపి చేయకుండా ఉండలేం. ఇప్పుడంటే మిఠాయిలు ఇస్తున్నాం గానీ ఒకప్పుడు ముందుగా గుప్పెడు పంచదార నోట్లో పోసేవారు. స్వాగతం పలికినా, శుభాకాంక్షలు తెలిపినా, ఆశీర్వదించినా అన్నీ తీపితోనే. పిల్లాడు పరీక్షలకు వెళ్తున్నా, అమ్మాయి ఇంటర్వ్యూకు బయలుదేరుతున్నా తల్లులంతా చేసే మొదటి పని నోరు తీపి చేయటమే. ఇది మెదడు చురుకుగా పనిచేసేలా చేయటమే దీనికి కారణం కావొచ్చు. ఉప్పు దుష్ప్రభావాల గురించి తరచూ మాట్లాడుతుంటారు, ఆందోళన చెందుతుంటారు. కానీ చక్కెర తెచ్చిపెట్టే అనర్థాలను పెద్దగా పట్టించుకోరు. దురదృష్టకరమైన విషయం ఏంటంటే- చక్కెర తినటమనేది సంపదకు చిహ్నంగా భావించటం. ప్రేమ చూపటమంటే పిల్లలకు తీపి పదార్థాలు ఇవ్వటంగానూ భావిస్తుండటం. కానీ మన శరీరం కొద్ది మోతాదుల్లోనే చక్కెరను అనుమతిస్తుంది.

### తక్కువైతే ఏమవుతుంది?

మన శరీరంలోని అన్ని కణాలకు అవసరమైన శక్తిని అందించేంది గ్లూకోజే. ఇదీ ఒకరకం చక్కెరే. మెదడులో కోట్లాది నాడీ కణాలుంటాయి. అందుకే దీనికి ఇంకాస్త ఎక్కువ శక్తి అవసరం. నిజానికి మన శరీరంలోని మొత్తం గ్లూకోజులో సగం వరకూ మెదడే ఉపయోగించుకుంటుంది. ఆలోచనలు, జ్ఞాపకశక్తి, నేర్చుకోవటం వంటి పనులకు ఇది చక్కెర మీద ఆధారపడుతుంది. అందువల్ల ఇది (గ్లూకోజు) తగ్గితే నాడుల మధ్య సమాచారాన్ని చేరవేసే రసాయనాలు (న్యూరోట్రాన్స్‌మిటర్స్) ఉత్పత్తి కావు. నాడుల మధ్య సమాచార వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. ఏకాగ్రత లోపిస్తుంది, విషయగ్రహణ సామర్థ్యం మందగిస్తుంది. డొపమిన్ హార్మోన్ తగ్గటం వల్ల పార్కిన్సన్స్ జబ్బుకు దారితీస్తుంది. అసిటిల్‌కొలీన్ తగ్గటంతో అల్జీమర్స్, మయస్థీనియా గ్రేవిస్ జబ్బుల ముప్పు పెరుగుతుంది. గ్లుటమేట్, గాబా తగ్గటం వల్ల మూర్ఛ రావొచ్చు. సెరటోనిన్ తగ్గితే తీవ్ర కుంగుబాటు తలెత్తొచ్చు.

### వదలని రుచి

తీపి పదార్థాలను వదిలిపెట్టటం మహా కష్టం. మత్తు పదార్థాల మాదిరిగానే చక్కెర కూడా మెదడులోని నాడీ మార్గాలను ఉత్తేజితం చేస్తుంది. చక్కెరను తిన్నప్పుడు మత్తు గ్రాహకాలు ప్రేరేపితమవుతాయి. ఇవి హాయి భావనను కలిగించే డొపమిన్ హార్మోన్‌ను విడుదల చేస్తాయి. ఈ హార్మోన్ మోతాదు తగ్గగానే మళ్లీ తీపిని తినేలా పురికొల్పుతాయి. దీంతో మరింత ఎక్కువగా తినాలనే కోరిక కలుగుతుంది. ఇది వదల్లేని స్థితికీ చేరొచ్చు. ఎందుకంటే వ్యసనంతో ముడిపడిన మెదడులోని భాగాలనూ చక్కెర ప్రేరేపిస్తుంది. కొకైన్‌ను తీసుకున్నప్పుడు మెదడులో ఉత్తేజితమయ్యే భాగాలే చక్కెర తిన్నప్పుడూ ప్రేరేపితమవుతున్నట్టు ఫంక్షనల్ ఎంఆర్ఐ స్కాన్ అధ్యయనాల్లో బయటపడింది.

### వాడకంలో మనమే ముందు

గత శతాబ్దం నుంచీ ప్రపంచవ్యాప్తంగా పంచదార వినియోగం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ప్రపంచంలో అత్యధికంగా చక్కెర ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో రెండో స్థానం మనదే. వినియోగంలోనైతే మొదటిస్థానంలో ఉంటున్నాం. కాకపోతే సగటు వాడకంలో అమెరికాదే పైచేయి. సగటున రోజుకు 24-36 గ్రాముల చక్కెర తీసుకోవచ్చన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు. అమెరికాలో సగటున 126.4 గ్రాములు తీసుకుంటుండగా.. ఉగాండాలో అతి తక్కువగా 2 గ్రాములే తింటారు. మనదేశంలో సగటుకన్నా తక్కువగా రోజుకు 20.5 గ్రాములు తీసుకుంటారు. మనదేశం మధుమేహ రాజధానిగా మారింది. సుమారు 11% మంది మధుమేహంతో బాధపడుతుండగా.. మరో 15% మంది ముందస్తు మధుమేహం (ప్రిడయాబిటిస్) గలవారే. ఇందుకు జీవనశైలి, ఆహార మార్పులే ప్రధానంగా దోహదం చేస్తున్నట్టు ఐసీఎంఆర్-ఇండియాబ్ అధ్యయనం పేర్కొంటోంది. మధుమేహం గలవారిలో పట్టణాల్లో 16% మందికి, పల్లెల్లో 9% మందికి ఇవే ముప్పు కారకాలుగా పరిణమిస్తున్నట్టు వెల్లడించింది. మధుమేహం మూలంగా పక్షవాతం, గుండెజబ్బు, అధిక రక్తపోటు జబ్బులెన్నో ముంచుకొస్తుండటం ఆందోళనకరం.

### ఎక్కువైతే ప్రమాదమే

చక్కెర మరీ ఎక్కువగా తింటే మెదడులో అనుసంధాన వ్యవస్థ క్షీణిస్తుంది. నాడీకణాలను అదుపులో పెట్టే రసాయనాలు అస్తవ్యస్తం కావటం వల్ల ప్రవర్తన, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం సన్నగిల్లుతాయి. జ్ఞాపకశక్తికి కీలక కేంద్రమైన హిప్పోక్యాంపస్ కూడా అస్తవ్యస్తమవుతుంది. దీంతో మతిమరుపు తలెత్తుతుంది. మెదడు పరిమాణమూ కుంచించుకుపోవచ్చు. సూక్ష్మ రక్తనాళాల్లో రక్తం గడ్డలు ఏర్పడొచ్చు. మెదడులో రక్త ప్రసరణ తగ్గుతుంది. విషయగ్రహణ సమస్యలు, మెదడుకు త్వరగా వృద్ధాప్యం రావటం, కుంగుబాటు, ఆందోళన, మెదడులో వాపు తలెత్తుతాయి. మెదడు ప్రొటీన్ (బ్రెయిన్ డిరైవ్డ్‌న్యూట్రోఫిక్ ఫ్యాక్టర్) తగ్గుతుంది. నాడీ కణాల వృద్ధి, మనుగడకు తోడ్పడే దీని మోతాదులు తగ్గితే మెదడు త్వరగా వృద్ధాప్యంలోకి జారుకుంటుంది. చక్కెర ఎక్కువైతే భయం, ఒత్తిడి, ఆందోళన ప్రతిచర్యలు సైతం ఎక్కువవుతాయి. టైప్-2 మధుమేహం గలవారికి అల్జీమర్స్ వచ్చే అవకాశం ఎక్కువ. దీన్ని టైప్-3 మధుమేహమనీ అనటం గమనార్హం.

### మితం మీద దృష్టి

శతాబ్దాలు, దశాబ్దాలుగా చక్కెర మన జీవితాల్లోకి చొచ్చుకొచ్చేసింది. ఈ ధోరణిని మళ్లించటానికి కఠినమైన నియమాలు అవసరం. ప్రస్తుతం తీపి, శక్తి కలిగించే పదార్థాలు ఎక్కడంటే అక్కడ అందుబాటులో ఉంటున్నాయి. ఆదిమ మానవుల మాదిరిగా ఎక్కడికో వెళ్లి తెచ్చుకోవాల్సిన అవసరం లేదు. బిస్కట్లు, చాక్లెట్లు, కేక్‌లు, మిఠాయిలు, కూల్‌డ్రింకుల రూపంలో అన్నిచోట్లా దొరుకుతోంది. దురదృష్టవశాత్తూ ఇప్పటికీ మన మెదళ్లు మన పూర్వీకుల మెదళ్ల మాదిరిగానే పనిచేస్తున్నాయి. దీంతో అవసరం లేకపోయినా ఎక్కువెక్కుగా తీసుకుంటూ వస్తున్నాం. చక్కెర విషయంలో పరిమితి పాటించటం మనందరి కర్తవ్యం. జంక్‌ఫుడ్ లేబుళ్ల మీద హెచ్చరికలు ముద్రించటం, ప్రకటనలను నిషేధించటం వంటి చర్యలతో చిలీ, ఇజ్రాయెల్, సింగపూర్ దేశాలు మంచి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. అక్కడ చక్కెర వినియోగం 18 నెలల్లోనే 25% వరకూ తగ్గటం గమనార్హం.


# ప్రోస్టేట్ క్యాన్సర్ చికిత్సలో కొత్త ఆశ



ప్రోస్టేట్ క్యాన్సర్ వృద్ధిని నిలువరించటానికి ఇండియానా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కొత్త మార్గాన్ని గుర్తించారు. రెండు ప్రొటీన్లను నిలువరించటం ద్వారా కణితులకు పోషకాలు అందకుండా చేయొచ్చని, ఫలితంగా వాటి వృద్ధిని ఆపొచ్చని కనుగొన్నారు. ఇది ప్రాణాంతక ప్రోస్టేట్ క్యాన్సర్‌కు కొత్త చికిత్సల రూపకల్పనకు దారితీయ గలదని ఆశిస్తున్నారు. ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలు వృద్ధి చెందటానికి టెస్టోస్టిరాన్ హార్మోన్ తోడ్పడు తుంది. అందుకే ప్రస్తుతం ప్రధానంగా దీన్ని అడ్డుకునే చికిత్స చేస్తున్నారు. కాకపోతే కణితులు దీన్ని తట్టుకునే సామర్థ్యాన్ని సంతరించుకోవటం పెద్ద అడ్డంకిగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలకు కీలకమైన అమైనో ఆమ్లాలు అందకుండా చేయటం దీనిలోని కీలకాంశం. ఇతర కణితుల మాదిరిగానే ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలు త్వరగా వృద్ధి చెందటానికి బోలెడన్ని పోషకాలు కావాలి. తగినన్ని పోషకాలు అందనప్పుడు జీసీఎన్2 అనే ప్రొటీన్ మరింత ఎక్కువ శక్తిని తయారుచేసుకోవాలంటూ సూచనలు జారీచేస్తుంది. ఈ ప్రొటీన్‌ను నిలువరిస్తే కణాలకు తగినంత శక్తి లభించకుండా చూడొచ్చు. దీంతో కణితి వృద్ధి చెందదు గానీ చావదు. ఇక్కడే పరిశోధకులు పీ53 అనే మరో ప్రొటీన్ సాయం తీసుకున్నారు. కణాలు వృద్ధి చెందకుండా, పోషకాలను సంగ్రహించు కోకుండా అడ్డుకునే ఇది సాధారణంగా ఇతర క్యాన్సర్లలో ఉండదు. కానీ ప్రోస్టేట్ క్యాన్సర్‌లో మాత్రం అలాగే ఉంటుంది. జీసీఎన్2తో పాటు పీ53 ప్రొటీన్‌నూ అడ్డుకోవటం ద్వారా కణితిని నిర్మూలించొచ్చని నిరూపించారు.

# గుండె పునరుజ్జీవిస్తుంది

మనకు ఎక్కడైనా దెబ్బ తగిలినప్పుడు విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుంది. కొద్దిరోజుల్లో గాయమూ మానుతుంది. ఇలాగే గుండె కండర కణాలూ పునరుత్తేజితమైతే? దెబ్బతిన్న గుండె తిరిగి గాడిన పడుతుంది కదా. కృత్రిమ గుండెతో అసలు గుండెకు విశ్రాంతిని కల్పిస్తే ఇది కొందరిలో సాధ్యమవుతున్నట్టు తాజాగా బయటపడింది.



ఒకసారి గుండె విఫలమైతే (హార్ట్ ఫెయిల్యూర్) నయం కావటం అసాధ్యం. మందులు, జీవనశైలి మార్పులతో సమస్య ముదరకుండా చూసుకోవటం తప్పించి చేయగలిగిందేమీ లేదు. శాశ్వత పరిష్కారంగా గుండె మార్పిడి తోడ్పడుతుంది. లేదా లెఫ్ట్ వెంట్రిక్యులర్ అసిస్ట్ డివైస్ (ఎల్‌వీఏడీ) అమర్చుకోవచ్చు. ఈ పరికరం కృత్రిమ గుండె మాదిరిగా పనిచేస్తూ రక్తాన్ని పంప్ చేస్తుంది. ఇవన్నీ చికిత్స మార్గాలే తప్ప గుండెను మునుపటి స్థితికి తీసుకురాలేవు. ఇక్కడే యూనివర్సిటీ ఆఫ్ అరిజోనా కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ హేషమ్ సాడెక్, బృందం నిర్వహించిన తాజా అధ్యయనం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. కృత్రిమ గుండెను అమర్చుకున్న కొందరిలో గుండె కండర కణాలు పునరుజ్జీవం చెందుతున్నట్టు గుర్తించింది.

### ఆ కండరం తీరే వేరు

ఎముకలకు అంటుకొని ఉండే కండరాలు గాయపడిన తర్వాత గణనీయంగా పునరుత్తేజితమవుతాయి. ఉదాహరణకు- క్రికెట్ ఆడుతున్నప్పుడు గాయమైందనుకోండి. కొద్దిరోజులు విశ్రాంతి తీసుకుంటే నయమైపోతుంది. కానీ గుండె కండరం దెబ్బతింటే తిరిగి వృద్ధి చెందదు. కోల్పోయిన కండరం తిరిగి కుదురుకోదు. దీన్ని వెనక్కి మళ్లించటానికి చేయగలిగిందేమీ లేదనే ఇప్పటి వరకూ భావిస్తున్నారు. ఇది పూర్తిగా నిజమేనా? గుండె కండరాలకు పునరుజ్జీవం చెందే సామర్థ్యం ఏమైనా ఉందా? అనే దృష్టితో కొత్త అధ్యయనాన్ని చేపట్టారు.

### ఏంటీ పరిశోధన?

కృత్రిమ గుండెను అమర్చుకున్నవారి నుంచి సంగ్రహించిన కణజాలం ఈ అధ్యయనానికి బీజం వేసింది. ఇందులో కొత్త కణాలేవైనా పుట్టుకొచ్చాయేమోనని కార్బన్ డేటింగ్ పద్ధతితో పరీక్షించారు. ఆరోగ్యంగా ఉన్న గుండెతో పోలిస్తే కృత్రిమ గుండెను అమర్చుకున్నవారిలో ఆరు రెట్ల కన్నా ఎక్కువగా కణాలు పునరుజ్జీవం చెందినట్టు తేలటం ఆశ్చర్యకరం. మానవ గుండె కణాలు నిజంగా పునరుజ్జీవం చెందుతాయనే దానికి సంబంధించి ఇప్పటివరకూ లభించిన బలమైన రుజువు ఇదేనని పరిశోధకులు చెబుతున్నారు. ఇది చాలా ఆసక్తి రేకెత్తిస్తోంది. ఎందుకంటే మనిషి గుండెకు స్వతహాగానే పునరుజ్జీవం చెందే గుణముందని ఇది తెలియజేస్తోంది మరి.


### విశ్రాంతి మహిమ

పుట్టిన వెంటనే గుండె కండర కణాలు విభజన చెందకుండా 'విశ్రాంతి' తీసుకుంటాయి. గుండె పునరుజ్జీవం చెందకపోవటానికి ఇదే కారణం కావొచ్చనే ఊహా సిద్ధాంతాన్నీ ఈ అధ్యయనం బలపరుస్తోంది. పిండస్థ దశలో గుండె కండర కణాలు చురుకుగా విభజన చెందుతాయి. పుట్టిన వెంటనే అవి విభజన చెందటం ఆపేసి, గుండె నిరంతరం కొట్టుకోవటానికి వీలుగా అవి తమ శక్తిని ధారపోస్తున్నాయని సాడెక్ 2011లోనే గుర్తించారు. కృత్రిమ గుండెను అమర్చుకున్నవారిలో కొంత గుండె కండరం పునరుజ్జీవితమవుతున్నట్టూ 2014లో నిరూపించారు. కండరం తిరిగి కోలుకోవటానికి కృత్రిమ గుండె 'విశ్రాంతి' కల్పిస్తోందా? అనే ప్రశ్నలనూ ఇవి రేకెత్తించాయి. ఈ రెండింటికీ ప్రత్యక్ష సంబంధం ఉంటున్నట్టు తాజా అధ్యయనం నిరూపించింది. కృత్రిమ గుండె నేరుగా బృహద్ధమనిలోకి రక్తాన్ని పంప్ చేయటం వల్ల గుండెకు విశ్రాంతి లభిస్తుంది. ఇదే గుండె కణాలు కోలుకోవటానికి అవసరమైన సమయాన్ని కల్పిస్తోందన్నమాట.

### పావు వంతు మందిలోనే ఎందుకు?

కృత్రిమ గుండెను అమర్చుకున్నవారిలో 25% మందిలోనే కణాలు పునరుజ్జీవమవుతున్నాయి. ఇది కొందరిలోనే ఎందుకు సాధ్యమవు తుంది? అందరిలో ఎందుకు కావటం లేదు? అనేవి తెలుసుకోవటం మీద ఇప్పుడు పరిశోధకులు దృష్టి సారించారు. గుండె పునరుజ్జీవానికి తోడ్పడుతున్న కణ యంత్రాంగాన్ని గుర్తించగలిగితే గుండె వైఫల్య చికిత్సలో గొప్ప ముందడుగు పడటం ఖాయం. దెబ్బతిన్న గుండెకు కృత్రిమ గుండెతో కొంతకాలం విశ్రాంతి ఇచ్చి, కోలుకున్నాక అసలు గుండెను పనిచేయించటానికి మార్గం సుగమమవుతుంది.

# పేస్‌మేకర్ ఎంతకాలం?



గుండె నెమ్మదిగా కొట్టుకుంటు న్నప్పుడు పేస్‌మేకర్ ప్రచోదనాన్ని వెలు వరించి, తిరిగి గుండె సరిగా కొట్టుకునేలా చేస్తుంది. ఇది పనిచేయటానికి అవసరమైన శక్తిని బ్యాటరీ అందిస్తుంది. ఈ బ్యాటరీ ఎంతకాలం పనిచేస్తుందనేది కంపెనీ రకం, వాడకం బట్టి ఆధారపడి ఉంటుంది. ఉజ్జాయింపుగా 8 నుంచి 10 సంవత్సరాలు పనిచేస్తుందని చెప్పుకోవచ్చు. సాధారణంగా ప్రతి ఆరు నెలలకోసారి పేస్‌మేకర్‌ను పరీక్షించుకోవాల్సి ఉంటుంది. అప్పుడే అది ఎలా పనిచేస్తోంది? బ్యాటరీ ఇంకా ఎంతవరకూ రావొచ్చు? తీగలు సక్రమంగా ఉన్నాయా, లేవా? అనేవి ఎప్పటికప్పుడు తెలుస్తాయి. బ్యాటరీ నిండుకుంటే మీకు పేస్‌మేకర్‌ను అమర్చటానికి ముందున్న లక్షణాలు, సంకేతాలు (ఉదా: కళ్లు తిరిగి పడిపోవటం, ఆయాసం వంటివి) కనిపిస్తాయి. ఒకవేళ అనుమానమున్నట్టయితే మీరు గుండెలయను పరీక్షించే ఎలక్ట్రోఫిజియాలజిస్ట్‌ను సంప్రదించండి. పేస్‌మేకర్‌ను తనిఖీ చేసి తగు సూచనలు ఇస్తారు. అవసరమైతే బ్యాటరీని మారుస్తారు. ఇక స్టెంట్స్ సరిగా ఉన్నాయో లేవో తెలుసుకోవటానికి సీటీ యాంజియోగ్రఫీ లేదా మామూలు యాంజియోగ్రామ్ ఉపయోగపడతాయి. ఇవి ప్రత్యక్షంగా స్టెంట్స్ తీరును తెలియజేస్తాయి. పరోక్షంగా తెలుసుకోవటానికైతే ట్రెడ్‌మిల్ పరీక్ష తోడ్పడుతుంది. ఆహార జాగ్రత్తల విషయానికి వస్తే- శాకాహారం తినటం మంచిది. కూరగాయలు ఎక్కువగా తినాలి. దుంప కూరలు, వేపుళ్లు, మిఠాయిలు, మాంసం తినకూడదు. నూనె, ఉప్పు తగ్గించాలి. భోజనం కూడా తక్కువ పరిమాణంలో తినాలి. కడుపు నిండా తినొద్దు. కాస్త ఖాళీ ఉంచుకోవాలి.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy